

'ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 324

సోమవారం 7-8-2023



గెలుపు మలుపు విండీస్‌దే

రెండో టి20లోనూ ఓడిన భారత్.. 2 వికెట్ల తేడాతో నెగ్గిన విండీస్ - 12లో



అంబానీ పదవీ కాలం పొడిగింపు

త్వరలో జియో ఫైనాన్షియల్ లిస్టింగ్.. రిలయన్స్ నివేదికలో వెల్లడి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కుటుంబ పాలన.. 'క్విట్ ఇండియా'

కుటుంబ పాలనను తరిమికొట్టేందుకు 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో దేశమంతా ముందుకొస్తోందని ప్రధాని మోదీ చెప్పారు.


వివరాలు 6లో ▸



మణిపూర్‌లో ఆగని అల్లర్లు

మణిపూర్‌లో ఆదివారం అల్లరిమూకలు దాడి చేసి 15 ఇళ్లను, పలు వాణిజ్య సముదాయాలను తగులబెట్టారు.

వివరాలు 6లో ▸



మూత్రం తాగించి..

ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ జిల్లాలో దొంగతనం అనుమానంతో ఇద్దరు బాలురపై కొందరు అమానుష చర్యలకు పాల్పడ్డారు.

వివరాలు 6లో ▸



పాక్‌లో పట్టాలు తప్పిన రైలు

పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో రైలు పట్టాలు తప్పడంతో 30 మంది మరణించగా.. మరో 100 మందికి పైగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

వాగ్గేయకారుడా.. కన్నీటి వందనం


గోసి గొంగడి పాట.. కాలి గజ్జెల మోత
చేత ఎర్రజెండా
పిక్కటిల్లే రేల గొంతుక.. గద్దర్

వసంతకాల మేఘ గర్జన
కదనుతొక్కే ప్రజావాహిక
జన కేతన.. నవ చేతన.. గద్దర్
పల్లవొక తూటా
చరణమొక ఫిరంగి
వేదిక పై వాగ్గేయకారుడు
పెత్తందార్ల వెన్నులో చలి.. గద్దర్

తెలంగాణ సింగడి
దండకారణ్య పచ్చనాకు
బొగ్గుబావి దీపం
రైతుకూలీ కొడవలి.. గద్దర్

పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలం
శ్రమజీవి పాదంపై చెరగని పుట్టుమచ్చ
అతడు చరిత్ర.. జనగళ యుద్ధనౌక.. గద్దర్

ఈ నేల మళ్లీ కనలేని పాట గద్దర్.
మన పాల రాబ్సన్. మన విక్టర్ జారా.
మన బాబ్ మార్లీ. ఒకే ఒక్కడు గద్దర్.
నోరులేని పేదలకు గొంతునిచ్చినవాడా
మహా కవీ... అమర గాయకుడా..
నీకు వీడ్కోలు... రేల పూల మాల.



- గద్దర్ అంటే విప్లవం
- ఓరుగల్లు నుంచి పొలికేక..
- బతికుంటే మళ్లీ వస్తా..
- మేస్త్రీ కొడుకును
- బ్యాంకు ఉద్యోగిగా..

- వివరాలు 2లో

అగ్గి గళం ఆగిపోయింది

ప్రజాగాయకుడు గద్దర్ కన్నుమూత

కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న గద్దర్..
4 రోజుల క్రితమే గుండె ఆపరేషన్
కిడ్నీలు, ఊపిరితిత్తుల సమస్యలు తోడు కావడంతో పరిస్థితి విషమించి మృతి
దశాబ్దాలపాటు ఉద్యమ పాటలతో చైతన్య స్ఫూర్తి నింపిన గద్దర్.. అభిమానుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి భౌతిక కాయం
కడసారి చూపుకోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నేతలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు
నేడు ఉదయం ర్యాలీగా గన్‌పార్కుకు.. అక్కడి నుంచి భూదేవి నగర్‌లోని స్వగృహానికి ర్యాలీగా తరలింపు
సాయంత్రం మహాబోధి విద్యాలయంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

2లో

నేడు, రేపు వరద ప్రభావిత ప్రాంతాల్లో

సీఎం జగన్ పర్యటన

నిరంతరాయంగా సహాయ కార్యక్రమాలు కొనసాగేందుకే తొలుత ప్రాధాన్యం

కలెక్టర్లకు నిధులిచ్చి యుద్ధ ప్రాతిపదికన సాయం అందేలా చర్యలు

- ఇప్పుడు కుదుట పడిన పరిస్థితి.. సాయం అందిన తీరును పరిశీలించేందుకే పర్యటన
- సరికొత్త సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం
- నేడు అల్లూరి, ఏలూరు జిల్లాల బాధిత గ్రామాల ప్రజలతో సమావేశం
- సాయంత్రం రాజమహేంద్రవరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో భేటీ
- రాత్రికి అక్కడే బస.. రేపు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రజలతో మమేకం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమ, మంగళవారాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో.. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి, వరద ప్రభావిత గ్రామాల ప్రజలతో నేరుగా మాట్లాడనున్నారు. వరద సహాయ, పునరావాస చర్యలు అమలు చేసిన తీరుపై స్వయంగా బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకోనున్నారు. గోదావరి వరదలతో అల్లూరి సీతారామరాజు, ఏలూరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఇటీవల పలు ప్రాంతాలు వరద ముంపునకు గురైన విషయం తెలిసిందే. అయితే సహజంగా అలాంటి సమయంలో ముఖ్యమంత్రి ఆ ప్రాంతాల్లో పర్యటించడం పరిపాటి. గత ప్రభుత్వాల్లో అలానే చేసేవారు. అలా చేస్తే అధికార యంత్రాంగం అంతా సీఎం వెంట ఉంటుందని, అప్పుడు బాధితులకు సహాయ కార్యక్రమాలు అందించడానికి ఇబ్బంది ఎదురవుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించారు. హడావుడి, ఫొటో సెషన్ వల్ల ఒరిగేదేమీ ఉండదని భావించారు. బాధితులందరికీ సాయం అందాలంటే తను చేయాల్సింది అలా కాదని, తొలుత సహాయ కార్యక్రమాల కోసం అవసరమైన నిధులు విడుదల చేశారు. బాధితుల తరలింపు, పునరావాస శిబిరాల ఏర్పాటు, ఆహారం, మంచినీరు, మందులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. తద్వారా ఉన్నతాధికారులు, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సహకారంతో

మిగతా 3వ పేజీలో ▶

ప్రణయ్.. రన్నరప్‌తో సరి

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓటమి

చివరి గేమ్‌లో 5 పాయింట్ల అధిక్యాన్ని వృథా చేసుకున్న భారత స్టార్

12లో

పక్కాగా 'అసైన్డ్' మార్పు

వీఆర్వో నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఏం చేయాలో నిర్దేశించిన రాష్ట్ర ప్రభుత్వం

- అసైన్డ్ భూముల సవరణ చట్టం అమలుకు మార్గదర్శకాలు జారీ
- గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు పూర్తిస్థాయి వెరిఫికేషన్, క్రాస్ చెకింగ్
- ఆ తర్వాతే యాజమాన్య హక్కులు కల్పించే అసైన్డ్ భూముల జాబితా
- వాటిని 22 (ఎ) జాబితా నుంచి తొలగించాలని జిల్లా రిజిస్ట్రార్లకు కలెక్టర్ల ప్రతిపాదనలు

14లో



'మరణ'హోమమే లక్ష్యం!

పోలీసులను చంపి.. ఆపై కాల్పులు ఓపెన్ చేయించేలా ప్లాన్



- అది కుదరకపోతే పుంగనూరును వల్లకాడు చేయాలని టార్గెట్
- తద్వారా ప్రభుత్వాన్నే కూల్చేసి.. లబ్ధి పొందాలని టీడీపీ కుట్ర.. ఒక్క బుల్లెట్ కూడా వాడొద్దని ఎస్పీ రిషాంత్ ఆదేశం
- వారిని చెదరగొట్టేందుకు పక్కటి ప్లాన్ సూచిస్తూ దిశా నిర్దేశం
- ప్రాణాలు అడ్డుపెట్టి టీడీపీ కుట్ర చిత్తు చేసిన పోలీసులు

3లో

ఫ్యాక్ట్ చెక్

ఒరిగిపోలేదు.. పెరిగిపోయింది

- ఒరిగిపోలేదు రామోజీ వయ్యారిభామలే!.. రాష్ట్రంలో మరింత పెరిగిన వరి సాగు
- గత సర్కారు హయాంతో పోలిస్తే దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో అదనంగా వరి పంట
- దిగుబడుల పెరిగినా ఘనంగానే
- విత్తు నుంచి విక్రయం వరకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- పెట్టుబడి సాయం నుంచి ఫలసాయం పొందేదాకా తోడ్పాటు.. సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ
- నాడు దళారీలదే రాజ్యం... నేడు ప్రతి గింజ కొనుగోలు
- గన్నీ బ్యాగ్‌లు, హమాలీ, రవాణా చార్జీల భారం సైతం ప్రభుత్వానిదే

14లో


1,033 పంచాయతీల్లో 19న ఉప ఎన్నికలు

484 మండలాల పరిధిలో నిర్వహణ

- వివరాలు 14లో

నాలుగేళ్లలో రెట్టింపు

ఏపీ స్థూల ఉత్పత్తిపై 'ఎస్‌బీఐ రీసెర్చ్' నివేదికలో వెల్లడి



వచ్చే నాలుగేళ్లలో రూ.20 లక్షల కోట్లకు చేరుకోనున్న జీఎస్‌డీపీ

తెలంగాణను అధిగమించనున్న ఆంధ్రప్రదేశ్

- 2027 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- దేశ జీడీపీలో 15 రాష్ట్రాల వాటా ఏకంగా రూ.358.40 లక్షల కోట్లు
- ఐదు శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్‌ది 7వ స్థానం
- ఏపీ సహా పలు రాష్ట్రాలు ఏకంగా కొన్ని దేశాల జీడీపీని అధిగమించ వచ్చని అంచనా

ఏపీ జీఎస్‌డీపీ 2022–23లో 16 శాతం వృద్ధితో 13 లక్షల కోట్లకు చేరింది. 2027 నాటికి రూ.20 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. అంటే నాలుగేళ్లలో ఏపీ స్థూల ఉత్పత్తి దాదాపు రెట్టింపు కానుంది.

సాక్షి, అమరావతి: వచ్చే నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రెట్టింపు కానుంది. ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ ఏకంగా రూ.20 లక్షల కోట్లకు చేరుకోనున్నట్లు 'ఎస్‌బీఐ రీసెర్చ్' నివేదిక వెల్లడించింది. 2022 సంవత్సరం నుంచి ఏపీ వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2027 నాటికి దేశ ఆర్థిక పరిస్థితితోపాటు ఏపీ సహా 15 రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల తీరు తెన్నులపై 'ఎస్‌బీఐ రీసెర్చ్' నివేదికను విడుదల చేసింది. 2027 నాటికి తెలంగాణను అధిగమించి ఆంధ్రప్రదేశ్ స్థూల ఉత్పత్తి పెరుగుతుందని నివేదిక స్పష్టం చేసింది.

'ఎస్‌బీఐ రీసెర్చ్' ముఖ్యాంశాలివీ..

- దేశంలో 2022 నుంచి వృద్ధి వేగం పుంజుకుంది. 2027 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది.
- దేశ ప్రస్తుత వృద్ధి రేటును పరిగణలోకి తీసుకుంటే 2027 నాటికి జపాన్, జర్మనీలను అధిగమిస్తుంది. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా నాలుగు శాతాన్ని దాటుతుంది. ప్రపంచ దేశాల జీడీపీలో భారత్ 2014లో పదో ర్యాంకులో

మిగతా 14వ పేజీలో ▶

ఆరోగ్యానికి 'ప్లానెట్ ఫ్రెండ్లీ' డైట్

పర్యావరణ అనుకూల ఆహారంతో క్యాన్సర్, గుండె జబ్బుల మరణాలు తగ్గుదల	పండ్లు, కూరగాయలు, తృణధాన్యాల ఆహారమే మేలంటున్న హార్వర్డ్ వర్సిటీ పరిశోధకులు	మాంసం, డెయిరీ ఉత్పత్తులతో పర్యావరణంలో అధిక కర్బన ఉద్గారాల విడుదల	మొక్కల ఆధారిత ఆహారంతో ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి నష్టం తక్కువ



సాక్షి, అమరావతి: పర్యావరణ అనుకూల ఆహారం (ప్లానెట్ ఫ్రెండ్లీ డైట్) అనారోగ్య కారణాలతో సంభవించే మరణాలు ముప్పును తగ్గిస్తుందని హార్వర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు కనుగొన్నారు. పర్యావరణ అనుకూల ఆహారం తీసుకుంటే క్యాన్సర్, మధుమేహం, స్ట్రోక్, గుండె, శ్వాస వ్యాధుల నుంచి వచ్చే మరణాలు 25 శాతం తగ్గుతాయని తాజా అధ్యయనంలో తేల్చారు. మాంసం, చేపలు, గుడ్లు, డెయిరీ ఉత్పత్తులను ఆహారంగా తీసుకునే వారితో పోలిస్తే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు అధికంగా పోషకాలు ఉండే మొక్కల ఆధారిత ఆహారాన్ని తినే వారిలో మరణాల అవకాశం తక్కువగా ఉందని స్పష్టం చేశారు. దాదాపు 30 ఏళ్ల పరిశోధనలో లక్ష మందికి పైగా ఆహారపు అలవాట్లను ట్రాక్ చేశారు. ఈ క్రమంలోనే అమెరికన్ సొసైటీ ఫర్ న్యూట్రిషన్ వార్షిక సమావేశంలో న్యూట్రిషన్–2023లో పర్యావరణ అనుకూలిత ఆహార వినియోగంపై ప్లానెటరీ హెల్త్ డైట్ ఇండెక్స్ పేరుతో కొత్త డైట్ స్కోర్‌ను ప్రతిపాదించారు. దీనిని నీరు, భూ వినియోగంతో పాటు కర్బన ఉద్గారాలను పరిమితం చేసి పర్యావరణంపై తక్కువ నష్టం చూపించే ఆహారంగా పేర్కొన్నారు.

1986లో మొదలుపెట్టి..

ఆరోగ్యం, పర్యావరణం రెండింటిపై ఆహార ప్రభావాలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ, శాస్త్రీయ ఆధారాలతో డైట్ స్కోర్‌ను ప్రతిపాదించారు. 1986 నుంచి 2018 వరకు లక్ష మంది అధ్యయనంలో పాల్గొన్నారు. ఇందులో 47 వేల మంది మరణించారు. ఎక్కువ పీహెచ్‌డీఐ స్కోరు ఉన్న వారికి మరణాల అవకాశాలు

మిగతా 14వ పేజీలో ▶

మాంసం ద్వారానే కర్బన ఉద్గారాలు

ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల్లో ఆహార ఉత్పత్తి రంగం వాటా 35 శాతం ఉంది. వీటిలో 57 శాతం మాంసం, పాల ఉత్పత్తుల నుంచే వస్తోంది. ఒక కిలో ఆహారంలో కర్బన ఉద్గారాలు గొడ్డు మాంసం వల్ల అత్యధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. ఆ తర్వాత గొర్రె, షెల్ఫిష్, డెయిరీ ఉత్పత్తులు ప్రాసెసింగ్, రవాణాతో మరిన్ని ఉద్గారాలు వెలువడుతున్నాయి. వీటికి పూర్తి భిన్నంగా గింజలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు కిలో గ్రాము ఆహారానికి అతి తక్కువ మొత్తంలో కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేస్తాయి. ఫలితంగా మొక్కల ఆధారిత ఆహారం పర్యావరణంపై చేసే నష్టం తక్కువగా ఉంటుంది. మాంసాహారం కోసం విచ్చలవిడిగా పశువులను పెంచడం పెను సమస్యలను తెచ్చిపెడుతోంది. పశువులకు కావాల్సిన ఆహారం కోసం/పశుగ్రాసం పెంచడానికి అడవుల నరికివేతతో వాతావరణంలోకి టన్నుల కొద్దీ కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతోంది. పశువులు, గొర్రెలు, మేకలు ఆహారాన్ని జీర్ణం చేసేటప్పుడు గాలిలో మీథేన్ విడుదల పెరిగిపోతోంది.

మెదక్ జిల్లా తూప్రాన్‌లోని గద్దర్ నివాసం..



మేస్త్రీ కొడుకును..

మెదక్: మాది మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామం. రెండు చెరువులు, ఏడు నీటి గుంటలు, పచ్చని పైర్లు.. అన్ని రకాల కులవృత్తుల వారు ఉండేవారు. గుడి, బడితో నా ఊరు ఎప్పుడు కళకళలాడుతుండేది. మా నాన్న గుమ్మడి శేషయ్య మేస్త్రీ. పనినిమిత్తం ఊరూరా తిరిగేవారు. ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లో పనిచేశారు. అక్కడ కట్టించిన మలింద విద్యాలయం నిర్మాణంలో మా నాన్న పనిచేశారు. అంబేడ్కర్‌ను దగ్గర నుంచి చూశారు. ఆయన ప్రభావంతోనే మా నాన్న తినడానికి తిండి లేకపోయినా బిడ్డల్ని స్కూల్‌కు పంపేవాడు. సంతకం పెట్టడం రాకపోయినా హిందీ, మరాఠీ, ఉర్దూ భాషల్లో మాట్లాడేవారు. ఏడాదిలో నెల రోజుల కంటే ఎక్కువ రోజులు ఊళ్లో ఉండేవారు కాదు. నాకు ఒక అన్నయ్య ముగ్గురు అక్కాచెల్లెలు ఉన్నారు. అమ్మ, అన్నయ్య ఊర్లోనే ఉండేవారు. అమ్మ పనికి వెళ్లేది. నేను అజ్ఞాతంలో ఉన్నప్పుడు అమ్మని చూడడానికి మారువేషంలో వెళ్లేవాడిని. అమ్మ చనిపోయినప్పుడు నా చిన్న కొడుకు కూడా చనిపోయాడు.

గుండెచప్పుడు ఆగలేదు.. గుండెకే గాయమైంది

గద్దర్ చివరి లేఖ



అపోలోలో జానాతో ఉల్లాసంగా..

సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రిలో చేరిన తర్వాత గద్దర్ చివరగా ఒక లేఖ రాశారు. ''గుమ్మడి విఠల్ నాపేరు. గద్దర్ నాపాట పేరు. నా బతుకు సుదీర్ఘ పోరాటం. నా వయస్సు 76 ఏళ్లు. నా వెన్నుపూసలో ఇరుక్కున్న తూటా వయస్సు 25 ఏళ్లు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్రకు మద్దతుగా 'మా భూములు మాకే' నినాదంతో ఆ యాత్రలో ఇటీవల నేను పాల్గొన్నాను. నా పేరు జనం గుండెలచప్పుడు. నా గుండె చప్పుడు ఆగిపోలేదు. కానీ ఎందుకో గుండెకు గాయమైంది. ఈ గాయానికి చికిత్స కోసం అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో చేరా. జూలై 20వ తేదీ నుంచి అన్నిరకాల పరీక్షలు, చికిత్సలు తీసుకుంటూ కుదుటపడుతున్నాను..'' అంటూ తన అభిమానులకు లేఖ రాశారు.

విమానం ఎక్కలేదు.. విదేశాలకు పోలేదు

మంచిర్యాలఅర్బన్: గద్దర్ గళం..దేశవిదేశాల్లో ఎందరో అభిమానాన్ని చూరగొన్నది. ఆయన పాట వినేందుకు విదేశాల నుంచి అభ్యుదయ, సాంస్కృతిక సంఘాల నుంచి ఆహ్వానం వచ్చినా విమానం ఎక్కి వెళ్లలేకపోయారు. 1997, ఏప్రిల్ 6న ఆయనపై కాల్పులు జరగ్గా, ఆరు బుల్లెట్లు శరీరంలోకి చొచ్చుకుపోయాయి. ఐదు బుల్లెట్లను తొలగించిన వైద్యులు, వెన్నుపూసలో ఉన్న మరో బుల్లెట్ తొలగిస్తే ప్రాణానికే హాని ఉంటుందని చెప్పారు. దీంతో అప్పటి నుంచి ఆ బుల్లెట్ శరీరంలోనే ఉండిపోయింది. దేశంలో ఇతర రాష్ట్రాల పర్యటనకు ఎయిర్‌పోర్ట్‌కు గద్దర్ వెళ్లినా, తనిఖీల్లో స్కానర్‌లో బుల్లెట్ చూపడం, అధికారులకు సమాధానం చెప్పడంలో అనేకసార్లు ఇబ్బంది పడినట్లు తెలిసింది. శరీరంలో బుల్లెట్, కేసులు పాస్‌పోర్టు జారీకి అడ్డంకిగా మారాయి. దీంతో ఎన్ని ఆహ్వానాలు వచ్చినా విమానం ఎక్కి విదేశాలకు వెళ్లలేకపోయారు.

- 1980 సమయంలో నక్సల్స్‌తో కలసి అజ్ఞాతంలోకి వెళ్లారు.
- పీపుల్స్‌వార్ పార్టీ నిర్ణయం మేరకు 1982లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి కాలపు జననాట్యమండలి సభ్యుడిగా పనిచేశారు.
- 1990 ఫిబ్రవరి 18న తిరిగి బహిరంగ జీవితంలోకి అడుగుపెట్టారు.
- 1995లో పీపుల్స్‌వార్ పార్టీ గద్దర్‌ను బహిష్కరించింది. ఆయన తీవ్రంగా ఆవేదనకు గురవడంతో తిరిగి పార్టీలోకి ఆహ్వానించింది.

అగ్గిగళం ఆగిపోయింది

ప్రజా గాయకుడు గద్దర్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్

తన పాటలతో ప్రజా బాహుళ్యాన్ని ఉర్రూతలూగించిన ప్రజా గాయకుడు గుమ్మడి విఠల్ అలియాస్ గద్దర్ ఇక లేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గత నెల 20న గుండె పోటుతో అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చేరారు. గుండె రక్తనాళాలు మూసుకుపోయినట్టు నిర్ధారించిన వైద్యులు ఈ నెల 3న శస్త్రచికిత్స చేసి సరిచేశారు. కానీ ముందు నుంచే మూత్ర పిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. 'ఆదివారం ఉదయం అకస్మాత్తుగా రక్తపోటు పెరిగింది. షుగర్ లెవల్స్ పడిపోయాయి. మధ్యాహ్నానికల్లా శరీరంలోని పలు అవయవాలు పనిచేయడం ఆగిపోయాయి. ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినా.. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తుదిశ్వాస విడిచారు..''అని ఆస్పత్రి అధికారులు హెల్త్ బులెటిన్‌లో వెల్లడించారు.

అభిమానుల కోసం ఎల్‌బీ స్టేడియానికి..

గద్దర్ భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం సాయంత్రం 5 గంటల సమయంలో ఎల్‌బీ స్టేడియానికి తరలించారు. పెద్ద సంఖ్యలో నేతలు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు అక్కడికి చేరు కుని నివాళులు అర్పించారు. మంత్రి కేటీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మధుయాష్కీ, ఎమ్మెల్యే సీతక్క, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ప్రజా గాయకురాలు విమలక్క తదితరులు నివాళి అర్పించి గద్దర్ సతీమణిని ఓదార్చారు. జోహార్ గద్దర్, అమర్ రహే గద్దరన్న అంటూ అభిమానులు చేసిన నినాదాలతో ఎల్‌బీస్టేడియం హోరెత్తింది.

నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

గద్దర్ భౌతికకాయానికి పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు గద్దర్ స్థాపించిన మహాబోధి విద్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. తొలుత సోమవారం ఉదయం గద్దర్ భౌతికదేహాన్ని అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్కు వద్ద కొద్దిసేపు ఉంచి నివాళులు అర్పించనున్నారు. తర్వాత నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు, తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు అల్వాల్ వెంకటాపూర్ భూదేవీనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించనున్నారు. అక్కడ స్థానికుల సందర్శనార్థం కాసేపు ఉంచి.. మహాబోధి విద్యాలయంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

25 ఏళ్లుగా వెన్నులో బుల్లెట్‌తో



గద్దర్‌పై చాలా సార్లు హత్యాయత్నాలు జరిగాయి. నల్లదండు ముఠా, బ్లాక్ టైగర్స్, గ్రీన్ టైగర్స్ ముఠాలు ఆయనను చంపడానికి ప్రయత్నించాయి. ఉమ్మడి ఏపీకి చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. గ్రీన్‌టైగర్స్ పేరుతో కొందరు ఆగంతకులు ఆయనపై కాల్పులు జరిపారు. ఆయన ప్రాణాలకు ప్రమాదమని ఒక బుల్లెట్‌ను వదిలేశారు. దీనితో దాదాపు 25 ఏళ్లుగా ఆ బుల్లెట్ గద్దర్ ఒంట్లోనే ఉండిపోయింది.

''రాష్ట్ర అణచివేతకు చిహ్నంగా నా వెన్నెముకలో బుల్లెట్ అలాగే ఉంది. దానితో నాకు భయమేమీ లేదు, ఏ ప్రభావమూ పడలేదు. నా లక్ష్యాలకు కట్టుబడి ప్రజల కోసం పనిచేస్తూనే ఉన్నా.. పనిచేస్తూనే ఉంటా..'' అని గద్దర్ తరచూ గుర్తు చేసుకునేవారు.

గోచీ, గొంగళి.. చేతి కర్ర, ఎర్ర జెండా..

గద్దర్ పాటకు ఎంత ప్రాచుర్యం ఉందో, ఆయన ఆహార్యానికీ అంతే ప్రాముఖ్యత ఉంది. ఒంటిపై చొక్కా లేకుండా గొంగళి కప్పుకుని, ఎర్ర జెండా చుట్టిన కర్రతో, కాళ్లకు గజ్జెలు కట్టి గద్దర్ స్టేజీపై ఆడి, పాడుతుంటే లక్షలాది మంది కళ్లు, చెవులు అప్పగించేసేవారు. జీరబోయిన గొంతుతో పాటకట్టే విధానానికి లక్షల మంది అభిమానులు ఉన్నారు. మావోయిస్టు ఉద్యమానికి దూరమైన తర్వాత గద్దర్ వేషధారణ సైతం మారింది. పలుమార్లు ప్యాంట్, షర్ట్, కోట్‌లోనూ కనిపించారు.

70 ఏళ్ల వయసులో.. ఓటర్‌గా నమోదై..



నక్సల్, మావోయిస్టు ఉద్యమ పంథాలో నడిచిన గద్దర్.. బూర్జువా పార్టీల, ఎన్నికల వ్యవస్థలో పాలు పంచుకోబోనంటూ ఓటర్‌గా కూడా నమోదు చేసుకోలేదు. మావోయిస్టుల నుంచి దూరమైన తర్వాత 2018లో తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకుని.. ఆ ఏడాది డిసెంబర్ 7న జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేశారు. ''పోరాటం అంటే తుపాకుల పట్టుకోవడం కాదు.. తిరుగుబాటు చేయడం అని గుర్తించి ప్రజా జీవితంలోకి వచ్చా. రాజ్యాంగమే మనకు రక్ష అన్న విషయాన్ని తెలుసుకుని మొదటిసారి ఓటు హక్కును తీసుకున్నా.. 70 ఏళ్లు నిండాక తొలిసారి ఓటు వేశా. ఓట్ల యుద్ధానికి సిద్ధమయ్యే క్రమంలో గోచీ, గొంగడి, గజ్జెలు జమ్మిచెట్టు మీద పెట్టిన..'' అని ఆ సమయంలో గద్దర్ ప్రకటించారు.

– తర్వాత ఆయన 'గద్దర్ ప్రజాపార్టీ' పేరిట ఒక రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా ఉద్యమాన్ని కొనసాగిస్తానని ప్రకటించారు. మావోయిస్టులు కూడా తమ వ్యూహాన్ని మార్చుకోవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మహాబోధి విద్యాలయ ఏర్పాటు

అల్వాల్: స్థిరమైన జీవితం లేదని చాలాచోట్ల వలస కార్మికుల పిల్లలను బడిలో చేర్చుకునేవారు కాదు. దీంతో గద్దర్ అందరికీ విద్య అందించాలన్న సంకల్పంతో భూదేవినగర్‌లో మహాబోధి విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆయన సతీమణి విమల, కూతురు వెన్నెల ఈ పాఠశాల బాధ్యతలు చూసుకుంటున్నారు.



గద్దర్ భౌతికకాయం...

బుర్రకథలతో చైతన్య పరుస్తూ..

ఉమ్మడి మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన లక్ష్మమ్మ, శేషయ్య దళిత దంపతులకు 1949లో గద్దర్ జన్మించారు. అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు. సొంత ఊరిలోనే ఏడో తరగతి వరకు చదివిన ఆయన.. తర్వాత నిజామాబాద్ జిల్లా బోధన్‌లో, వరంగల్‌లో పైచదువులు కొనసాగగా.. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివారు. గ్రామంలో ఉన్నప్పుడే ఒగ్గుకథ, బుర్ర కథ, ఎల్లమ్మ కథలు, భాగవత రూపంలో రైతులు, కార్మిక లోకాన్ని చైతన్య పరిచారు. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నారు. ఊరూరా తిరిగి బుర్రకథల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకుడు బి.నర్సింగరావు భగత్‌సింగ్ జయంతి రోజున గద్దర్‌తో ఒక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రతి ఆదివారం గద్దర్ తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో నర్సింగరావు ప్రోత్సాహంతో గద్దర్ తన మొదటి పాట 'ఆపరా రిక్షా'రాశాడు.

గదర్ అంటే విప్లవం



బ్యాంక్ ఉద్యోగిగా..

సిక్కు కూలీలు, పనివాళ్లు పెట్టుకున్న పార్టీ పేరు గదర్.. గదర్ అంటే విప్లవం అని అర్థం. దీని నుంచి స్ఫూర్తి పొంది ఆయన రాసిన పాటల మొదటి ఆల్బంకు గదర్ అని పెట్టారు. ఇది ప్రజల్లోకి వెళ్లి ఆయన గద్దర్‌గా నిలిచిపోయారు. 1975లో కెనరా బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఆయన నక్సల్ మార్గం పట్టారు. 1982లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి.. ఉద్యమ బాట పట్టారు. 1985లో కారంచేడులో దళితుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడారు. జన నాట్య మండలిలో చేరారు. ఒగ్గు కథలు, బుర్ర కథల ద్వారా గ్రామీణ ప్రజల్లోకి వెళ్లారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్రజా సమస్యలపై పాటల రూపంలో కోట్ల మంది హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.






వంగపండుతో..



గోరటి పాట.. గద్దర్ ఆట






ఉద్యమ సమయంలో..



ఉద్యమ నేతతో..






రాహుల్‌తో ఆప్యాయంగా..



యాదాద్రిలో...

ప్రజాగాయకుడు గద్దర్ సినిమా రంగంపైనా తనదైన ముద్ర వేశారు. సాయిచంద్ హీరోగా గౌతమ్ ఘోష్ దర్శకత్వం వహించిన 'మా భూమి'(1979) సినిమాలో తొలిసారి వెండితెరపై పాట పాడటంతోపాటు నటించారాయన. ఈ సినిమాలో 'బండెనక బండి కట్టి..' అనే పాటలో గద్దర్ కనిపిస్తారు. ఆ తర్వాత బి.నర్సింగరావు నటించి, దర్శకత్వం వహించిన 'రంగుల కల'(1983) చిత్రంలో ఓ ప్రధానపాత్ర పోషించారు. జగపతి బాబు హీరోగా ఎన్.శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ'(2011) మూవీలో కీలకపాత్రలో నటించారాయన. ఆర్.నారాయణ మూర్తి నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'దండకారణ్యం'(2016), సుడిగాలి సుధీర్ నటించిన 'సాఫ్ట్‌వేర్ సుధీర్'(2019), చిరంజీవి హీరోగా మోహన్‌రాజా తెరకెక్కించిన 'గాడ్ ఫాదర్'(2022) సినిమాల్లోనూ నటించారు. ఆర్.నారాయణమూర్తి హీరోగా దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'ఒరేయ్ రిక్షా' సినిమాలో గద్దర్ పాటరాయగా, 'వందేమాతరం' శ్రీనివాస్ స్వరపరిచి, గానం చేసిన 'మల్లెతీగకు పందిరి వోలే..' పాట అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని తెలిపే పాటల్లో ఒకటిగా నిలిచింది. 'జై బోలో తెలంగాణ' మూవీ కోసం గద్దర్ రాసిన 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా..' పాట సూపర్ హిట్ అయ్యింది. ఈ రెండు పాటలకు నంది అవార్డులు(రచయిత, గాయకుడుగా) గద్దర్‌కు వచ్చాయి.



'మా భూమి'లో..

'బండెనక బండి కట్టి'తో వెండితెరపైకి..

గద్దర్‌కు రెండు నంది అవార్డులు

విప్లవ ఉద్యమంలో ఉన్నవారు అవార్డులు, రివార్డులు తీసుకోకూడదనే నిబంధన ఉండటంతో నంది అవార్డులు తీసుకోలేదని గద్దర్ ఓ సందర్భంలో చెప్పారు. ఇటీవల విడుదలైన ఆర్.నారాయణమూర్తి 'యూనివర్సిటీ' చిత్రంలోనూ ఆయన పాటలు రాశారు. ఇవే కాదు, ఆయన రాసిన మరికొన్ని పాటలు సినిమాల్లో ప్రేక్షకులను అలరించాయి. 'నేను రాసిన వేల వేల పాటలకు నా భార్య విమలే స్ఫూర్తి అని గద్దర్ గతంలో 'సాక్షి'కి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి తన పాటలంటే ఎంతో ఇష్టమని, ఆయనపై వ్యతిరేకంగా పాడినా మెచ్చుకునేవారని 2017 జూన్‌లో 'మెజార్టీకే రాజ్యాధికారం'అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు కడప వచ్చిన సందర్భంలో గద్దర్ అన్నారు. గద్దర్ నటించిన చివరిచిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, స్వీయదర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం నేపథ్యంలో రూపొందింది. ఈ మూవీలో గద్దర్ కీలక పాత్ర పోషించడంతో పాటు పాటలు రాశారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

కుటుంబమంటే ఎంతో మమకారం



బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే గద్దర్ వివాహం చేసుకున్నారు. ఆయన భార్య పేరు విమల. వీరికి ముగ్గురు పిల్లలు. సూర్యకిరణ్, చంద్రకిరణ్ (2003లో అనారోగ్యంతో మరణించారు), కూతురు వెన్నెల. గద్దర్‌కు సరస్వతిబాయి, శాంతాబాయి, బాలమణి బాయి అని ముగ్గురు అక్కలు. నర్సింగ్‌రావు అనే అన్న ఉన్నారు. గద్దర్‌కు కుటుంబమంటే ఎంతో ప్రాణం. భార్య విమల సహకారాన్ని తరచూ గుర్తు చేసుకునేవారు. తాను ఉద్యమంలో ఉన్నప్పుడు కుటుంబానికి, తనకు ఆమె అండగా ఉన్న తీరును చెప్పేవారు.

ఆ పాటలు అగ్ని కణాలు..

అమ్మ కష్టం మొదలు సమాజంలో అనేక విషయాలపై పాటలు రాసిన గద్దర్.. రచయితగా తాను రాసిన అనేక పాటలకు అప్పటికప్పుడు పల్లవులు కట్టేవారు. తొలినాళ్లలో కుటుంబ నియంత్రణ, పారిశుద్ధ్యం వంటి సామాజిక విషయాలపై బుర్ర కథల ద్వారా అవగాహన కల్పించేవారు. తర్వాత స్వయంగా పాటలు రాశారు. 1970వ దశకంలో ఉద్యమానికి బాసటగా నిలిచిన జననాట్యమండలితో కలసి గద్దర్ సామాజికంగా దోపిడీకి గురైన వర్గాలకు గొంతుకగా మారారు. 'పోదమురో జనసేనతో కలిసి, పోదమురో ఎర్రసేనతో కలిసి..' అని గద్దర్ రాసి, పాడిన పాట అసంతృప్తితో మండుతున్న యువత నక్సల్ ఉద్యమంలో చేరి తుపాకులు పట్టేలా చేసింది. 1990 ఫిబ్రవరి 18న జననాట్య మండలి ఆధ్వర్యంలో గద్దర్ హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభకు ఏకంగా 2 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు.



విప్లవానికి ఊపిరినిచ్చి.. ఉద్యమానికి ఊపు తెచ్చి..

గద్దర్ పాట అంటేనే ఒక ఉప్పెన.. మొదట్లో బుర్రకథలతో ప్రజలు చైతన్యాన్ని కలిగించినా, నక్సలైట్ల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచినా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చినా.. ఆయన గొంతు సైరన్ మోగించేది. దొరలు, పాలకుల దౌర్జన్యాన్ని ఎదిరించడం నేర్పి వేలాది మంది యువత తుపాకులు చేతపట్టేలా చేసింది. శ్రీకాకుళం సీతంపేట నుండి మొదలైన తిరుగుబాటు పాట జగిత్యాల జైత్రయాత్ర, కల్లోల కరీంనగర్ వరకు సాగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి గద్దర్ పాట ప్రాణం పోసింది. 'అమ్మ తెలంగాణమా.. ఆకలి కేకల రాజ్యామా..'అంటూ ఆయన రాసి, పాడిన పాట.. ధూంధాం కార్యక్రమాలు ఉద్యమకారుల్లో ఉత్సాహం నింపాయి. ప్రతి పల్లె కళాకారుడు గద్దర్ స్ఫూర్తిగా గోచీ, గొంగళి కట్టి నృత్యం చేశారు. ఉద్యమాల్లో అమరులైన వారి కోసం ఏర్పడ్డ బంధుమిత్రుల కమిటీలో గద్దర్ కీలక పాత్ర పోషించారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ ఇదికాదంటూ.. ప్రజాస్వామిక తెలంగాణ కోసం మళ్లీ ఉద్యమాన్ని చేపడతానని ప్రకటించారు. వివిధ పార్టీల నేతలనూ కలిశారు.

ఎన్‌కౌంటర్ నుంచి తప్పించిన కానిస్టేబుల్

నక్సల్స్‌పై తీవ్ర అణచివేత కొనసాగుతున్న 1988–90 మధ్య కాలంలో గద్దర్ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఓసారి గద్దర్, ఇతర మావోయిస్టులు ఎక్కడ ఉన్నారన్నది పోలీసులకు సమాచారం అందింది. పెద్ద సంఖ్యలో పోలీసులు దాడి చేసి గాలించారు. ఆ సమయంలో గద్దర్ ఓ ఇంటి అటకపై దాక్కున్నారు. ఒక కానిస్టేబుల్ అటకపై గద్దర్‌ను చూసినా.. ఎవరూ లేరని అబద్ధం చెప్పడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. లేకుంటే గద్దర్ ఆరోజే ఎన్‌కౌంటర్ అయ్యేవారు, ఆనాడు కాపాడిన కానిస్టేబుల్ దళితుడని తర్వాత గద్దర్ వెల్లడించారు.

చరమాంకంలో..

తొలి నుంచి పూర్తిస్థాయి మావోయిస్టుగా, సానుభూతిపరుడిగా ఉన్న గద్దర్.. జీవిత చరమాంకంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చేసిన పనులు విస్మయం కలిగించాయి. తన కర్రకు కట్టిన ఎర్ర జెండాను విప్పేయడం, సూటూబూటు ధరించడం, అచ్చమైన కమ్యూనిస్టు అయి ఉండీ.. ఎన్నికల్లో ఓటు వేయడం, గుళ్లకు, స్వామీజీల వద్దకు వెళ్లడంపై ఆశ్చర్యం వ్యక్తమైంది. మావోయిస్టులు తీవ్రంగా వ్యతిరేకించే చంద్రబాబు కడుపులో తలపెట్టడం, కాంగ్రెస్ వారి వేదిక ఎక్కడం, ప్రధాని మోదీ సభకు ఆహ్వానం లేకున్నా వెళ్లడం వంటివీ చర్చనీయాంశంగా మారాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గద్దర్ పెద్దపల్లి నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం కూడా జరిగింది.

బతుకుదెరువు నిమిత్తం పాలమూరు నుంచి నగరానికి వలస వచ్చిన నిరుపేద కుటుంబాలకు నేనున్నానంటూ భూదేవినగర్ రైల్వే ట్రాక్ పక్కన వారికి ఆశ్రయం కల్పించి గద్దర్ అండగా నిలిచారు. వందలాది కుటుంబాలు ఆయన నీడలో జీవనం సాగిస్తున్నాయి. గద్దర్ మరణంతో మాకు దిక్కెవరంటూ భూదేవినగర్‌వాసులు కన్నీటిపర్యంతమవుతున్నారు. - అల్వాల్

ఓరుగల్లు నుంచి పొలికేక

సాక్షిప్రతినిధి, వరంగల్: పీపుల్స్‌వార్ పార్టీపై 1990లో ప్రభుత్వం నిషేధం ఎత్తివేసింది. అప్పటివరకు అజ్ఞాతంలో ఉన్న పీపుల్స్‌వార్ నేతలు, లీగల్ కార్యకర్తలు, జననాట్యమండలి, అనుబంధ సంఘాల నాయకులు జనజీవనంలోకి అడుగుపెట్టారు. ఇదే సమయంలో 1990 మే 5, 6 తేదీల్లో వరంగల్ వేదికగా రాష్ట్ర రైతుకూలీ సంఘం మహాసభలు నిర్వహించారు. జననాట్యమండలి నాయకుడు గద్దర్, ఆయన బృందం ప్రకాష్‌రెడ్డిపేట ఏరియాలో ఏర్పాటు చేసిన సభావేదికపైన ప్రత్యక్షమైంది. పదిలక్షలకుపైగా జనం హాజరైన ఈ సభలో గద్దర్ బృందం ఆటాపాటా ఉర్రూతలూగించాయి. 'ధీరులారా శూరులారా.. రాడికల్ శూరులారా.. మీరు కాకమ్మలయ్యి వస్తారా మా బిడ్డలు..', 'జై బోలోరే జై బోలో.. అమర వీరులకు జై బోలో.. వీరులకేమో జై బోలో.. ఆహా శూరులకేమో జై బోలో..'అంటూ పాడిన పాటలు ఇప్పటికీ అందరి నోట్లో వినిపిస్తాయి. గద్దర్ ప్రస్థానంలో ఓరుగల్లు మహాసభ చిరస్థాయిగా నిలిచింది.

బతికుంటే.. మళ్లీ వస్తా



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన చివరిసారిగా ఏప్రిల్ 30న నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో పాల్గొన్నారు. ఈ సభలో గద్దర్ పాట పాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అచ్చంపేటలో నాలుగు ప్రాణాలు పోయినప్పుడు ఇక్కడికి వచ్చాను. మొదటి తుపాకీ తూట నా గుండెను తాకినప్పుడు.. నెత్తురు కోసం రూ.100 కావాలని నా భార్య పైసలు అడుక్కుంది. మళ్లీ బతికి ఈ ఊరికి వచ్చిన. చివరి ఊపిరి వరకు మీ కోసం పాటుపడతా. పాలమూరుకు పేరు తేవాలి. ఈ నేల కోసం పోరాటం చేయాలి. బతికుంటే మళ్లీ వస్తాను.. మీ పాదాలకు వందనాలు'అంటూ పాట రూపంలో చెప్పారు.

ఓయూ స్టూడెంట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో 1975లో ట్రిపుల్ ఈ పూర్తి చేశారు. నగరంలోని మొజంజాహీ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ కాలేజీకి చెప్పులు లేకుండా వచ్చేవారని ప్రిన్సిపల్ శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. ఓ హోటల్‌లో 26 పైసలకు పార్ట్‌టైంపనిచేస్తూ ఇంజనీరింగ్ పూర్తి చేశారన్నారు. జార్జిరెడ్డి హయాంలో అనేక ఉద్యమాలకు ఓయూ కేంద్రబిందువు అయ్యింది. వామపక్ష ఉద్యమభావజాల వ్యాప్తి కోసం ఇక్కడ జరిగిన అనేక సభలు, సమావేశాలలో జననాట్యమండలి తరపున గద్దర్ పాల్గొన్నారు. మలివిడత తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూలో జరిగిన ప్రతి సభలో పాల్గొని తన ఆటపాటతో విద్యార్థులను ఉత్తేజపరిచేవారు.

క్లుప్తంగా...

జక్కంపూడి మహానేత: సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు మహానేత. ఆయన మా నాన్నగారికి, మా కుటుంబానికి జీవితమంతా ఆప్తుడిగా మెలిగారు. నేడు ఆయన జయంతి. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ జీవించే ఉంటాయి..' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ట్వీట్ చేశారు.

చంద్రబాబుకు కావాల్సిందే మారణహోమం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజం



కడప కార్పొరేషన్: ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు ఆద్యంతం హింసను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా విమర్శించారు. ఆదివారం ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో బరితెగించిన చంద్రబాబు మాటలు, ఉచ్చ నీచాలు మరిచి చేసిన వ్యాఖ్యలు ఆయన ఉద్దేశాన్ని చెప్పకనే చెబుతున్నాయన్నారు. అడ్డూ అదుపు లేకుండా కార్యకర్తలను రెచ్చగొట్టి గొడవలు, గలాటాలు, అల్లర్లు రేపి విధ్వంసం సృష్టించాలన్నదే చంద్రబాబు మాస్టర్ ప్లాన్ అని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై, ఆయన కుటుంబంపై కొన్ని రోజులుగా సంస్కారహీనంగా, బజారు మనిషిలాగా బాబు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు రెచ్చగొడుతూ చేసిన కామెంట్లతోనే ఒక్కసారిగా పరిస్థితి మారిపోయిందని పేర్కొన్నారు. పోలీసులు ఎంత చెప్పినా టీడీపీ కార్యకర్తలు వినకుండా కేకలు వేస్తూ, తొడలు చరుస్తూ కర్రలు, బీరు బాటిళ్లు, రాళ్లు విసురుతూ దాడులకు తెగబడ్డారన్నారు. ఈ దాడిలో పలువురు పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడటం దారుణమన్నారు. వాహనాలను తగులబెట్టి పోలీసులను గాయపరచడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. అంతిమంగా చంద్రబాబుకు కావాల్సింది మారణహోమమేనని, 40 ఏళ్ల ఇండస్ట్రీ ఇంత రాక్షసత్వానికి పాల్పడటం దారుణమని, ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయాలని అంజద్‌బాషా డిమాండ్ చేశారు.

పుంగనూరు ఘటనకు నిరసనగా ప్రొద్దుటూరులో భారీ ర్యాలీ



పోలీసులకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: పుంగనూరులో చంద్రబాబు రెచ్చగొట్టే మాటలు మాట్లాడి పోలీసులపై, ప్రజలపై రాళ్లతో దాడులు చేయించినందుకు నిరసనగా ఆదివారం పుట్టపర్తి సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లర్ల సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపి ఉంటే ఎన్నో కుటుంబాలకు గర్భశోకం మిగిలేదని, సంయమనంతో వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన పోలీసులు గ్రేట్ అని అభినందిస్తూ వారికి సెల్యూట్ చేశారు.

నీ రెమ్యూనరేషన్ ఎంత పవన్? : మంత్రి అంబటి



సాక్షి, రాజమహేంద్రవరం: విప్లవ నాయకుడు చే గువేరా వారసుడినని చెప్పుకునే పవన్ కళ్యాణ్ తాను నటించిన సినిమాకు రెమ్యూనరేషన్ ఎంత తీసుకున్నాడో చెప్పలేడా? అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పవన్ నటించిన బ్రో సినిమా ఫ్లాప్ అయ్యిందన్నారు. సినిమాకు రెమ్యూనరేషన్ ఎంత తీసుకున్నాడో చెప్పలేనివాడు రాజకీయాల్లో పారదర్శకత ఎలా చూపిస్తాడని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు ఆధ్వర్యాన టీడీపీ కార్యకర్తలు పోలీసులపై దాడి చేయడం అమానుషమన్నారు. పోలీసులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు యాత్ర కొనసాగించి ఉంటే ఎలాంటి ఘటనలు చోటుచేసుకుని ఉండేవి కావన్నారు. కావాలనే చంద్రబాబు ముందు ఇచ్చిన షెడ్యూల్‌కు విరుద్ధంగా వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని చెప్పారు. పైగా తాను సింహాన్ని అని చంద్రబాబు ప్రకటించుకుంటున్నారని, నక్క.. సింహం ఎలా అవుతుందని అంబటి ప్రశ్నించారు.

పుంగనూరులో పోలీసులపై దాడికి ఖండన

సాక్షి, అమరావతి: పుంగనూరులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పర్యటన సందర్భంగా శాంతిభద్రతల విధులు నిర్వహిస్తున్న పోలీసులపై ఆ పార్టీ కార్యకర్తలు రాళ్ల దాడి చేయడాన్ని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే ఉద్యోగులను దుర్భాషలాడటం, దాడి చేయడం ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ చేసినా ఆమోదయోగ్యం కాదని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

'మరణ'హోమమే లక్ష్యం!

పోలీసులను చంపి.. ఆపై కాల్పులు ఓపెన్ చేయించేలా ప్లాన్



శుక్రవారం పుంగనూరులో పోలీసులపై రాళ్లతో దాడి చేస్తూ దూసుకొస్తున్న టీడీపీ శ్రేణులు

చిత్తూరు అర్బన్: టీడీపీ అధినేత నేత చంద్రబాబు నాయుడు శనివారం నాటి చిత్తూరు జిల్లా పర్యటనలో మారణహోమమే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందించారు. కనీసం ఇద్దరు పోలీసులను చంపాలని దుర్మార్గపు ఆలోచనలు చేశారు. బాబు పర్యటనకు రెండు రోజుల ముందే ఈ ప్లాన్ మొత్తం రూపొందించారు. పుంగనూరు వద్ద పోలీసులపై దాడులకు తెగబడి అల్లర్లు సృష్టించిన ఘటనకు సంబంధించి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డి ఈనెల 2వ తేదీన రొంపిచెర్లలో పార్టీ ప్రధాన వ్యక్తులతో ఈ మారణహోమ వ్యూహాన్ని రచించారు. అతని వ్యక్తిగత కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు విచారించగా, పూసగుచ్చినట్లు విషయం అంతా వివరించాడని తెలిసింది. ఇది విన్న పోలీసులు షాక్‌కు గురవ్వడంతోపాటు, ఇదేం రాజకీయం అని కాసేపు ఆందోళనకు గురైనట్లు సమాచారం. టీడీపీ నేతలు రూపొందించిన వ్యూహాలు ఇలా ఉన్నాయి.

ప్లాన్-ఎ: పోలీసు కాల్పులు

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రోజు రోజుకు జనాదరణ పెరిగిపోయి హీరో అయిపోతున్నాడని చల్లా బాబు తరచూ పార్టీ నేతల వద్ద అక్కసు వెళ్లగక్కేవారు. ఇదే పుంగనూరులో పెద్దిరెడ్డిని జీరో చేయాలని, అదే సమయంలో రాష్ట్రం మొత్తం పుంగనూరు వైపు చూసేలా మారణహోమం జరగాలని సంకల్పించారు. ఈ మేరకు విషయాన్ని పార్టీ పెద్దకు చేరవేసి, ఆయన ఆశీర్వాదం పొందారని తెలిసింది. ఇందులో భాగంగా చంద్రబాబు నాయుడు పుంగనూరు బైపాస్ రోడ్డు వద్దకు వచ్చినప్పుడు.. పుంగనూరు పట్టణంలోకి రావాలని పార్టీ శ్రేణులు పట్టుపట్టాలని, పోలీసులు దీనికి అంగీకరించరని నిశ్చయించుకున్నారు. అప్పటికే కృష్ణదేవరాయ కూడలికి సమీపంలో సిద్ధంగా ఉంచుకున్న రాళ్లు, మద్యం బాటిళ్లు, బీరు బాటిళ్లు, గుండ్రటి టపాసు బాంబులును పోలీసులే లక్ష్యంగా విసిరేలా కొందరికి బాధ్యత అప్పగించారు. ఇందులో భాగంగా మొత్తం 30 నిమిషాల పాటు దాడి కొనసాగించేందుకు సరిపడా రాళ్లు, ఇతర వస్తువులను పరిసర ప్రాంతాల్లో ఉంచారు. తొలి మూడు నిమిషాల్లో చెప్పులు, వాటర్ బాటిళ్లు విసిరితే పోలీసులు తేలిగ్గా తీసుకుంటారని, ఇదే అదునుగా పోలీసుల ఊహకు అందని విధంగా రాళ్లు, టపాసు బాంబులు, మద్యం బాటిళ్లతో పది నిముషాలు దాడులు చేయాలని, ఇందులో ఒకరిద్దరు పోలీసులు చనిపోయినా పర్లేదనే వ్యూహానికి పదును పెట్టారు. ఇదే కనుక జరిగితే వెంటనే పోలీసులు కాల్పులు ఓపెన్ చేస్తారని, ఈ కాల్పుల్లో కనీసం 30 మంది వరకు టీడీపీ శ్రేణులు మరణిస్తారు.. అప్పుడు దేశం మొత్తం పుంగనూరు వైపు చూస్తుంది.. రాష్ట్ర వ్యాప్తంగా అల్లకల్లోలం అవుతుంది.. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణుల ద్వారా ఆందోళనలతో ప్రభుత్వాన్ని కూల్చేయొచ్చని భారీ కుట్ర పన్నారు. తర్వాత జరిగే ఎన్నికల్లో సానుభూతి వల్ల టీడీపీ ఆటోమేటిక్‌గా గద్దెనెక్కడం ఖాయం అని భావించారు.

ప్లాన్-బీ: అల్లకల్లోలం సృష్టించడం

ఏ కారణాల వల్లయినా ప్లాన్-ఏ అమలుకాని పక్షంలో టీడీపీ నేతలు ప్లాన్-బీ కూడా రూపొందించుకున్నారు. పోలీసులు చనిపోకపోయినా, వాళ్లు ఫైర్ ఓపెన్ చేయకపోయినా ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు మొత్తం ఒక్కసారిగా పుంగనూరు పట్టణంలోకి చొరబడి ఎక్కడికక్కడ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్లెక్సీలు చింపడం, పెట్రోలు పోసి నిప్పంటించడం చేయాలి. వెంటనే వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రతిస్పందిస్తాయి. దీంతో చెలరేగే అల్లర్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఒకరిద్దరిని మట్టుబెడితే.. వాళ్లు చేసే దాడుల్లో ఆస్తుల విధ్వంసంతో పాటు కొందరు టీడీపీ కార్యకర్తలూ చనిపోతారు. దీనికంతటికీ కారణం ప్రభుత్వంపై నెట్టేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగాలి. తద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టాలి. రాష్ట్రం మొత్తం ఈ ఘటనలతో హోరెత్తిపోయి శాంతి భద్రతల వైఫల్యాన్ని ఎండగట్టాలని అనుకున్నారు. ఈ రెండు ప్లాన్ల గురించి టీడీపీలోని ప్రధాన వ్యక్తులకు తప్ప, పార్టీ కార్యకర్తల్లో ఒక్కరికి కూడా తెలియడానికి వీల్లేదని తీర్మానం చేశారు. ఎక్కడా ఈ ప్లాన్ల గురించి పల్లెత్తు మాట కూడా మాట్లాడకూడదని అత్యంత గోప్యత పాటించారు. ఈ అల్లర్లకు అవసరమయ్యే వారిని మదనపల్లె, మొలకలచెరువు, సదుం, సోమల నుంచి రప్పించాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా రంగంలోకి దించారు.

పోలీస్ ప్లాన్ భళా.. టీడీపీ డీలా..

టీడీపీ నేతలు రూపొందించిన మారణహోమ ఉచ్చులో పోలీసులు చిక్కుకునే ఘటన దాదాపు అమలైపోతుందని టీడీపీ పెద్దలు భావించారు. అయితే అల్లర్ల సమయంలో అక్కడ బందోబస్తులో ఉన్న ఓ పోలీసు అధికారి చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. పోలీసులు రక్తమోడుతుండటం చూసిన ఆ అధికారి చలించిపోయి.. గద్గద స్వరంతో ఎస్పీతో మాట్లాడుతూ.. 'సర్, పరిస్థితి చేయి దాటిపోతోంది. డీఎస్పీల తలలు పగిలిపోతున్నాయి. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఇక్కడ ఆర్తనాదాలు పెడుతున్నారు. మనం ఫైర్ ఓపెన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే మీరు కలెక్టర్‌తో మాట్లాడి ఫైర్ ఓపెన్ చేసేలా ఆర్డర్ ఇవ్వండి ప్లీజ్. లేకుంటే మనవాళ్లు చనిపోతారు..' అంటూ బతిమిలాడినట్లు సమాచారం. అప్పుడు టీడీపీ మూకలు రాళ్లు, బాటిళ్లు విసురుతున్న తీరు, వాటి నిల్వల వివరాలు ఆరా తీసి.. పోలీసులు వెంటనే 300 మీటర్లు వెనక్కు వచ్చేయాలని ఎస్పీ సూచించినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణులు రాళ్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉన్న ప్రాంతం నుంచి ముందుకు వస్తారని.. అప్పుడు టీడీపీ శ్రేణులను చెదరగొట్టడానికి స్వల్పంగా లాఠీచార్జ్, బాష్ప వాయువు ప్రయోగించాలని ఆదేశించినట్లు సమాచారం. తాను పుంగనూరుకు బయలుదేరానని, తాను అక్కడికి వచ్చే వరకు ఒక్క బుల్లెట్ కూడా తుపాకీ నుంచి బయటకు రావడానికి వీల్లేదని గట్టిగా చెప్పినట్లు తెలిసింది. దీంతో పోలీసులు రక్తమోడుతున్నప్పటికీ ఎస్పీ ఆదేశాలను అమలు చేశారు. అల్లరి మూకల్ని దగ్గరకు రప్పించి లాఠీలతో చెదరగొట్టారు. దీంతో టీడీపీ నేతల కుతంత్రాలు, కుట్రలు పటాపంచలయ్యాయి.

నదుల అనుసంధానంతో కరువు లేకుండా చేస్తా..

- పోలవరం ప్రాజెక్టును సీఎం జగన్ నాశనం చేశారు
- టీడీపీ అధినేత చంద్రబాబు
- వెలిగొండ ప్రాజెక్టుపై అబద్ధాలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు/సాక్షి ప్రతినిధి ఒంగోలు: హైదరాబాద్ కోకాపేటలో ఎకరా రూ.100 కోట్ల వరకు ధర పలికిందంటే అందుకు తాను వేసిన ఫౌండేషనే కారణమని టీడీపీ అధినేత చంద్రబాబుఅన్నారు. అక్కడ ఐటీ, ఫార్మా, బయోను తాను అభివృద్ధి చేయడంవల్లే భూములకు అమాంతంగా ధరలు పెరిగాయని చెప్పారు. నెల్లూరులోని కస్తూరీదేవి గార్డెన్స్‌లో ఆదివారం సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం యుద్ధభేరిలో భాగంగా నీటిపారుదల రంగంపై చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఐదు ప్రధాన నదులను అనుసంధానం చేసి నీటి కరువు లేకుండా చేస్తానన్నారు. పోలవరం పూర్తికి టైం పడుతుందనే పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని ఆయన చెప్పారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడమే కాక.. నీటిని పొదుపు చేసి శ్రీశైలం వద్ద నిల్వఉంచి రాయలసీమ, నెల్లూరుకు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు చేయలేదు కానీ.. పెద్దిరెడ్డి కోసం రూ.5,300 కోట్లతో కొత్త ప్రాజెక్టులు మొదలుపెట్టారని ఆయన ఆరోపించారు. పోలవరాన్ని వైఎస్ జగన్ నాశనం చేశారన్నారు. ప్రజల నుంచి తిరుగుబాటు రావాలన్నారు. కాగా, తటస్థులు పాల్గొంటారని ప్రకటించారు. కానీ, టీడీపీ అనుకూలురకు మాత్రమే పాస్‌లు కేటాయించి వారితో మాట్లాడించారు.

బూట్లు వేసుకుని చంద్రబాబు ప్రార్థన

అబ్దుల్ అజీజ్ నివాసంలో ముస్లిం మతపెద్దలు అజీజ్ ఆరోగ్యం కుదుటపడాలని దువా చేయగా ఆయనను పరామర్శించేందుకు వెళ్లిన చంద్రబాబు బూట్లు వేసుకునే ప్రార్థన చేశారు. దీనిపై ముస్లిం మతపెద్దలు మండిపడుతున్నారు.

ఇదేం ముఖాముఖి?

ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు చంద్రబాబు రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ఎల్లో మీడియా, టీడీపీ నేతలతో పొగిడించుకున్నారు. సాక్షి విలేకరులను బయటకు పంపడంపై విమర్శలొచ్చాయి.

పథకం ప్రకారమే పోలీసులపై దాడి



పుంగనూరులో దాడికి పాల్పడిన టీడీపీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీలక్ష్మి

- ప్రస్తుతం ఏ1గా చల్లా రామచంద్రారెడ్డి
- 62 మంది అరెస్ట్ : ఏఎస్పీ శ్రీలక్ష్మి

పుంగనూరు (చిత్తూరు జిల్లా): చంద్రబాబు పర్యటనలో ఉద్దేశ పూర్వకంగానే తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీసులపై దాడిచేసి గాయపరచి, పోలీస్ వాహనాలకు నిప్పు పెట్టారని చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె పుంగనూరులో పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ అశోక్‌కుమార్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటనలో రూట్‌మ్యాప్‌ను కాదని పుంగనూరులోకి దౌర్జన్యంగా వస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలను నివారించినందుకే రాళ్లు, మద్యం బాటిళ్లు, కర్రలతో దాడి చేసి పోలీసులను తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ ఘటనపై ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేసి, సీసీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానంతో దాడులు చేసిన వారిలో 62 మందిని అరెస్ట్ చేసి, రిమాండుకు తరలిస్తున్నామన్నారు. పోలీసులను రెచ్చగొట్టి.. తద్వారా కాల్పులు జరిగేలా చేయాలన్నది టీడీపీ ముఖ్య నేతల ఉద్దేశం అని తేలిందన్నారు. అవసరమని పిస్తే పోలీసులను చంపాలని, ఆ సమయంలో పోలీసులు కాల్పులు జరిపితే టీడీపీ వారు చనిపోతే తద్వారా ఇమేజ్ పొందేలా పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఈనెల 2న రొంపిచెర్లలో వ్యూహ రచన చేశారన్నారు. ఆయన పీఏ గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేసి విచారించగా ఈ విషయం వెల్లడైందన్నారు. దీంతో ప్రస్తుతం చల్లా రామచంద్రారెడ్డిని ఏ-1 నిందితునిగా కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నాడన్నారు.

బాబుది విధ్వంస యాత్ర

- ఆయన సింహం కాదు.. జిత్తులమారి నక్క
- మాజీమంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కాకినాడ రూరల్: రాష్ట్రంలో చంద్రబాబు విధ్వంస యాత్ర సాగిస్తున్నారని, అరాచకం సృష్టించేందుకే కుట్రపూరితంగా యాత్ర చేపడుతున్నారని మాజీమంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఎక్కడికెళ్లినా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముందుగానే ప్లాన్ వేసుకుని పుంగనూరు వెళ్లి 50 మంది పోలీసులను గాయపరిచారని, రక్తం వచ్చేలా దాడులు చేశారని, వాహనాలు తగలబెట్టారని చెప్పారు.

అల్లర్లకు బాబు, పవన్ యత్నం..

చంద్రబాబు, ఆయనకు మద్దతు పలుకుతున్న పవన్ మాట్లాడుతున్న తీరుచూస్తే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయం అర్థమవుతోందన్నారు. పుంగనూరులో టీడీపీ కార్యకర్తలతో దాడులు చేయించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆపాదించే ప్రయత్నం చేశారని కన్నబాబు చెప్పారు. పోలీసుల గురించి మాట్లాడే భాష ఇదేనా అని ప్రశ్నించారు. తన కార్యకర్తపై చేయి చేసుకున్నారంటూ సీఐ అంజుయాదవ్‌పై గతంలో గొడవ చేసిన పవన్.. ఇదే పోలీసులపై చంద్రబాబు దాడి చేయిస్తే ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు.

బాబు ఏ ప్రాజెక్టు పూర్తిచేశారు?

14 ఏళ్లు సీఎంగా పనిచేసి ఏ ప్రాజెక్ట్ పూర్తిచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కక్కుర్తితో పట్టిసీమ ప్రాజెక్టు పూర్తిచేసి రాయలసీమ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఇక చంద్రబాబుకు సింహం బ్రాండ్ లేదని, మామగారిని కుళ్లబొడిచిన నక్కజిత్తుల బ్రాండ్ ఉందని కురసాల ఎద్దేవా చేశారు.

ఓటమి భయంతోనే బాబు అరాచకాలు

- వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి
- విజయవాడలో చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర



చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటమి భయంతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టించేందుకు చంద్రబాబు అనే రాక్షసుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలను ప్రేరేపిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. విజయవాడ భవానీపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి క్రాంబే రోడ్డు వరకు ఆదివారం చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. రోడ్డుపై చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాదనే భయంతోనే చంద్రబాబు రాష్ట్రంలో అశాంతి సృష్టించాలని ప్రాజెక్టుల సందర్శన పేరుతో పర్యటిస్తున్నారని విమర్శించారు. పుంగనూరులో పోలీసులపై దాడికి కారకుడైన చంద్రబాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఒక కార్యకర్త మీద చేయి చేసుకున్న సీఐ అంజూయాదవ్‌పై తీవ్రంగా స్పందించిన పవన్‌కళ్యాణ్... పుంగనూరులో ఇంతమంది పోలీసులకు గాయాలైతే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీఐఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, గౌస్ మొహిద్దీన్, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తాం..

మల్లవల్లి పారిశ్రామికవాడ నిర్వాసితులతో పవన్‌కళ్యాణ్



హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడ నిర్వాసితులు నష్టపరిహారం కోసం చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ నిర్వాసిత రైతులతో ఆయన ఆదివారం ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసేకరణలో నష్టపరిహారం అందని పలువురు రైతుల అభిప్రాయాలను పవన్‌కళ్యాణ్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024లో ప్రభుత్వం మారబోతోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండటం లేదన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక శ్రద్ధ వహించి మల్లవల్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడ ఏర్పాటు 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే కాబట్టి ఈ సమస్యపై ఆ పార్టీ కూడా స్పందించాలని పవన్ విజ్ఞప్తి చేశారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, గన్నవరం నియోజకవర్గ నేత రమేష్ పాల్గొన్నారు. కాగా, ముఖాముఖి కార్యక్రమంలో పలుమార్లు ఫ్యాన్స్‌పై పవన్ చిర్రుబుర్రులాడారు. ఆయన మాట్లాడుతున్నప్పుడూ ఫ్యాన్స్ అరుపులు, కేకలు వేయడంతో వారిపై చిరాకుపడ్డారు. మీరు అరవకుండా నేను చెప్పేది వినండి.. రైతుల కోసం వచ్చాం.. రైతు సమస్యలు విందాం.. మీ సరదా, ఉత్సాహం వేరు అంటూ కోప్పడ్డారు. పవన్ ప్రసంగంలో మల్లవల్లి పేరును మల్లపల్లి అంటూ తప్పుగా ఉచ్చరించడంతో గ్రామస్తులు ఒకింత ఇబ్బందిపడ్డారు.

బాబూ.. మీ తమ్ముడెక్కడ ఉన్నాడో చెప్పు!

- ఆస్తి కోసం రామ్మూర్తినాయుడికి స్లో పాయిజన్ ఇవ్వలేదా?
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సాక్షి, తిరుపతి: 'చంద్రబాబూ.. వైఎస్సార్ కుటుంబం గురించి మాట్లాడే ముందు నీ తమ్ముడు ఎక్కడున్నాడో చెప్పగలవా? ఆస్తి కోసం నారా రామ్మూర్తినాయుడుకి స్లో పాయిజన్ ఇచ్చి బయటకు రాకుండా దాచి పెట్టలేదా?'.. అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి పర్యటనలో సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి, తనపై చంద్రబాబు చేసిన విమర్శలను ఆదివారం మీడియా సమావేశంలో మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శ్రీకాళహస్తిలో చంద్రబాబు, బొజ్జల సుధీర్ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్నారు. 'శివుడి సాక్షిగా చెబుతున్నా.. నాలుగేళ్ల అభివృద్ధి, నలభై ఏళ్ల అభివృద్ధిపై చర్చిద్దాం రండి.. దమ్ము ధైర్యం ఉంటే.. శ్రీకాళహస్తి శివయ్య సన్నిధిలో ప్రమాణం చేద్దాం'.. అని సవాల్ విసిరారు. శ్రీకాళహస్తిలో పవన్‌తో అరాచకాలు చేయించాలని బాబు కుట్ర చేశాడని ఆరోపించారు. రాష్ట్రాన్ని దోచుకున్న బాబే బాలాజీ రిజర్వాయర్ ముందు సెల్ఫీ దిగుతున్నారని ఆరోపించారు.

కిమ్ లాంటి వాడు చంద్రబాబు

తనకు ప్రత్యర్థి ఉండకూడదని తన అంకుల్‌ని, సోదరుడ్ని కిమ్ చంపితే.. సీఎం పదవి, పార్టీని లాక్కునేందుకు పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు కూడా కిమ్ లాంటి వాడేనని బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

నేడు, రేపు వరద ప్రభావిత ప్రాంతాల్లో
సీఎం జగన్ పర్యటన

▶ మొదటి పేజీ తరువాయి

సాయం అందలేదన్న మాటకు తావు లేకుండా చేశారు. ప్రస్తుతం పరిస్థితి కుదుటపడింది. శిబిరాల నుంచి ప్రజలు ఇళ్లకు వెళ్లిపోయారు. అన్ని ప్రాంతాలకు రాకపోకలను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో పర్యటించి సాయం అందిన తీరు గురించి ప్రజలతో స్వయంగా మాట్లాడటానికి రెండు రోజుల పర్యటన తలపెట్టారు. ఇలా తను సీఎం అయినప్పటి నుంచి సరికొత్త సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.

వరద ప్రభావిత ప్రాంత ప్రజలతో నేడు మాటామంతి

సోమవారం ఉదయం 9.30 గంటలకు సీఎం వైఎస్ జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట చేరుకుంటారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడతారు. కూనవరం బస్టాండ్ సెంటర్‌లో కూనవరం, వీఆర్ పురం మండలాల వరద బాధితులతో సమావేశం అవుతారు. అనంతరం ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం చేరుకుంటారు. అక్కడ వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత వరద బాధిత కుటుంబాలతో సమావేశమవుతారు. సాయంత్రానికి రాజమహేంద్రవరం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. మంగళవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గురజాపులంక చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో మాటాడాక తానేలంక రామాలయంపేట గ్రామం వెళతారు. అక్కడ వరద బాధితులతో సమావేశమవుతారు. ఆ తర్వాత అయినవిల్లి మండలం తోటరాముడివారిపేట, కొండుకుదురు చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో మాట్లాడిన అనంతరం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ప్రజాకవి గద్దర్ మృతిపై సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: ప్రజాకవి గద్దర్ మరణం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ప్రజాకవి గాయకుడు, బడుగు, బలహీనవర్గాల విప్లవ స్ఫూర్తి గద్దర్. గద్దర్ పాట ఎప్పుడూ సామాజిక సంస్కరణల పాటే. ఆయన నిరంతరం సామాజికన్యాయం కోసమే బతికారు. ఆయన మరణం ఊహించనిది. సామాజికన్యాయ ప్రవక్తల భావాలు, మాటలు, వారి జీవితాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ జీవించే ఉంటాయి. గద్దర్‌కు మొత్తంగా తెలుగుజాతి సెల్యూట్ చేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనమంతా బాసటగా ఉందాం.' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజా గొంతుక మూగబోయింది : శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

ప్రజా గాయకుడు గద్దర్ మరణవార్త తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తెలిపారు. ప్రజా గొంతుక మూగబోయిందని పేర్కొన్నారు. బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతో దళితులు, అణగారిన వర్గాల కోసం ప్రజా పోరాటాలు చేసిన గద్దర్ మరణం తీరనిలోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.

గద్దర్ మృతి బాధాకరం : స్పీకర్ తమ్మినేని

'ప్రజా ఉద్యమాలు నడిపి జనాలను ఉర్రూతలూగించిన గద్దర్ మృతి బాధాకరం. ఉమ్మడి రాష్ట్రంలో నేను మంత్రిగా పని చేసినప్పటి నుంచి ఆయనతో మంచి అనుబంధం ఉంది. గద్దర్ పాట వింటే ఒక విప్లవంలా ఉంటుంది.' అని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు.

బడుగులకు తీరని లోటు : హోం మంత్రి వనిత

గద్దర్ మృతికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దళిత, గిరిజన, బలహీన వర్గాలకు జీవితాంతం అండగా నిలిచిన మహనీయుడు అని కొనియాడారు. గద్దర్ మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని అన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : సీపీఎం

గద్దర్ మృతికి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సంతాపం వ్యక్తంచేసింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. గద్దర్ తన కళలతో ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేశారని, అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని తెలిపారు.

సాంస్కృతిక విప్లవ యోధుడు: కత్తి పద్మారావు

ప్రజల హృదయాలను కొల్లగొట్టిన సామాజిక, సాంస్కృతిక విప్లవకారుడు గద్దర్ అని కత్తి పద్మారావు పేర్కొన్నారు. గద్దర్‌ను పాటల యుగానికి పతాకగా పేర్కొంటూ.. తెలంగాణ గుండె చప్పుడుని వినిపించి, తల్లి హృదయ వేదనను పలికించి, పాలక వర్గాల గుండెల్లో సింహమై గర్జించాడని కొనియాడారు.

మాల మహానాడు సంతాపం

తన పాటతో ప్రజా ఉద్యమాలకు ఊపిరిపోసిన గద్దర్ మృతి తీరని లోటు అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు సంతాపం తెలిపారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని కొనియాడారు.

తెలంగాణ పాటకు గద్దర్‌తో ప్రపంచఖ్యాతి: తెలంగాణ సీఎం కేసీఆర్

తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజల కోసం గద్దర్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన మరణంతో యావత్ తెలంగాణ గొప్ప ప్రజాకవిని కోల్పోయిందని పేర్కొన్నారు.

గద్దర్ మృతి వార్త బాధ కలిగించింది: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

గద్దర్ మరణ వార్త తీవ్రంగా బాధించిందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. తెలంగాణ ప్రజలపై ఆయనకున్న ప్రేమే ఆయన్ను అణగారిన వర్గాల పట్ల నిర్విరామ పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

ఆయన పాట ఉద్యమానికి ఊపు: కిషన్‌రెడ్డి

వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన గద్దర్ తెలంగాణ ఉద్యమంలోనూ తన పాట, మాటతో సరికొత్త ఊపు తీసుకొచ్చారని కిషన్‌రెడ్డి చెప్పారు. వివిధ ప్రాంతాల్లో తాను చేపట్టిన పాదయాత్రలో గద్దర్ కలిసి నడిచారని పేర్కొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



తక్కువతో సంతృప్తిగా ఉండగలగడమే గొప్ప సంపద.
- ప్లేటో

సాక్షి
సోమవారం, 7 ఆగస్టు 2023

కేశమహిమ

జీవితంలో అప్రధానంగా కనిపించే విషయాలకు కూడా వాటి ప్రాధాన్యం వాటికి ఉంటుంది. ఇందుకు తిరుగులేని ఉదాహరణ జుట్టు. మన భాషా సాహిత్యాలను కొంచెం తరచి చూస్తే, జుట్టుకు ఉన్న ప్రాశస్త్యం అర్థమవుతుంది. జుట్టు చుట్టూ జరిగే వ్యాపారాలను కాస్త నిశితంగా గమనిస్తే, ఎంతటి వారైనా 'జుట్టే కదా' అని కేశపాశాలను వెంట్రుక ముక్కలా తీసి పారేయలేరు. అదీ కేశ మహిమ! అందమైన కేశాలు నిండుగా తలమీద ఉండటం వల్లనే శ్రీమహావిష్ణువుకు కేశవుడనే పేరు వచ్చింది. ఆదిభిక్షువే అయినా, పరమశివుడు కేశసంపదలో తక్కువ వాడేమీ కాదు, ఆయన జటాజూటధారి! ఆయన తన జటాజూటంలో గంగను బంధించాడు కాబట్టి గంగను శిరోజతీర్థం అని అంటారు. తలవెంట్రుకలకు గల పురాణ ప్రశస్తికి ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే!

జుట్టును అల్లుకున్న జాతీయాలు, సామెతలు దాదాపు అన్ని భాషల్లోనూ ఉన్నాయి. 'ఫలిత కేశాలు ముదిమికి సంకేతాలే గాని, జ్ఞానానికి కాదు' అని ఇంగ్లిష్ సామెత. ఇది తలపండితులకు చక్కగా వర్తిస్తుంది. 'తలలు బోడులైన తలపులు బోడులా' అనే సామెత మనకు ఉండనే ఉంది. 'అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకోవడం' కూడా మన నుడికారంలో భాగమే! కొందరు బతకనేర్పరులు ఈ విద్యలో బాగా ఆరితేరి ఉంటారు. 'జుట్టున్నమ్మ ఏ కొప్పు పెట్టినా అందమే' అని నానుడి. ఇటీవల ఏపుగా జుట్టు పెంచుకోవడానికి హైదరాబాద్‌లో ఒక మహిళ బ్యూటీ పార్లర్‌కు వెళ్లింది. బ్యూటీపార్లర్ చికిత్సతో ఆమెకు ఉన్న జుట్టు కూడా ఊడిపోయింది. ఇలా ఉంటాయి కేశక్లేశాలు! 'కాళ్లు వంకరగా ఉన్నప్పుడు నెత్తి మీద వెంట్రుకలు తిన్నగా ఉండి లాభమేంటి?' అని రష్యన్ సామెత. 'ప్రతి మనిషి పొద్దున్నే తలదువ్వుకున్నట్లు మనసు దువ్వుకోరెందుకో?' అని చైనీస్ సామెత. మనుషులకు శిరోజాలంకరణ మీద ఉన్న శ్రద్ధ మనోలంకరణ మీద ఉన్నట్లయితే, ఈ ప్రపంచం ఎప్పుడో బాగుపడిపోయేది!

మన పూర్వకవులు మరాళకుంతలలైన నీలవేణుల సౌందర్యాన్ని ఇతోధికంగా వర్ణించారు. 'ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై నంశోత్తరీయంబుపై...' పద్యంలో పోతనామాత్యుడు శ్రీమహావిష్ణువు కరవైభవాన్ని వర్ణించడానికి లక్ష్మీదేవి కొప్పునే ఆశ్రయించాల్సి వచ్చింది. 'అంభోజతాక్షి వేణిన్ హరువు గనిన రోమాతి సౌభాగ్యమెంతే... చమిరి యొనరుపన్ చక్కనౌ తీవెయోనాన్' అంటూ కొప్పరపు కవులు ఒక అవధానంలో వేణీసౌందర్యాన్ని వర్ణించారు. 'కలుగక యిచ్చెడు మనుజులు/ తలవెండ్రుకలంత మంది తర్కింపంగా/ కలిగియు నీయని యధములు/ మొలవెండ్రుకలంత మంది మోహన రంగా' అని ఒక పూర్వకవి సంపన్న లోభుల మీద కసిదీరా తన అక్కసును వెళ్లగక్కాడు.

తల మీది వెంట్రుకలకే కాదు, పురుషుల మీసాలకు, గడ్డాలకు కూడా మన భాషా సాహిత్యాల్లో తగిన ప్రశస్తి ఉంది. మీసాలను పౌరుష చిహ్నాలుగా గుర్తిస్తారు. అందుకే 'మీసము పస మగ మూతికి' అన్నాడు చౌడప్ప. వైదికులకు మీసాలు పెంచే ఆచారం లేకపోయినా, తిరుపతి వేంకట కవులు మీసాలను పెంచారు. ఈ జంటకవులు మీసాలను పెంచడాన్ని కొందరు ఆక్షేపిస్తే, 'దోసమటంచెరింగియును దుందుడుకొప్పగ పెంచినారమే/ మీసము రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచు దెల్పగా/ రోసము గల్గినన్ కవి వరుల్ మము గెల్వుడు గెల్చిరేని ఈ/ మీసము దీసి మీ పాద సమీపములన్ తలలుంచి మ్రొక్కమే!' అని సవాలు విసిరారు. అదీ వారి కవన పౌరుషం!

కేశ సంరక్షణ కోసం స్త్రీ పురుష భేదం లేకుండా మనుషులు నానా తంటాలు పడటం శతాబ్దాల నుంచే ఉంది. తలకట్టు నిండుగా కనిపించడానికి వివిధ సుగంధ తైలాలను వాడేవారు. గాంభీర్యానికి గురుతైన మీసకట్టు ఏపుగా పెరగడానికి కూడా రకరకాల పద్ధతులు పాటించేవారు. 'అంబలి తాగేవాడొకడైతే మీసాలెత్తేవాడు ఇంకొకడు', 'మింగ మెతుకు లేదు గాని, మీసాలకు సంపెంగ నూనె' వంటి సామెతలు సమాజంలోని డాంబిక ఆడంబరాలను బయటపెడతాయి. బ్రిటిష్ హయాంలో ఆధునిక పోకడలు మొదలయ్యాక మన దేశంలో అలంకరణల పద్ధతుల్లో చాలా మార్పులే వచ్చాయి. తల వెంట్రుకలను, మీసకట్టును చిత్రవిచిత్రమైన పద్ధతుల్లో తీర్చిదిద్దుకోవడం మొదలైంది. ఈ మార్పులు మొదలైన కొత్తలో కొంత విచిత్రంగా చూసేవారు. అప్పటికింకా సంప్రదాయాలను వదులుకోని ఛాందసులు ఈ విచిత్ర కేశాలంకరణలను ఆక్షేపించేవారు. 'గొంగడి పురుగు కట్టింగు మీసాల వాడు/ గంపశ్రాద్ధపు తలకట్టువాడు' అని మాధవపెద్ది బుచ్చి సుందర రామ శాస్త్రి 'కన్యాశుల్కం'లోని గిరీశం పాత్రను వర్ణిస్తూ ఒక పద్యం రాశారు. తలకు చక్కగా నూనె పట్టించి, నున్నగా దువ్వుకోవడం పెద్దమనుషుల లక్షణంగా ఉండేది. ఆ రోజుల్లో టంగుటూరి ప్రకాశం పంతులు అలా నున్నగా దువ్విన తలకట్టుతో ఉండేవారు. ఆయన తలకట్టు సొగసును– 'ఈగ వ్రాలిన గాని వేగ జారెడునట్లు మువ్వంపు కురులను దువ్వినాడు/... చెవుల సందున గిరజాలు చిందులాడ మొగము మీదను చిరునవ్వు మొలకలెత్త/ టంగుటూరి ప్రకాశము రంగు మెరయ ధవళగిరి తీర్థమునకు తరలివచ్చె' అంటూ చిలకమర్తివారు వర్ణించారు.

ఆ రోజులే వేరు. సామాజిక, రాజకీయ జీవితాల్లో సరసత ఉండేది. ఇప్పుడు రాజకీయాలు బొత్తిగా మొరటుదేరిపోయాయి. అయితే, ఇప్పటికీ రాజకీయ నాయకుల ప్రసంగాల్లో తరచుగా కేశ ప్రస్తావన వస్తూనే ఉంటుంది గాని, వారి ప్రసంగాల్లో కేశాలకు సంబంధించి దొర్లే ముతక పదాలు జనాల చెవులను చిల్లులు పొడుస్తుంటాయి. అయినా, గొంగట్లో భోంచేసేటప్పుడు వెంట్రుకలను ఏరుకోక తప్పదు కదా!

ప్రేమ పెళ్లిళ్లపై రాజకీయ పెత్తనం

కామెంట్



కరణ్ థాపర్

ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని గుజరాత్ ముఖ్యమంత్రి ప్రకటించడంపై తాజాగా చర్చ మొదలైంది. ఇంకా విచిత్రం ఏంటంటే, పలువురు విపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా దీన్ని సమర్థించడం! ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి అయినటువంటి దేశంలో ఇదొక విచిత్ర పరిణామం. మన హక్కుల్ని మనమే హరించుకోవడం! నిజమైన ప్రజాస్వామ్యం... తల్లితండ్రులు, సమూహాల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా వ్యక్తుల హక్కులను విస్తృతపరిచే మార్గాలను నిరంతరం అన్వేషిస్తూనే ఉంటుంది. ఆ విధంగా పౌరుల కలలు, ఆశయాలు సాకారం అవుతాయి. అయితే మన రాజకీయ నాయకులు అందుకు విరుద్ధంగా చేయాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది.

మన రాజకీయ నాయకుల నుండి, అంతకంటే ఎక్కువగా మన ప్రభుత్వాధినేతల నుండి నేను ఆశించే ఒక విషయం... కొద్ది మోతాదులోనైనా వారు జ్ఞానం కలిగి ఉండటం, మన రాజ్యాంగం ప్రకారం మనకు సిద్ధించిన హక్కుల గురించి వారు తెలుసుకోవడం, ఆ హక్కులను అతిక్రమించినప్పుడు అతిక్రమించామని తెలుసుకోగలిగిన తెలివిడి వారికి ఉండటం! ఇప్పుడీ దుర్భరమైన నైతిక ఉపన్యాసపు వెలుగులో నేను చెప్పబోతున్న కథను మీరు వినాలి.

ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్ అన్నట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. ఈ పరిశీలన రాజ్యాంగ పరిమితులకు లోబడే జరుగుతుందని ఆయన అన్నప్పటికీ అదే రాజ్యాంగంలోని నిబంధన ఆయన సంకల్పించిన ఆ పనిని కచ్చితంగా అసాధ్యం చేస్తుంది. ఎందుకంటే అలా చేయడం అన్నది రాజ్యాంగం మనకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడం అవదా?

రాజ్యాంగం అనే ఆ అమూల్య పత్రంలో రాసివున్న దానిని బట్టి 18 ఏళ్లకు మనం పెద్దవాళ్లం అయినట్లు! అక్కణ్ణుంచి ఒక స్త్రీకి తను ఎవర్ని పెళ్లి చేసుకోవాలో, ఎప్పుడు పెళ్లి చేసుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ లభిస్తుంది. ఇంకా చెప్పాలంటే, చట్ట ప్రకారం విడాకులు తీసుకుంటే కనుక, ఎన్నిసార్లు పెళ్లి చేసుకోవచ్చన్న స్వేచ్ఛ కూడా! విచిత్రంగా పురుషులకు మాత్రం 21 సంవత్సరాల వయసు వచ్చే వరకు ఈ హక్కును రాజ్యాంగం అందించదు. వారు 18 సంవత్సరాల వయసులో ఓటు వేయవచ్చు కానీ, పెళ్లి మాత్రం చేసుకోవడానికి లేదు. ఈ సమ రాహిత్యం గురించి ఇంకో రోజు చూద్దాం.

రాజ్యాంగాన్ని మార్చితే తప్ప ప్రేమ వివాహాలలో తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేయలేమని ముఖ్యమంత్రికి తెలియదా? చూస్తుంటే ఆయనకు మన రాజ్యాంగం గురించి తెలియదని అనిపిస్తోంది. లేదా రాజ్యాంగాన్ని ఏకపక్షంగా మార్చే అధికారం తనకు ఉందని ఆయన చెబుతున్నట్లుగా ఉంది. లేదంటే, బహుశా... చెప్పింది చేయాలనేం ఉంది అనే ఉద్దేశం ఆయనలో ఉన్నట్లుంది.

ఉన్నవి ఉన్నట్లుగా ఆయన మాటలు ఇవీ: ''రుషికేశ్‌భాయ్ పటేల్



(ఆరోగ్య మంత్రి) నాతో ఏం అన్నారంటే – నచ్చిన వాడిని పెళ్లి చేసుకోవడం కోసం ఇల్లు వదిలి పారిపోతున్న అమ్మాయిల కేసులపై ఒక అధ్యయనం జరగాలనీ, పునరాలోచన జరపాలనీ... అందువల్ల ప్రేమ వివాహాలకు తల్లితండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసేందుకు ఏదో ఒకటి చేయ వచ్చనీ... ఇందుకు రాజ్యాంగం అడ్డుపడకపోతే కనుక మనం ఈ అధ్యయనాన్ని చేపట్టవచ్చు. ప్రయత్నం కూడా చేద్దాం. మంచి ఫలితాలు రావచ్చు కదా!''



గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్

ఇంకా విచిత్రం ఏంటంటే... పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భూపేంద్ర పటేల్‌ను ఈ విషయంలో సమర్థించడం. ముఖ్యమంత్రికి తన మద్దతునిస్తూ ఇమ్రాన్ ఖేడావాలా ఒక లేఖను కూడా రాశారు. ''తల్లితండ్రులు తమ పిల్లల్ని పెంచి పోషిస్తారు. కనుక పిల్లల వివాహానికి వారి సమ్మతి తప్పనిసరి'' అని ఖేడావాలా పేర్కొన్నారు. అంతేకాదు, గుజరాత్ శాసనసభ వర్షాకాల సమావేశాలలో దీనిపై ఒక బిల్లును ప్రవేశపెట్టాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ''ఈ బిల్లును తీసుకురావడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే ఈ రోజుల్లో పిల్లలు తమ తల్లితండ్రుల అదుపులో ఉండటం లేదు. మొద్దుబారి ఉంటున్నారు'' అని ఖేడావాలా వ్యాఖ్యానించారు.

ఈ రకమైన మనస్తత్వంతో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇమ్రాన్ ఖేడావాలా ఒక్కరే కాదు. జెనిబెన్ ఠాకూర్ కూడా! ఆమె మహిళా ఎమ్మెల్యే. జెనిబెన్, బీజేపీ ఎమ్మెల్యే ఫతేసిన్హ్ చౌహాన్ కలిసి, ''అమ్మాయి నివసిస్తున్న తాలూకాలోనే, స్థానికుల సమక్షంలో, తల్లి తండ్రుల సమ్మతితో వివాహం జరిగేలా గుజరాత్ రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజెస్ యాక్ట్, 2009ను మార్చాలి'' అని డిమాండ్ చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది.

ఓటు కోసం 18 ఏళ్లు నిండిన బాలికలకు క్రమం తప్పకుండా విజ్ఞప్తి చేస్తుండే ఈ పద్ధతైన పురుషులు, పద్ధతైన స్త్రీలలో ఎవరైనా తమను ఎవరు పరిపాలించాలో నిర్ణయించుకునేంత పరిణతి ఆ వయసు వారిలో ఉండదన్న వాదనను తీవ్రంగా తోసిపుచ్చకుండా ఉండి ఉంటారా? అయినప్పటికీ వారు 18 ఏళ్ల బాలిక తన తండ్రి సమ్మతి లేకుండా తన ఇష్టానుసారం వివాహం చేసుకోరాదని విశ్వసిస్తున్నారు. ఇలాంటి విషయాల్లో తల్లుల సమ్మతి రెండవ ప్రాధాన్యంగా ఉంటుంది, వాళ్లనొకవేళ లెక్కలోకి తీసుకుంటే కనుక.

ప్రజాస్వామ్యాలకు మాతృమూర్తి అయినటువంటి దేశంలో ఇదొక విచిత్ర పరిణామం. మన హక్కుల్ని మనమే హరించుకోవడం. నిజమైన ప్రజాస్వామ్యం... తల్లిదండ్రులు, సమూహాల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా వ్యక్తుల హక్కులను విస్తృతపరిచే మార్గాలను నిరంతరం అన్వేషిస్తుంటుంది. ఆ విధంగా పౌరుల కలలు, ఆశయాలు సాకారం అవుతాయి. అయితే మన రాజకీయ నాయకులు అందుకు విరుద్ధంగా చేయాలని నిర్ణయించుకున్నట్లుంది. మనం హక్కుల్ని పరిమితం చేస్తున్నాం. స్వేచ్ఛా పరిధులను తగ్గించేస్తున్నాం. వ్యక్తుల నిర్ణయాలపై అధికారంతో పెత్తనం చలాయిస్తున్నాం. తిరోగమనంలోకి వెళ్తున్నాం.

భారతదేశానికి ప్రజాస్వామ్యంతో ఉన్నది మాతృమూర్తి సంబంధం అని మన ప్రధాన మంత్రి అనడంలోని ఉద్దేశాన్ని గుజరాత్ ముఖ్యమంత్రి తప్పుగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది.

ప్రజాస్వామ్యానికి మన దేశాన్ని మారుతల్లిగా ఉంచేందుకు ఆయన సంకల్పించినట్లున్నారు. మార్మికంగా ఒక అద్భుతమైన మాతృమూర్తి అవతరించకుంటే మన యువరాణులు పర దృష్టికి చాటునే ఉండిపోతారు. బుగ్గపై చిన్న ముద్దుతో ఆ సౌందర్య రాశులను నిద్ర లేపే మహదావకాశాన్ని మన అందాల రాకుమారులు కోల్పోతారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం జరుగుతోంది?



నాతో గతంలో కలిసి పనిచేసిన ఒకామె గుండెపోటుతో చనిపోయింది. ఆమె వయసు 36. కేవలం ముప్పై ఆరేళ్లు! ఇది ఎవరైనా చనిపోయే వయసా? ఆమె టెన్నిస్ ఆడుతుండేది. నమ్మశక్యంగా లేదు.

- అంజలీ హెగ్డే, ట్రావెలర్

గుర్తించండి!



అధిక బరువు వల్ల ఇతరులతో సాధారణంగా కలవలేకపోవడం అనేది మన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది కాదనలేని సత్యం.

- ఆండ్రియాస్ పెట్కెర్, ఫిట్‌నెస్ కోచ్

పట్టింపే అర్హత



ఉన్నత విద్యాసంస్థల్లో బోధించేవాళ్లకు విద్యార్థుల గురించిన నిజమైన పట్టింపు ఉండటం అనేది చర్చకు తావులేని అర్హత. మనం బోధించే, మార్గదర్శకత్వం వహించే వారి వృత్తి సంబంధ అభివృద్ధికి పాటుపడటానికి మనం పరిశోధనలో ఎన్నో విజయాలు సాధించి ఉండటం అనేది ప్రత్యామ్నాయం కాదు.

- జెన్నిఫర్ ఎం.హీమ్‌స్ట్రా, ప్రొఫెసర్

కొత్త భాష్యమా?



ఇప్పుడు ల్యాప్‌టాపులు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు దిగుమతి చేసుకోవాలంటే లైసెన్సు కావాలి. కానీ 'ఇది లైసెన్స్ రాజ్ కాదు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం' అని జూనియర్ ఐటీ మినిస్టర్ చెబుతున్నారు. మరి 'లైసెన్స్ రాజ్' అంటే ఏమిటని ఆయన అనుకున్నారు? మనల్ని మూర్ఖులు అనుకుంటున్నారా?

- ప్రాణేశ్ ప్రకాశ్, పాలసీ కన్సల్టెంట్

మీరే కదా కారణం?



ఆఫ్రికన్లను అరబ్బులు 700 ఏళ్లపాటు దాస్యంలో ఉంచారు. యూరోపియన్లు 400 ఏళ్లపాటు దాస్యంలో ఉంచారు. మరో వందేళ్లు వలసవాద రాజ్యంగా ఉంచుకున్నారు. అయినప్పటికీ తరాల శాపం వల్ల ఆఫ్రికన్లు ఇబ్బంది పడుతున్నారని మాకు బోధించారు. నిజంగా మా పూర్వీకులు ఏం చేసినట్టు?

- అడేమోలా, ప్యాన్ ఆఫ్రికనిస్ట్

చేదు నిజం



సౌర ఫలకాలు పర్యావరణానికి మంచివని జనం అనుకుంటున్నారు. కానీ కాదు. అవి భారీ విషపూరిత లోహాలతో తయారవుతాయి. వాటిని రీసైకిల్ చేయరు. కావాలంటే చేయొచ్చు, కానీ దానికన్నా కొత్త రా మెటీరియల్‌ను కొనడం చౌక. కాబట్టి వాటిని గుట్టలుగా డంప్ చేస్తారు. చాలావరకు ఇవి చైనా బొగ్గుతో తయారవుతాయి. 'ఐపీసీసీ' అనుకున్నదానికంటే ఇవి మూడు రెట్ల కర్బన ఉద్గారాలను వెదజల్లుతాయి.

- మైకేల్ షెలెన్‌బెర్జెర్, పర్యావరణాంశాల రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విప్లవ సాంస్కృతిక యుగకర్త



బి.ఎస్.రాములు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆదివారం హఠాత్తుగా కన్నుమూసిన గద్దర్ ఒక ప్రజా యుద్ధనౌక. విప్లవ ఉద్యమంలో గద్దర్ పేరుతో సుప్రసిద్ధులైన గుమ్మడి విఠల్ రావుది ఓ సుదీర్ఘ పోరాటం. 76 ఏళ్ల జీవితంలో 50 ఏళ్ళు ప్రజా ఉద్యమాలకు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అంకితమై, లక్షలాది ప్రజలకు స్ఫూర్తినిచ్చారాయన. ఆట, పాట, మాట ద్వారా కోట్లాది ప్రజల హృదయాలను కదిలించారు. వారి హృదయాల్లో జీవించారు. వేలాది విప్లవ కార్యకర్తలు గద్దర్ ఆట, పాట, మాటతో ఉత్తేజితులై విప్లవంలోకి పయనించారు. విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకొని వెళ్ళారు. ఒక్క మాటలో విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్ దిక్సూచి. ఒక గద్దర్, ఒక వంగపండు కలిస్తే... ఒక మహా ప్రవాహమే.

గద్దర్‌కు చాలా కాలం సంజీవ్ ఒక గొంతుకై నిలిచాడు. డోలకిస్టులు ఎందరో గద్దర్‌కు తోడై నిలిచారు. ఎందరో కళాకారులు ఆయన కళ్ళముందే అమరులయ్యారు. గద్దర్‌తో నాది నాలుగు దశాబ్దాల అనుబంధం. విప్లవోద్యమంలో కలిసి తిరిగాము. కలిసి పని చేశాము. అన్ని దశల్లో ఆత్మీయులుగా, భావాలకు అతీతంగా స్నేహాన్ని కొనసాగించాము. మలి తెలంగాణ ఉద్యమంలో గద్దర్ మహత్తర పాత్ర నిర్వహించారు. తొలి అడుగులోనే తూటాలకు ఎర అయ్యాడు.

గద్దర్ ఆశ, ఆశయం – సమ సమాజ నిర్మాణం, స్వామ్యవాద వ్యవస్థ. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అందరికీ సమాన అవకాశాలు, అన్ని సామాజిక వర్గాలకూ, మహిళలకూ ప్రాతినిధ్యం కోసం... ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధించాల్సిన సాంస్కృతిక విప్లవం కోసం... జీవితమంతా కృషి చేశారు గద్దర్. కూడు – గుడ్డ – నీడ కోసం... 'దున్నే వారికే భూమి' కోసం... 'జల్ – జంగల్ – జమీన్' కోసం... బొగ్గుబాయి, దుబాయి, బొంబాయి కార్మికుల కోసం... విద్యార్థి, యువజన, రైతుకూలీ, ఉపాధ్యాయ ఉద్యోగ ఉద్యమాల నిర్మాణం కోసం... గద్దర్ ఎత్తిన గొంతు ఎన్నడూ దించలేదు. గద్దర్ లక్షలాది, కోట్లాది ప్రజల గొంతుకై నిలిచాడు. పాటై వారి హృదయంలో నిలిచారు. ప్రజాకవి, మహాకవి, దార్శనికుడిగా ఎదిగిన గద్దర్ ఎన్ని డాక్యుమెంట్లు రాశారో! ఎన్ని చర్చలు లిఖితబద్ధం చేశారో లెక్క లేదు. 'భారత దేశం భాగ్యసీమరా... భావి పంటలకు లోటు లేదురా...' అంటూ రాసిన పాట భారతీయ విప్లవోద్యమాన్ని అరటిపండు ఒలిచినట్టు అందించింది. వేల పాటలు రాసిన గద్దర్ ఎప్పటికప్పుడు సందర్భాన్ని అనుసరించి ఆశుకవిగా, వాగ్గేయకారుడిగా ముందుకు సాగుతూనే వచ్చారు.

గద్దర్ ఒక లెజెండ్. ఒక ట్రెండ్ సెట్టర్. గద్దర్‌కు ముందు, గద్దర్ తరువాత... తెలుగు సాహిత్య, సాంస్కృతిక ఉద్యమం అంటూ వేరు. గద్దర్ ప్రవేశంతో సాంస్కృతిక రంగం ఉత్తుంగ తరంగమై హిమాలయ పర్వతాలను స్పర్శించింది. వేలాది, లక్షలాది గద్దర్లు గ్రామగ్రామన, జిల్లా జిల్లాన రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎదిగివచ్చారు. దండకారణ్యంలో అబూజిమడ్, బెంగాల్‌లో, బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో, ఛత్తీస్‌గఢ్‌లో, మహారాష్ట్రలో, కర్నాటకలో, తమిళనాడులో, ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో, ఒరిస్సాలో వందలాది గద్దర్లు ఎదిగారు. ప్రతి గ్రామంలో, విద్యార్థుల విలేజ్ క్యాంపులో ఒక జననాట్యమండలి బృందం కలిసి నడిచింది. దాన్ని తీర్చిదిద్దినవాడు గద్దర్. ఆయన వెంకటాపురంలోని తన ఇంటినే విప్లవ సాంస్కృతిక కేంద్రంగా దశాబ్దాల తరబడి నిర్వహించారు.

ధైర్యమే గద్దర్ శ్వాస. ఆత్మ విశ్వాసమే అతని ప్రాణం. ప్రజాసేవే అతని ఆరోగ్యం. 1997 ఏప్రిల్ 6న ముష్కరుల కాల్పుల్లో



ఆరు తూటాలు తగిలి, తిరిగి ప్రాణం పోసుకున్న గద్దర్‌లో ఒక తూటా శరీరంలోనే ఉండిపోయింది. ఐదు తూటాలను జయించినవాడు. చావును జయించినవాడు. కనపడని కత్తిపోట్లు, తూటాలు ఎన్నో! వెన్నుపోట్లు ఎన్నో...! అవేవీ అతణ్ణి కదిలించలేకపోయాయి. గద్దర్ ఆరోగ్యం కుదుట పడుతుందనుకున్నాను. భీష్ముడిలా స్వచ్ఛందంగా తాను కోలుకున్నప్పుడే తుదిశ్వాస విడుస్తాడనుకున్నాను. గుండె ఆపరేషన్ విజయవంతమై తిరిగి జనంలోకి వస్తాడనుకున్నాను. కేవలం 130 ఉండాల్సిన బ్లడ్ షుగర్ 350 పాయింట్లకు పెరిగినా, లెక్కచేయకుండా ఆడిపాడిన ధైర్యం అతడిది. గద్దర్ పాటలు, మాటలు అనేక సీడీలలో, యూట్యూబ్‌లో రికార్డయి ఉన్నాయి. గద్దర్ అనేక పుస్తకాలు రాశారు. 'తరగని గని' అనే పుస్తకంలో ప్రజల పాటలు ఎలా రాయాలో చెబుతూ తన అనుభవాలను వివరించారు. గద్దర్ తన పేరు లేకుండా వందలాది పాటలు పాడుతూనే వచ్చారు. వందలాది కవులు, గాయకుల పాటలు పాడి ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఇలా స్వయంగా ఒక కవి, గాయకుడు, వాగ్గేయకారుడు ఇతరుల పాటలు పాడి, ప్రాచుర్యంలోకి తేవడం సాహిత్య సాంస్కృతిక చరిత్రలో అరుదైన విషయం.

బసవేశ్వరునికీ, వాల్మీకికీ, వ్యాసునికీ, నన్నయ్యకూ, పాల్కురికి సోమన్నకూ, తిక్కనకూ మరణం ఉంటుందా? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, మహాత్మా జ్యోతిబా పూలే, బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణ గురు, సావిత్రిబాయి పూలే తదితరులు చరిత్రను మలుపు తిప్పిన మహనీయులు. వారికి మరణం లేదు. గద్దర్‌కూ మరణం లేదు. ఆయన చిరంజీవి. పూలేకు సావిత్రీబాయిలా జీవితమంతా ఉద్యమంలో గద్దర్‌కు తోడై నిలిచిన సహచరి విమలక్కకూ, కుటుంబానికీ తీవ్ర సంతాపం. ఒక యుగకర్త గద్దర్‌కు జోహార్లు.

– వ్యాసకర్త, సామాజిక తత్వవేత్త
మొబైల్: 8331 966 987

పాటను కాల్చేస్తారా?

పాటను కాల్చేస్తారా హంతకులారా
ప్రగతిని చంపేస్తారా వంచకులారా

పాటంటే ఏమి పాట?
పదాల వంటకం కాదు,
ఎవరి మెప్పుకో తెగ వ
ల్లించే దండకం కాదు,
అణచబడ్డ జన కంఠం
నినదించిన రక్త ఘోష.



డబ్బు కొరకు ఉన్నోళ్ళే
గబ్బు పనులు చేస్తుంటే
సీట్ల కొరకు గొప్పోళ్ళే
బూట్లు నాకుతూ వుంటే
ఏం బతుకులురో అని కాం
డ్రించిన లేనోళ్ళ భాష.

ఎక్కడ దోపిడి వుంటే
అక్కడ తొడగొట్టింది.
మోసం ఎంతటిదైనా
ముసుగు చించి చూపింది.
ఏ చెరలో తొక్కేసిన
ఎర్రగ ఎగిరే పతాక.

– సి. నారాయణ రెడ్డి

(ప్రజా గాయకుడు గద్దర్‌పై జరిగిన హత్యా ప్రయత్నానికి నిరసనగా అప్పట్లో రాసిన కవిత)

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.11.14 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** రేవతి ఉ.8.11 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** రా.3.31 నుండి 5.03 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** రా.12.23 నుండి 1.54 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.28.

క్లుప్తంగా...

న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పెంపొందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు



కోర్టు భవనాలకు శంకుస్థాపన చేస్తున్న జస్టిస్ మన్మథరావు, జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ రవీంద్రబాబు తదితరులు

మార్కాపురం: న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పెంపొందించేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా కోర్టు పరిపాలనా వ్యవహారాల ఇన్‌చార్జి జస్టిస్ మన్మథరావు అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని కోర్టు ప్రాంగణంలో నిర్మించిన జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి నివాసగృహం ప్రారంభోత్సవం, రూ.6 కోట్లతో నిర్మించనున్న రెండు న్యాయస్థాన భవనాలకు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని న్యాయమూర్తి నివాస గృహాన్ని ప్రారంభించడంతోపాటు కోర్టు భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు.

'అగ్నికుల క్షత్రియులను చైతన్యవంతం చేస్తాం'

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అగ్నికుల క్షత్రియులను చైతన్యవంతులను చేసేందుకు జిల్లాల వారీగా మినీ మహాగర్జనలు నిర్వహించి, ఆ తర్వాత లక్ష మందితో మహా గర్జన ఏర్పాటు చేస్తామని అగ్నికుల క్షత్రియ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఏపీలో చిత్తూరు జిల్లా కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు తమ సామాజికవర్గం దాదాపు 40 లక్షల జనాభా ఉందన్నారు. అయినా తాము ఇంకా వెనుకబడే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆంధ్రప్రదేశ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు చింతా రామకృష్ణ, గాడి రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు వేసిన పాచిక పారలేదు: అడపా శేషు



సాక్షి, అమరావతి: పద్నాలుగేళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబూ.. ఒక్క ప్రాజెక్ట్ అయినా పూర్తి చేశావా? ఇప్పుడు సిగ్గు లేకుండా ప్రాజెక్టుల యాత్ర అంటూ అలజడులు సృష్టిస్తావా? అంటూ ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి మండిపడ్డారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరికీ మేలు జరిగిందన్నారు. సీమను వైఎస్సార్ రతనాల సీమను చేశారని, ఆయన తనయుడు సీఎం జగన్ అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు తాను మరుగునపడిపోతాననే భయంతో ప్రాజెక్టుల యాత్ర పేరుతో రాయలసీమలో రక్తపాతం సృష్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. టీడీపీ కార్యకర్తలను చంద్రబాబు రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించి, దానిని వైఎస్సార్‌సీపీపైకి నెట్టి పెడ బొబ్బలు పెట్టి ప్రజల సానుభూతి పొందాలన్న బాబు డ్రామా రక్తికట్టలేదని ఎద్దేవా చేశారు. పుంగనూరు ఘటనకు పూర్తి బాధ్యత చంద్రబాబుదేనని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అడపా శేషు డిమాండ్ చేశారు.

'గిరిజనుల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా లోకేశ్'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎవరి హయాంలో గిరిజనుల అభివృద్ధి జరిగిందో లెక్కలతో సహా వివరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, చిత్తశుద్ధి ఉంటే లోకేశ్ బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ సవాల్ విసిరారు. తాడేపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ గిరిజనులకు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నా గిరిజనులకు చేసిందేమీ లేకపోవడంతో ఎన్టీఆర్ హయాంలో గిరిజనులకు ఐటీడీఏలను ఏర్పాటు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం: గిడుగు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. కడపలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించిన అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు కో–ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీకి తొత్తులుగా మారాయన్నారు.

మగ్గానికి మహర్దశ

చేనేత రంగానికి సంక్షేమం అద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సొంత మగ్గం ఉన్న కుటుంబానికి ఏటా రూ.24 వేలు	ఇప్పటివరకు నేతన్నల సంక్షేమానికి రూ.3,706 కోట్లు	సర్కారు సాయంతో మగ్గాల ఆధునీకీకరణ	క్లస్టర్ ట్రైనింగ్‌తో సబ్సిడీపై పరికరాలు	నేడు జాతీయ చేనేత దినోత్సవం



మంగళగిరిలో మగ్గంతో చీర నేస్తున్న రాజ్యలక్ష్మి

సాక్షి, అమరావతి: మగ్గానికి మహర్దశ వచ్చింది. పోగు పోగుగా సంక్షేమం అందుతోంది. నేతన్నల నరాలు సత్తువ పుంజుకున్నాయి. మొత్తంగా చేనేత రంగం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమాన్ని అద్దుకుంది. స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగానికి ప్రముఖ పాత్ర ఉంది. అందుకే 1905లో ప్రారంభించిన స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం. దేశవ్యాప్తంగా చూస్తే ఇతర రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ చేనేత రంగం తన ప్రాభవాన్ని కోల్పోయి శిథిలావస్థకు చేరుకుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మగ్గానికి మహర్దశ పట్టింది. సీఎం వైఎస్ జగన్ అందించిన 'వైఎస్సార్ నేతన్న నేస్తం' చేనేత కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. మగ్గాల ఆధునికీకరణతోపాటు చేనేత సామగ్రి కొనుగోలుకు ఊతమిచ్చింది. ఆధునిక డిజైన్లు, పోటీ మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాల తయారీలో ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ చేనేతకు కొత్త హంగులు అందిస్తోంది. ప్రత్యేకంగా క్లస్టర్ ట్రైనింగ్ సెంటర్లు పెట్టి శిక్షణ అనంతరం ఆధునిక యంత్రాలను సబ్సిడీపై అందించే కార్యక్రమం చేనేతల తలరాతలను మారుస్తోంది.

'నేతన్న నేస్తం'తో రూ.969.77 కోట్లు

చేనేత కుటుంబాలకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం వరుసగా ఐదేళ్లు 'నేతన్న నేస్తం' ద్వారా రూ.969.77 కోట్లు అందించింది. సొంత మగ్గం కలిగిన ప్రతి నేతన్నకూ ఏడాదికి రూ.24 వేల చొప్పున ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున అందించింది. ఈ పథకం అమలు తర్వాత చేనేత కార్మికులు తమ మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసి కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ జీవితాలను మెరుగుపర్చుకున్నారు. దీంతోపాటు నేతన్నల పెన్షన్ కోసం రూ.1,396.45 కోట్లు ఇచ్చింది. చేనేత రంగానికి ఊతమిచ్చేలా ఆప్కోకు రూ.468.84 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో కలిపి) చెల్లించింది. నేతన్న నేస్తం, నేతన్న పెన్షన్, ఆప్కోకు మూడు పథకాల ద్వారానే నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.2,835.06 కోట్లు వ్యయం చేసింది. గత ప్రభుత్వం నేతన్నల కోసం ఐదేళ్లలో కేవలం రూ.442 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా.. వైఎస్ జగన్ ప్రభుత్వం కేవలం నాలుగేళ్లలోనే నవరత్నాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.3,706 కోట్లు ఖర్చు చేయడం విశేషం.

చేనేత వారోత్సవాల నిర్వహణకు ఆదేశాలు

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని, క్లిష్టమైన బట్టలను నేయడానికి అంకితమైన కళాకారులను, ప్రోత్సహించేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేసిన జవహర్‌రెడ్డి అదే స్ఫూర్తితో యువతరం సైతం చేనేత వస్త్రాలు ధరించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి కలెక్టరేట్, ఎమ్మార్వో కార్యాలయాల ఆవరణలో చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాలు నిర్వహించేలా స్టాల్స్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. ఆగస్టు 7న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేనేత వస్త్రాలు (చీర, ధోతీ) ధరించి వాక్‌థాన్ నిర్వహించాలన్నారు. ఇకపై ప్రతి శనివారం స్వచ్ఛందంగా చేనేత వస్త్రాలు ధరించాలని ఉద్యోగులను కోరారు.

నెక్ట్స్ ఐటీ క్యాపిటల్‌గా విశాఖ

- ఐటీ, స్టార్టప్‌ల కేంద్రంగా ఈ నగరాన్ని సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారు
- రాష్ట్రంలో 250 ఐటీ కంపెనీల ద్వారా 65,000 మందికి ఉపాధి కల్పిస్తోంది
- ఐటీ కేంద్రాల ఏర్పాటుకు విజయవాడ, కాకినాడ, తిరుపతి అనువైనవి
- సింగపూర్‌లో జరిగిన వరల్డ్ ఐటీ తెలుగు కౌన్సిల్ సమావేశంలో మంత్రి అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: భారతదేశ నెక్ట్స్ ఐటీ క్యాపిటల్‌గా విశాఖ నగరం ఎదగనుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రపంచ ఐటీ సంస్థలను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. సింగపూర్‌లో జరుగుతున్న వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొని రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రానున్న కాలంలో ఐటీ, స్టార్టప్స్‌కు విశాఖను కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి గతేడాది జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పేర్కొనడమే కాక ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, విప్రో వంటి సంస్థలతోపాటు తాజాగా ఇన్ఫోసిస్ కార్యకలాపాలను ప్రారంభించినట్లు తెలిపారు.

ఐటీ సంస్థల కోసం ఎకో సిస్టం అభివృద్ధి

ఇక రాష్ట్రవ్యాప్తంగా 250కు పైగా ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు పనిచేస్తున్నాయని, వీటి ద్వారా 65,000 మందికి ఉపాధి లభిస్తోందన్నారు. ఈ ఏడాది విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో 13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు కుదిరితే అందులో ఐటీ రంగం నుంచి 1.3 లక్షల మందికి ఉపాధి కల్పించే 69 ఒప్పందాలు జరిగాయన్నారు. మరోవైపు.. విశాఖతోపాటు విజయవాడ, కాకినాడ, తిరుపతి నగరాల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటుచేసే విధంగా ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నట్లు అమర్‌నాథ్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100కు పైగా ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ హాజరయ్యారు.

దళితులకు రాజ్యాధికారం కల్పించిన వైఎస్సార్ కుటుంబం

- శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



తణుకులో ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

తణుకు అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారంలో భాగం కల్పించిన ఘనత వైఎస్సార్ కుటుంబానికి మాత్రమే దక్కుతుందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం, ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాల్లో దళితులకు నామినేటెడ్ పదవులు వస్తాయా అని ఎదురుచూసే దుస్థితి ఉండేదని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అధిక శాతం దళితులకు ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. హోంమంత్రి తానేటి వనిత, మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్, ఎంబీసీ చైర్మన్ పెంట్ర వీరన్న, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య పాల్గొన్నారు.

పింఛన్ వల్లేనని మీకు చెప్పిందా రామోజీ?

- అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకుంటే దుష్ప్రచారం
- స్వయాన మృతురాలి తల్లి పోలీసులకు ఏం చెప్పిందో నిర్ధారించుకోరా?
- మృతురాలి తల్లి ప్రభుత్వ ఉద్యోగి అని మీకు తెలియదా?
- వారికి 2,705.12 చ.అ ప్రాపర్టీ ఉండటం నిజం కాదా?
- ఫలానా కారణం వల్లే చనిపోతున్నానని ఆమె మీకేమైనా ఫోన్ చేసిందా?



పింఛన్ పోరాటంలో ఉరితాడే దిక్కైంది..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకున్న రామోజీ మరోమారు తన నైజాన్ని చాటుకున్నారు. దివ్యాంగురాలు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంటే దానిని ఈ ప్రభుత్వానికి అంటగడుతూ 'పింఛన్ పోరాటంలో ఉరితాడే దిక్కైంది..' అంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ విషం చిమ్మారు. పింఛన్‌కు అర్హురాలిగా నిరూపించుకొనేందుకు, సర్కారుపై పోరుసల్పే సత్తువలేక ఉరి వేసుకొని చనిపోయిన ఓ దివ్యాంగురాలి దీనగాథ అంటూ అడ్డగోలు రాతలు రాశారు. వాస్తవానికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో ఇరువూరి ప్రశాంతికుమారి (38), తన తల్లి వెంకట నర్సమ్మతో కలిసి నివసిస్తోంది. వెంకటనర్సమ్మ స్కిల్‌డెవలప్‌మెంట్‌లో ఆయాగా పొరుగు సేవల ఉద్యోగినిగా పని చేస్తోంది. తండ్రి వెంకటేశ్వరరెడ్డి మూడేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ప్రశాంతి కుమారి చిన్నతనం నుంచి కాళ్లు పనిచేయక పోవడంతో వీల్ చైర్ ఆధారంగా జీవనం సాగిస్తోంది. ఆమె గతంలో దివ్యాంగ పింఛన్ పొందేది. అయితే ఇటీవల విచారణ సమయంలో 2,705.12 చదరపు అడుగులు గల మూడు బిల్డింగులు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో వచ్చింది. అసెస్‌మెంట్ నంబర్ 1073034342కు సంబంధించిన భవనం 866.65 చదరపు అడుగులు, అసెస్‌మెంట్ నంబర్ 1073034343లో 489.94 చదరపు అడుగులు, అసెస్‌మెంట్ నంబరు 1073032643లో 1348.53 చదరపు అడుగులు, మొత్తం 2,705.12 చదరపు అడుగుల అర్బన్ ప్రాపర్టీ ఉందని విచారణలో తేలింది. తల్లి వెంకట నరసమ్మకు సీఎఫ్‌ఎంసీ ఐడీ క్రియేట్ అయినందున సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌లో, ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించినట్లు నమోదు కావడంతో ఆన్‌లైన్ వెరిఫికేషన్‌లో పింఛన్ రద్దయింది. ఆమె పింఛన్‌ను ఉద్దేశ పూర్వకంగా ఎవరూ తొలగించలేదు.

అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది..

స్థానిక రెవెన్యూ పోలీసు విచారణలో ప్రశాంతి కుమారికి కుటుంబ సభ్యులతో వివాదాలు ఉన్నాయని, అనారోగ్యంతో చికిత్స పొందుతోందని తేలింది. తల్లి వెంకట నరసమ్మ సైతం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తీవ్రమైన తలనొప్పి, అనారోగ్యంతో చికిత్స పొందుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని పేర్కొంది. ప్రశాంతి కుమారి ఇంట్లోనే ఉరి వేసుకొని మరణించడంతో భవానీపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ విషయాలన్నింటినీ దాచిన ఈనాడు పనిగట్టుకుని ప్రభుత్వంపై విషం చిమ్మింది. కట్టుకథ ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చేలా కుట్ర పన్నడం దారుణం. సదరు మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మీకేమైనా ఫోన్ చేసిందా రామోజీ?

హిందూ ధర్మం, ఆచార సంప్రదాయాలపై ప్రచారం

- అన్నవరంలో ప్రారంభించిన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- నెలరోజుల పాటు ధర్మ ప్రచార మాసోత్సవాల నిర్వహణ
- విజయవాడ, శ్రీశైలం దేవస్థానాల్లో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు
- సెప్టెంబర్ 7న వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం జగన్



జెండా ఊపి ధర్మ ప్రచార మాసోత్సవాలు ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్

అన్నవరం: ప్రముఖ దేవాలయాల ద్వారా రాష్ట్రం నలుమూలలా హిందూ ధర్మం, ఆచార సంప్రదాయాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల రోజుల పాటు పెద్ద ఎత్తున ధర్మ ప్రచారం చేయనున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ధర్మ ప్రచార మాసోత్సవాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. తొలుత రాష్ట్ర ప్రజల సౌభాగ్యం కోసం, విస్తారంగా వర్షాలు కురవాలని కోరుతూ మంత్రి దంపతులు సత్యదేవుని వ్రతమాచరించారు. అనంతరం వినాయక అతిథి గృహం నుంచి సత్యదేవుని ఆలయం వరకూ వందలాది మంది కళాకారులు, భక్తులతో శోభాయాత్ర నిర్వహించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు మంత్రి, ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సత్యదేవుని ప్రచార రథానికి జెండా ఊపి, ధర్మ ప్రచార మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడ దుర్గగుడి, శ్రీశైలం దేవస్థానాల్లో రూ.200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఈ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్ 7న వర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆ విధంగా చంద్రబాబు శునకానందం'

తాడికొండ: బ్రిటీష్ వారి కంటే ఘోరంగా పేదలను, వారి హక్కులను అణగదొక్కాలని చూస్తున్న బాబు ఆయన బినామీలను వదిలేది లేదని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1043వ రోజుకు చేరాయి. శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల పాలనలో పేదవాడికి ఒక్క సంక్షేమ పథకం, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం వీసమంత సాయం చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఒకేసారి 35 లక్షల మంది పేదలకు అవన్నీ అందుతుంటే ఓర్వలేక అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

నమ్మించి.. నట్టేట్లో తోసేసి..

- మహిళను, ఇద్దరు పిల్లలను గోదావరిలోకి తోసేసిన దుర్మార్గుడు
- తల్లి, ఏడాది చిన్నారి గల్లంతు
- బ్రిడ్జి కేబుల్ పైపు మీద వేలాడుతున్న బాలికను కాపాడిన పోలీసులు
- నిందితుడి కోసం గాలింపు
- రావులపాలెం వద్ద ఘటన





గోదావరి బ్రిడ్జికి ఉన్న కేబుల్ పైపును పట్టుకుని ఉన్న కీర్తన



గోదావరిలో గల్లంతైన సుహాసిని, జెర్సీ (ఫైల్)

రావులపాలెం/తాడేపల్లి రూరల్: ఓ బిడ్డతో కలిసి ఉంటున్న మహిళను ప్రేమ పేరుతో నమ్మించాడు.. మూడేళ్ల పాటు సహజీవనం చేశాడు. ఓ చిన్నారికి జన్మనిచ్చాడు. అనంతరం వారిని ఎలాగైనా వదిలించుకోవాలనుకున్నాడు. మాయమాటలు చెప్పి తల్లీబిడ్డలను గోదావరి బ్రిడ్జి పైకి తీసుకువచ్చి.. నిర్దాక్షిణ్యంగా నదిలోకి తోసేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం వద్ద జరిగిన ఈ ఘటనలో తల్లి, ఏడాది చిన్నారి గల్లంతవ్వగా.. 13 ఏళ్ల బాలికను పోలీసులు రక్షించారు. వివరాలు.. భర్తతో విభేదాల వల్ల పుప్పాల సుహాసిని(36) కృష్ణా జిల్లా గుడివాడ నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లికి వచ్చి ఓ హోటల్‌లో పనిచేస్తూ కుమార్తె లక్ష్మీ సాయి కీర్తనతో కలిసి జీవిస్తోంది. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉలవ సురేశ్ కూడా తాడేపల్లిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. సురేశ్‌కు అప్పటికే వివాహమైంది. అయినా సుహాసినిని ప్రేమిస్తున్నానంటూ నమ్మించాడు. ఎన్టీఆర్ కరకట్ట మీద ఉన్న ఓ ఇంట్లో మూడేళ్లుగా కలిసి జీవిస్తున్నారు. జెర్సీ(ఏడాది పాప) జన్మించిన తర్వాత గొడవలు మొదలై ఇద్దరూ విడిపోయారు. సుహాసిని తన ఇద్దరు బిడ్డలతో కలిసి క్రిస్టియన్‌పేటలో ఉంటోంది. సురేశ్ తరుచూ వచ్చి సుహాసినితో గొడవ పడేవాడు. దీంతో సుహాసిని తన పెద్ద కుమార్తె కీర్తనకు ఫోన్ ఇచ్చి.. ఇంటికి ఎవరైనా వచ్చి బెదిరిస్తే 100కు ఫోన్ చేయాలని ధైర్యం చెప్పి పనికి వెళ్లేది. ఈ నేపథ్యంలో సురేశ్ దుస్తులు కొందామని నమ్మించి సుహాసిని, లక్ష్మీకీర్తన, జెర్సీలను శనివారం రాత్రి కారులో రాజమహేంద్రవరం తీసుకువచ్చాడు. అక్కడి నుంచి రావులపాలెం తెచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గౌతమీ గోదావరి పాత బ్రిడ్జి పైకి కారును తీసుకువచ్చి ఆపాడు. ఆ తర్వాత కొంతసేపటికి సెల్ఫీ తీసుకుందామంటూ సుహాసినిని బ్రిడ్జి గోడపై కూర్చోమని చెప్పి.. సుహాసినితో పాటు జెర్సీని గోదావరిలోకి తోసేశాడు. అనంతరం కారులో కూర్చుని ఫోన్‌లో పాటలు వింటున్న కీర్తనను కూడా బయటకు తెచ్చి గోదావరిలోకి తోసేశాడు. ఆ తర్వాత సురేశ్ కారులో పరారయ్యాడు.

సకాలంలో స్పందించిన పోలీసులు

బ్రిడ్జి పై నుంచి పడిపోతున్న సమయంలో కీర్తన బ్రిడ్జికి ఉన్న కేబుల్ పైపును బలంగా పట్టుకుంది. తన వద్ద ఉన్న ఫోన్‌తో తెల్లవారుజామున 3.50 గంటలకు 100 నంబర్‌కు డయల్ చేసింది. పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఫోన్ లొకేషన్ ఆధారంగా 10 నిమిషాల్లోనే అక్కడికి చేరుకొని ఆమెను రక్షించారు. ప్రథమ చికిత్స అందించి డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. సుహాసిని, కీర్తన ఆచూకీ కోసం పోలీసులు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడి కోసం మరో బృందం విస్తృతంగా గాలిస్తోంది. కీర్తన ప్రాణాలను కాపాడిన పోలీసులను ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

కుటుంబ కలహాలతో ముగ్గురి దారుణ హత్య

బిట్రగుంట: కుటుంబ కలహాలతో ముగ్గురిని దారుణంగా చంపిన ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొండబిట్రగుంటలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. కొండబిట్రగుంటకు చెందిన రైల్వే ఉద్యోగి మందాటి మధుసూదన్‌కు, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన మౌనిక(32)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల వల్ల నాలుగేళ్ల నుంచి భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. మధుసూదన్ బిట్రగుంట రైల్వేస్టేషన్ టెలికాం విభాగంలో పనిచేస్తూ కొండబిట్రగుంటలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మౌనిక బెంగళూరులో నివసిస్తోంది. వీరి కుమారుడు ఎనిమిదేళ్ల మన్విత్ బుచ్చిరెడ్డిపాళెంలోని అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం మధుసూదన్ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మౌనిక తన తండ్రి కృష్ణయ్య, అమ్మమ్మ శాంతమ్మ, కుమారుడు మన్విత్‌తో కలిసి కొండబిట్రగుంటకు వచ్చింది. పెద్దకర్మ జరగాల్సి ఉండడంతో ఇక్కడే ఉంటున్నారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున మౌనిక(32)ను, ఆమె తండ్రి కృష్ణయ్య(65)ను, ఆమె అమ్మమ్మ శాంతమ్మ(75)ను దారుణంగా ఇంట్లోనే హతమార్చారు. ఆదివారం ఉదయం బుచ్చిరెడ్డిపాళెంలో ఉంటున్న మౌనిక తల్లి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఎవరూ ఫోన్ తీయలేదు. అనుమానం వచ్చిన ఆమె పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే కొండబిట్రగుంటకు వచ్చిన తాళాలు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా ముగ్గురి మృతదేహాలు కనిపించాయి. మౌనిక మామ మాల్యాద్రి, అత్త ధనమ్మ, మరిది చంద్రమౌళి కనిపించకపోవడం, మౌనిక కుమారుడి మన్విత్ జాడ కూడా లేకపోవడంతో అత్తింటి వాళ్లే హత్యలు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి. కాగా, మౌనిక అత్త ధనమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

'ఆరోగ్యశ్రీ' పేషెంట్లకు ఆత్మీయ పలకరింపు

- రోగుల ఇంటికెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్న స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు

ఒంగోలు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొంది ఆరోగ్యంగా ఇంటికి చేరిన వారిని ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు ఆదివారం స్వయంగా వెళ్లి పలకరించారు. వైద్య సేవలు అందిన తీరు, వారి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం కనపర్తి శివారు ప్రాంతమైన కుక్కలవారిపాలేనికి చెందిన గోపిరెడ్డి కిడ్నీ వ్యాధిగ్రస్తుడు. తనకు వైద్యం చేయించగలరా అంటూ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్‌కు ఫోన్ చేశాడు. దీనిపై స్పందించిన అశోక్‌బాబు అతని వ్యాధికి సంబంధించిన కాగితాలను తెప్పించుకుని పరిశీలించారు. స్థానిక ప్రైవేటు వైద్యశాలలో కిడ్నీ ఆపరేషన్ చేయించారు. ఆదివారం కుక్కలవారిపాలేనికి చేరుకుని గోపిరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఒక్క ఫోన్ కాల్‌కే స్పందించి వైద్యం అందించడం ఆశ్చర్యంగా ఉందని, ఇటువంటి గొప్ప పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు అంటూ కంటతడి పెట్టుకున్నాడు. అలాగే నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన అత్తింటి మధుబాబు కాలు నరం ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఓ రోజు డాక్టర్ యాదాల అశోక్‌బాబును కలిసి సమస్యను విన్నవించుకున్నాడు. స్పందించిన ఆయన వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. ఆపరేషన్ విజయవంతమై ఇంటికి చేరిన మధుబాబును ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుబాబు, ఆయన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఓపీ నుంచి ఆపరేషన్ వరకు ఉచితంగా అందించారని సంతోషం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు పథకం నిర్వహణలో ఫీడ్ బ్యాక్ కూడా కావాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారని గుర్తు చేశారు.

ముగ్గురు విద్యార్థుల మృతి



ఉదయ్‌కిరణ్, హర్షవర్ధన్, టి.హేమంత్ (ఫైల్)

మధురపూడి: కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకువెళ్లడంతో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన తూర్పు గోదావరి జిల్లా బూరుగుపూడి సమీపాన శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. డి.హర్షవర్ధన్ (19), టి.హేమంత్ (19), కె.ఉదయ్‌కిరణ్ (20), వి.వంశీ, కె.హేమంత్, పి.ప్రణీత్‌లు ఏలూరులోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. వీరందరూ కలిసి శుక్రవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మీదుగా గుడిసె పర్యాటక ప్రాంతానికి కారులో వెళ్లారు. తిరిగి శనివారం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరారు. ప్రణీత్ కారు నడుపుతున్నాడు. అర్ధరాత్రి సమయంలో తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపాన ఉన్న అయ్యగళ్ల కాలువ వద్దకు వచ్చేసరికే రోడ్డు మలుపులో కారు అదుపుతప్పి 15 అడుగుల లోతు ఉన్న పంట కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్, టి.హేమంత్, ఉదయ్‌కిరణ్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు ముందు డోర్ తెరచుకోవడంతో వంశీ, కె.హేమంత్, ప్రణీత్ గాయాలతో బయటపడ్డారు. వీరిని పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


క్లుప్తంగా...

'అడియాలా'కి బదులు 'అటోక్'కి ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్: తోషఖానా అవినీతి కేసులో మూడేళ్ల జైలు పడిన పాకిస్తాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్‌ను ప్రభుత్వం అటోక్ జైలుకు తరలించింది. కానీ ఇమ్రాన్‌ను రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉంచాలని ఇస్లామాబాద్ ట్రయల్ కోర్టు ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఇమ్రాన్‌కు అడియాలా జైల్లో భద్రత కల్పించాలని పేర్కొంది. అయితే ప్రభుత్వం మాత్రం కోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా అటోక్ జైలుకి తరలించినట్టుగా ఒక నివేదిక వెల్లడించింది. అటోక్ జైలుకి తరలించడం కోసమే లాహోర్ పోలీసులుఇమ్రాన్‌ను అరెస్ట్ చేసినట్టు ఆ నివేదిక పేర్కొంది.

ఇమ్రాన్‌ను కలవడానికి అనుమతించడం లేదు: పీటీఐ ఆందోళన

జైల్లో ఉన్న ఇమ్రాన్‌ను కలవడానికి పార్టీ న్యాయవాదులకి అనుమతించడం లేదని తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ ఆరోపించింది. కోర్టుకు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకోవడానికి అనుమతి కోరినా అధికారులు నిరాకరించినట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయలేదని కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారని విరుచుకుపడింది.



వోయేజర్-2కు మళ్లీ జీవం!

గత నెల 21న నాసా వ్యోమనౌక నుంచి సిగ్నల్స్ కట్

పక్కకు జరిగిన యాంటెనా ● కమాండ్ పంపించిన నాసా సైంటిస్టులు

18 గంటల తర్వాత మళ్లీ భూమిపైకి యథావిధిగా సంకేతాలు

ఇతర గ్రహాలపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పశోధనా సంస్థ 46 ఏళ్ల క్రితం ప్రయోగించిన వోయేజర్-2 వ్యోమనౌక మళ్లీ యథాతథంగా పనిచేయడం ప్రారంభించింది. ఒకరకంగా చెప్పాలంటే కీలకమైన ఈ స్పేస్‌క్రాఫ్ట్ మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ వ్యోమనౌక ప్రస్తుతం భూమికి దాదాపు 12 బిలియన్ల మైళ్ల (దాదాపు 2,000 కోట్ల కిలోమీటర్లు) దూరంలో ఉంది. కమ్యూనికేషన్ వ్యవస్థలో చోటుచేసుకున్న పొరపాటు వల్ల గత నెల 21 తేదీన వోయేజర్-2 నుంచి భూమికి సంకేతాలు ఆగిపోయాయి. కంట్రోలర్లు పొరపాటున తప్పుడు కమాండ్ పంపించడమే కారణమని సమాచారం. ఫలితంగా వోయేజర్-2 యాంటెనా స్వల్పంగా పక్కకు జరిగింది. దాంతో సంకేతాలు నిలిచిపోయాయి. నాసా సైంటిస్టులు వెంటనే రంగంలో దిగారు. సంకేతాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. భారీ రేడియో యాంటెనాలతో కూడిన డీప్ స్పేస్ నెట్‌వర్క్ ద్వారా కమాండ్ పంపించారు. దీనికి వోయేజర్-2 స్పందించి 18 గంటల తర్వాత భూమిపైకి సంకేతాలను పంపించింది. నాసా శాస్త్రవేత్తలు వోయేజర్-2 యాంటెనాను సరిచేసే పనిలో విజయం సాధించారు. ఇందుకోసం కమాండ్‌ను పంపించారు. స్పేస్‌క్రాఫ్ట్‌తో కమ్యూనికేషన్‌ను దాదాపు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు ఇస్రో సైంటిస్టులు ప్రకటించారు. వోయేజర్-2 ఎప్పటిలాగే పనిచేస్తోందని, యథావిధిగా సేవలు అందిస్తోందని హర్షం వ్యక్తం చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ వోయేజర్-2?

అంతరిక్షంలో భూమికి కొన్ని కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న శనిగ్రహం, కుజగ్రహం, బృహస్పతి, గురుగ్రహంపై పరిశోధనల కోసం 'నాసా' 1977 సెప్టెంబర్ 5న వోయేజర్-1, 1977 ఆగస్టు 20న వోయేజర్-2 వ్యోమనౌకలను పంపించింది. కాలిఫోర్నియాలో నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ ల్యాబ్‌లో వీటిని రూపొందించారు. భూమికి సంబంధించిన శబ్దాలు, చిత్రాలు, సందేశాలను ఇందులో చేర్చారు. గత 36 ఏళ్లుగా నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఇతర గ్రహాల సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తున్నాయి. 2012 ఆగస్టులో వోయేజర్-1 ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. అంటే అంతరిక్షంలో లక్షల కోట్ల ఏళ్ల క్రితం కొన్ని నక్షత్రాలు అంతరించిపోవడం వల్ల ఏర్పడిన ఖాళీ ప్రదేశంలోకి చేరుకుంది. ఆ తర్వాత వోయేజర్-2 కూడా ఈ స్పేస్‌లోకి ప్రవేశించింది. వోయేజర్-2 1986లో యురేనస్ గ్రహం సమీపానికి వచ్చింది. దాని ఉపగ్రహాలను గుర్తించింది. గురు, శనిగ్రహాలకి సంబంధించిన యూరోపా, ఎన్సిలాడస్ అనే ఉపగ్రహాలపై మంచు కింద సముద్రాల ఆనవాళ్లు ఉన్నట్లు కనిపెట్టింది.

యూపీ స్కూల్ టీచర్ 'ప్యాడ్ బ్యాంక్'

లక్నో: నిరుపేద యువతులు, మహిళల్లో రుతుస్రావంలో పరిశుభ్రతపై అవగాహన పెంచడానికి ఉత్తరప్రదేశ్‌లో ఒక స్కూలు టీచర్ వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. తన సొంత డబ్బులతో ''ప్యాడ్ బ్యాంక్''ను ఏర్పాటు చేసి గ్రామంలో అమ్మాయిలకు శానిటరీ ప్యాడ్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు. బరేలి జిల్లా బొరియా బ్యాంకులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రాఖీ గంగ్వార్ తమ ఊళ్లో యుక్త వయసుకి వచ్చిన అమ్మాయిలు, మహిళలు రుతుస్రావం సమయంలో ఇంకా పాతకాలం పద్ధతుల్లో బట్టలనే వాడడం పట్ల ఆవేదనతో ఉండేవారు. వారిలో శానిటరీ ప్యాడ్స్‌పై అవగాహన పెంచడానికి స్కూల్లోనే ప్యాడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. తన సొంత డబ్బుతో ప్యాడ్స్ కొని ఆ బ్యాంకులో ఉంచుతున్నారు. అవి వాడడానికి ముందుకొచ్చిన వారికి ఉచితంగా ఇస్తూ ఎలా వాడాలో నేర్పిస్తూ వారిలో అవగాహన పెంచుతున్నారు. మే 15న మదర్స్ డే సందర్భంగా ఈ బ్యాంక్ ప్రారంభించారు. మొదట్లో శానిటరీ ప్యాడ్స్ వాడడానికి ఎవరూ ముందుకు రాలేదు. కానీ ఆ సమయంలో పరిశుభ్రత గురించి వివరంగా చెప్పాక ఒక్కొక్కరు వచ్చి ప్యాడ్స్ తీసుకోవడం మొదలు పెట్టారు. అలా ప్రస్తుతం ప్రతీ నెలా 150 వరకు మహిళలు ప్యాడ్ బ్యాంక్‌కి వస్తున్నారని రాఖీ గంగ్వార్ వివరించారు.

అయోధ్య రామమందిరానికి 400 కేజీల తాళం



అలీగఢ్ (యూపీ): అయోధ్యలో రామమందిరం కోసం అలీగఢ్‌కు చెందిన ఒక కళాకారుడు అరుదైన కానుకను రూపొందించాడు. చేతితో తాళాలు తయారు చేయడంలో సిద్ధహస్తుడైన సత్యప్రకాశ్ శర్మ రాముడి మందిరం కోసం ప్రత్యేకంగా 400 కేజీల తాళం తయారు చేశాడు. శ్రీరాముడికి వీరభక్తుడైన సత్యప్రకాశ్ ప్రపంచంలో చేత్తో తయారు చేసిన అతి పెద్ద తాళమని చెప్పారు. ఈ తాళం 10 అడుగుల ఎత్తు, 4.5 అడుగుల వెడల్పు, 9.5 అంగుళాల మందంతో ఉంది. తాళం చెవి నాలుగడుగుల పొడవుంది. సత్యప్రకాశ్ శర్మ కుటుంబం తరాలుగా ఈ తాళాల తయారీ వృత్తిలోనే ఉంది. ఈ ఏడాది మొదట్లో అలీగఢ్ ఎగ్జిబిషన్‌లో ఈ తాళాన్ని ఉంచారు. తాళం తయారు చేయడంలో తన భార్య రుక్మిణి కూడా సాయం చేశారని చెప్పారు. ఈ తాళం తయారీకి ఆయనకి రూ.2 లక్షల ఖర్చయింది. ఈ ఏడాది చివర్లో ఆయన ఈ తాళాన్ని శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కి సమర్పిస్తారు.

కుటుంబ పాలన.. 'క్విట్ ఇండియా'

- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- విపక్షాలు ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజం
- 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన



న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు ప్రతికూల రాజకీయాలు చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టేందుకు 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో భారత్ యావత్తూ ముందుకొస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిపక్షంలోని ఓ వర్గం తాము పనిచెయ్యం, ఇతరులను పని చెయ్యనివ్వబోమన్న ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇది నిజంగా దురదృష్టకరమైన పరిస్థితి అని వాపోయారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అధునాతన పార్లమెంట్ భవనం నిర్మించామని, ప్రజాస్వామ్యానికి అదొక చిహ్నమని, ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి అది ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. అలాంటి పార్లమెంట్‌ను సైతం విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని, అందులోకి అడుగుపెట్టేందుకు నిరాకరిస్తున్నాయని ఆక్షేపించారు. కర్తవ్యపథ్‌ను అభివృద్ధి చేయడాన్ని కూడా వ్యతిరేకించాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పార్టీలు కేవలం ఎన్నికల సమయంలోనే సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్‌ను స్మరిస్తాయని, తాము గుజరాత్‌లో అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. గత 70 ఏళ్లలో మన అమర జవాన్ల కోసం కనీసం యుద్ధ స్మారకాన్ని కూడా నిర్మించలేదని కాంగ్రెస్ పార్టీపై పరోక్షంగా ధ్వజమెత్తారు. తాము నిర్మిస్తే నిస్సిగ్గుగా బహిరంగంగా విమర్శలు చేశాయని దుయ్యబట్టారు.

దేశ ప్రగతికి రెక్కలు తొడుగుతున్న యువత

ప్రతికూల రాజకీయాలను పూర్తిగా దూరం పెట్టామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. దేశ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఓటు బ్యాంకు రాజకీయాలను, పార్టీ రాజకీయాలను లెక్కచేయకుండా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. దేశంలో 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రస్తుతం రోజ్‌గార్ మేళా కొనసాగుతోందన్నారు. దేశంలో మార్పు మొదలైందని, దేశ అభివృద్ధితో యువతకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. దేశ ప్రగతికి మన యువత కొత్త రెక్కలు తొడుగుతున్నారని ప్రశంసించారు.

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా

ఈ నెల 9న జరిగే 'క్విట్ ఇండియా' వార్షికోత్సవాన్ని మోదీ ప్రస్తావించారు. ఇదొక చరిత్రాత్మక దినం అని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చిన రోజు అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశమంతా క్విట్ ఇండియా అంటూ బిగ్గరగా నినదిస్తోందని వివరించారు. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు వంటివి దేశం వదిలి వెళ్లిపోవాలని ఆకాంక్షిస్తోందని వ్యాఖ్యానించారు. గత ఏడాది లాగే ఈసారి కూడా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సదుపాయాలు పెరగడం, జీవనం సులభతరం కావడంతో దేశంలో పన్నులు చెల్లించేవారి సంఖ్య మరింత పెరిగిందని వివరించారు. ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసినవారి సంఖ్య ఈ ఏడాది 16 శాతం పెరిగిందన్నారు. 'అమృత్‌భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం మోదీ శంకుస్థాపన చేయగా, వీటిలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 55, తెలంగాణలో 21, ఆంధ్రప్రదేశ్‌లో 18 రైల్వేస్టేషన్లు ఉన్నాయి.

పాక్ వధువు.. భారత్ వరుడు వర్చువల్ వివాహం



న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లోని కరాచీ నగరానికి చెందిన వధువు అమీనా, భారత్‌లోని జోద్‌పూర్‌కు చెందిన అర్బాజ్ ఖాన్ మధ్య వర్చువల్‌గా వివాహం జరిగింది. వధువు అమీనాకు భారత వీసా లభించకపోవడంతో బుధవారం ఆన్‌లైన్‌లో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. పాకిస్తాన్‌లో జరిగితే ఆ పెళ్లికి చట్టబద్ధంగా గుర్తింపు లభించదని, అందుకే స్వదేశాన్ని ఎంచుకున్నానని వరుడు అర్బాజ్ ఖాన్ చెప్పాడు. అమీనాకు వీసా దొరికి, భారత్‌కు వచ్చాక మళ్లీ పెళ్లి చేసుకుంటామని తెలిపాడు. అర్బాజ్ ఖాన్ చార్టెర్డ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. జోద్‌పూర్‌లోని ఓస్వాల్ సమాజ్ భవన్ అతడి వివాహానికి వేదికగా మారింది. బంధుమిత్రుల సమక్షంలో, జోద్‌పూర్ ఖాజీ ఆధ్వర్యంలో వర్చువల్‌గా నిఖా చేసుకున్నాడు. ఇది ఇరువైపులా పెద్దలు కుదిర్చిన పెళ్లి కావడం విశేషం.

ఇండిగో విమానంలో ఏసీ బంద్

ఉక్కపోతతో గంటన్నరపాటు ప్రయాణికుల అవస్థలు

న్యూఢిల్లీ: ఇండిగోకు చెందిన చండీగఢ్-జైపూర్ విమానంలో ఏసీ లేకపోవడంతో ప్రయాణికులు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై ఇండిగో సంస్థ ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది. సాంకేతిక సమస్యతోనే ఈ తప్పిదం జరిగిందని వివరించింది. మున్ముందు ఇలాంటివి జరక్కుండా అప్రమత్తంగా ఉంటామని పేర్కొంది. అదే విమానంలో ప్రయాణించిన పంజాబ్ కాంగ్రెస్ చీఫ్, ఎమ్మెల్యే అమరీందర్ సింగ్ వర్రింగ్ తోటి ప్రయాణికులు పడిన అవస్థలపై ఒక వీడియోను ట్వీట్ చేశారు. ఉక్కపోతను భరించలేని ప్రయాణికులు తమకందజేసిన సేఫ్టీ కార్డులతో విసురుకుంటున్నట్లు, చెమట తుడుచుకునేందుకు ఒక ఎయిర్ హోస్టెస్ టిష్యూ పేపర్లను పంపిణీ చేస్తున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. 'విమానం ఎక్కేటప్పుడు ఎండలోనే పావు గంట సేపు నిల్చోబెట్టారు. లోపలికి వెళ్లాక చూస్తే ఏసీ లేదు. జైపూర్ వెళ్లే వరకు దాదాపు గంటన్నరసేపు చెమట్లు తుడుచుకుంటూ నరకయాతన అనుభవించాం'అని అమరీందర్ పేర్కొన్నారు.



ఉత్తరకొరియాలోని తమ ప్రభుత్వ ఆయుధాగారంలో అధునాతన రైఫిల్‌ను పేల్చి పరీక్షిస్తున్న ఉ.కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్. శనివారం ఆయన దేశంలోని ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. తుపాకుల నుంచి అణ్వస్త్రాలను మోసుకెళ్లే క్షిపణుల వరకు పలు ఆయుధాలను పరిశీలించారు.

మూత్రం తాగించి, మలద్వారంలో మిర్చి పెట్టి..

దొంగతనం అనుమానంతో బాలురపై యూపీలో దారుణం



సిద్ధార్థనగర్: బలవంతంగా మూత్రం తాగించారు. మలద్వారంలో మిరపకాయలు రుద్దారు..పెట్రోల్ ఇంజెక్షన్లు చేశారు... రెండు వేల రూపాయలు దొంగతనం చేశారన్న అనుమానంతో ఇద్దరు బాలురపై కొందరు పాల్పడిన అమానుష చర్యలివి. యూపీలోని సిద్ధార్థనగర్ జిల్లా పత్రాబజార్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితులే స్వయంగా ఈ దారుణాన్ని చిత్రీకరించి, వీడియోను సోషల్ మీడియాలో ఉంచటంతో వైరల్ అయ్యింది. దీనిపై జిల్లా ఎస్పీ అభిషేక్ కుమార్ అగర్వాల్ చర్యలకు ఆదేశించారు. పత్రా బజార్‌లోని కొంకటి సమీపంలోని ఓ చికెన్ దుకాణంలో రూ.2 వేలు దొంగిలించారనే అనుమానంపై అఫ్జల్, విజయ్ సాహ్ని అనే బాలురను కొందరు నిర్బంధించారు. వారి చేతుల్ని కట్టేసి, పెట్రోల్ ఇంజెక్షన్లు చేశారు. బలవంతంగా వారితో మూత్రం తాగించారు. మిరపకాయలను వారి మలద్వారంలో రుద్దారు. బాధతో విలవిల్లాడుతూ రోదిస్తున్న వారిద్దరినీ కాపాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అఫ్జల్ తండ్రి మహ్మద్ హుస్సేన్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. వీడియో ఆధారంగా 8 మంది నిందితులను గుర్తించి, వారిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. మిగతా ఇద్దరిని పట్టుకునే పనిలో ఉన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ పరామర్శించారు. బాలుర పట్ల తాలిబన్ల కంటే ఘోరంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

మీరిప్పుడున్నది సముచిత స్థానం కానీ..

అజిత్ పవార్‌పై అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు



కార్యక్రమంలో అమిత్‌షా, అజిత్ పవార్

పుణే: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు నేతలు ఆదివారం పుణేలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒకే వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'చాలా కాలం తర్వాత మీరిప్పుడు సరైన స్థానంలో ఉన్నారు. కానీ, చాలా ఆలస్యమైంది'అని పేర్కొన్నారు. 'అజిత్ పవార్‌తో కలిసి నేను పాల్గొన్న మొట్టమొదటి కార్యక్రమమిది. ఈ సందర్భంగా ఆయనకు ఒక విషయం చెప్పదల్చుకున్నా. చాలా కాలం తర్వాత ఆయన ఇప్పుడు సముచిత స్థానానికి చేరుకున్నారు. ఆయన ఎప్పుడూ ఇదే స్థానంలోనే ఉండటం సబబు. కానీ, ఈ స్థానంలోకి ఆయన చాలా ఆలస్యంగా వచ్చారు' అని అమిత్ షా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు. నెల క్రితం ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన విషయం తెలిసిందే. అజిత్ పవార్‌కు డిప్యూటీ సీఎం పదవితోపాటు ఆయన వర్గానికి మంత్రి పదవులు దక్కిన విషయం తెలిసిందే.

ఆగని మణిపూర్ అల్లర్లు

15 ఇళ్లకు నిప్పు



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన మెయిటీ వర్గం నిరసనకారులు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆదివారం చెలరేగిన హింసాకాండలో పదిహేను ఇళ్లు తగలబడ్డాయి. లంగోల్ గేమ్స్ విలేజ్‌లో అల్లరిమూక దాడులకు తెగబడి ఇళ్లను తగులబెట్టారు. దీంతో భద్రతా సిబ్బంది బాష్పవాయువుని ప్రయోగించి పరిస్థితుల్ని అదుపులోనికి తీసుకువచ్చారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చెకోన్ ప్రాంతంలో దుండగులు వాణిజ్య సముదాయాలను తగులబెట్టారు. మరోవైపు రాజకీయంగా ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్డీయేలో ఇన్నాళ్లూ భాగస్వామ్యపక్షంగా ఉన్న కుకీ పీపుల్స్ అలయెన్స్ బైరెన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది.

లూటీ చేసిన ఆయుధాలు వెనక్కి

మణిపూర్‌లో అల్లరిమూకలు భారీగా లూటీ చేసిన ఆయుధాల్ని తిరిగి స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు లూటీ అయిన ఆయుధాల్లో 1,195 తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మణిపూర్ లోయ ప్రాంతం జిల్లాల నుంచి 1,057 ఆయుధాలు , కొండ ప్రాంతం జిల్లాల నుంచి 138 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఐజీ ర్యాంకు అధికారి ఒకరు ఆయుధాగారాల లూటీకి సంబంధించి విచారణ జరుపుతున్నారు.

జంకుతున్న ఎమ్మెల్యేలు

ఈ నెల 21 నుంచి మణిపూర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడానికి కుకీ వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యే అవకాశం ఉంది. పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి హాజరుకావడానికి విముఖతతో ఉన్నారు. జాతుల మధ్య ఘర్షణలు ఇంకా కొనసాగుతూ ఉండడంతో తమకి భద్రత లేదని వారు భయపడుతున్నారు. శాంతి భద్రతలు అదుపులో లేకపోవడం వల్ల తాము అసెంబ్లీకి హాజరు కావడం లేదని కుకి వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఎల్.ఎమ్ ఖాటే చెప్పారు. ఎమ్మెల్యేల ఇంఫాల్ ప్రయాణం సురక్షితం కాదని అన్నారు.

అయిదుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన హేయమైన ఘటనలో అయిదురుగు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ ప్రాంతం పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ సహా అయిదుగురు సిబ్బందిని దీనికి సంబంధించిన వీడియో బయటకి వచ్చిన వెంటనే సస్పెండ్ చేసినట్టుగా పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వెల్లడించారు. ఒక వర్గం ప్రజలు వారి సస్పెన్షన్‌ని వెనక్కి తీసుకోవాలని ప్రతీరోజూ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నా వెనక్కి తగ్గలేదని చెప్పారు.



ఘటనాస్థలి వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

పాక్‌లో పట్టాలు తప్పిన రైలు

30 మంది మృత్యువాత

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 30 మంది మరణించారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. కరాచీ నుంచి రావల్పిండికి వెళుతున్న హజారా ఎక్స్‌ప్రెస్ నవాబ్‌షా జిల్లాలోని సర్హారి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. కరాచీకి 275 కి.మీ. దూరంలో ఈ ప్రమాదం జరిగింది. దాదాపుగా 10 బోగీలు పట్టాలు తప్పి ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిలో ఎక్కువ మంది పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇంకా బోగీల కింద చాలా మంది ఉండడంతో పాక్ ఆర్మీ సహాయ చర్యలకు దిగింది. విషమంగా ఉన్న వారిని కరాచీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. రైలు ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోందని రైల్వే శాఖ మంత్రి సాద్ రఫీక్ తెలిపారు.

వదంతులు ఆపకుంటే.. సర్వేను బహిష్కరిస్తాం

జ్ఞానవాపి మసీదు కమిటీ హెచ్చరిక

వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ)అధికారుల సర్వే సందర్భంగా హిందూ మతానికి సంబంధించిన కొన్ని చిహ్నాలు కనిపించాయంటూ వస్తున్న వదంతులపై మసీదు కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేయకుంటే మసీదులో జరుగుతున్న సర్వేను బహిష్కరిస్తామని హెచ్చరించింది. ఏఎస్ఐ అధికారులు మసీదులో మూడో రోజైన ఆదివారం సర్వే కొనసాగించారు. 17వ శతాబ్దంలో ఈ మసీదును ఆలయమున్న ప్రాంతంలోనే నిర్మించారా అన్న విషయం తేల్చేందుకు కోర్టు ఆదేశాలతో సర్వే జరుపుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం సర్వేకు దూరంగా ఉన్న మసీదు కమిటీ శనివారం సర్వే సమయంలో మసీదులోనే ఉంది. అధికారుల సర్వేకు తాము పూర్తి సహకారం అందిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు. అయితే, శనివారం పునాది వద్ద జరిగిన సర్వే సందర్భంగా త్రిశూలం, కలశం, విగ్రహాలు వంటివి కనిపించాయంటూ ఒక వర్గం మీడియా వదంతులు ప్రచారం చేసిందని ఆరోపించారు. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయకుంటే మసీదు కమిటీ సర్వేను బహిష్కరిస్తుందని స్పష్టం చేశారు.



టమాటాల వ్యాను బోల్తా.. ఎగబడ్డ జనం

హజారీబాగ్: టమాటాల లోడుతో వస్తున్న వ్యాను బోల్తా పడగా అందులోని టమాటాల కోసం జనం ఎగబడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి కొంత సరుకును మాత్రం తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు. ఈ ఘటన బిహార్‌లో జరిగింది. నేపాల్ నుంచి టమాటాల లోడుతో వస్తున్న వ్యాను ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో బిహార్‌లోని రాంచీ-పట్నా హైవేపై చర్హి వ్యాలీ వద్ద పల్టీ కొట్టింది. డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వ్యాను బోల్తా పడి అందులోని టమాటాలు రోడ్డుపై పడిపోయాయి. ఇంకేముంది..? టమాటాల ధర కిలో వందల్లో ఉన్న వేళ..ఈ ఘటన సమీప గ్రామస్తులకు అనుకోని వరంలా మారింది. వెంటనే అక్కడికి పరుగెత్తుకొచ్చారు. సంచులు, డబ్బాలతో టమాటాలు ఎత్తుకుపోవడం మొదలుపెట్టారు. వ్యాను డ్రైవర్, క్లీనర్ అడ్డుకున్నా వారు లెక్కచేయలేదు. అయితే, ఈ గందరగోళంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని జనాన్ని చెదరగొట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గ్రామస్తులు ఎత్తుకెళ్లిన టమాటాల్లో చాలా వరకు తిరిగి రాబట్టారు.

చంద్రయాన్-3 నుంచి చంద్రుడి వీడియో



బెంగళూరు: చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన వీడియోను చంద్రయాన్-3 మిషన్ ఆదివారం చిత్రీకరించింది. ఈ వీడియోను ఇస్రో సోషల్ మీడియా ద్వారా విడుదల చేసింది. చంద్రయాన్-3 మిషన్ శనివారమే చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. ఈ వీడియోలో చందమామ ఉపరితలం నీలి ఆకుపచ్చ రంగుల్లో కనిపిస్తోంది. అంతేకాకుండా చందమామపై ఉన్న లోతైన బిలాలు కూడా కనిపిస్తున్నాయి. చంద్రుడికి సంబంధించి చంద్రయాన్-3 పంపించిన తొలి వీడియో ఇదే కావడం విశేషం.

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులకు విప్ జారీ

న్యూఢిల్లీ: తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. సోమవారం సభ్యులంతా తప్పనిసరిగా సభకు హాజరుకావాలని సూచించింది. వాయిదాపడేదాకా సభలోనే ఉండాలని పేర్కొంది. కీలకమైన ఢిల్లీ బిల్లుపై సోమవారం రాజ్యసభలో చర్చ, ఓటింగ్ జరిగే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ తన సభ్యులకు విప్ జారీ చేసినట్లు తెలుస్తోంది. 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు-2023'ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

'ఇండియా' చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ!

పట్నా: 26 పార్టీలతో కూడిన విపక్ష 'ఇండియా' కూటమి సమన్వయ కమిటీ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కూటమి తదుపరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న ముంబైలో జరుగనుంది. కూటమికి చెందిన 11 మంది సభ్యుల సమన్వయ కమిటీ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీని, కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఈ సమావేశాల్లో ఎన్నుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం | 7 | ఆగస్టు | 2023

భారతీయార్ మండపంగా.. దర్బార్ హాల్

సాక్షి, చెన్నై: చెన్నై గిండిలోని రాజ్‌భవన్ దర్బార్ హాల్ పేరును తాజాగా మార్చారు. దీనికి తమిళ కవి భారతీయార్ మండపంగా నామకరణం చేశారు. ఆదివారం రాత్రి 7.30 గంటలకు రాజ్ భవన్‌లో ఈ పేరు మార్పు కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఆర్‌ఎన్ రవి, సీఎం ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, ఎంపీ, సంగీత దర్శకుడు ఇళయరాజాతో పాటు వివిధ పార్టీల నాయకులు, మంత్రులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహాకవి సుబ్రమణ్య భారతీయర్ చిత్ర పటం, ఆయన పేరుతో రూపొందించిన శిలాఫలకాన్ని రాష్ట్రపతి ఆవిష్కరించారు. అనంతరం గవర్నర్ అందరికీ విందు ఇచ్చారు.

న్యూస్‌రీల్

తాంబరం డీసీపీగా పవన్‌కుమార్ రెడ్డి



సాక్షి, చెన్నై: తాంబరం పోలీసు కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అల్లాటిపల్లి పవన్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి పి.అముద ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా కనిగిరికి చెందిన అల్లాటిపల్లి పవన్‌కుమార్ రెడ్డి 2016 తమిళనాడు ఐపీఎస్ బ్యాచ్ అధికారి. తొలుత తిరువళ్లూరు జిల్లా పొన్నేరి ఏఎస్పీగా పనిచేశారు. అనంతరం తిరుచ్చి నగర డీసీపీగా, తిరువణ్ణామలై జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. ఉత్తర చెన్నై పరిధిలోని వాషర్‌మెన్ పేట డీసీపీగా పనిచేసిన పవన్‌కుమార్‌రెడ్డిని కొత్తగా ఇటీవల రూపుదిద్దుకున్న తాంబరం కమిషనరేట్ లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ హోంశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ బాధ్యతలను మరికొద్ది రోజులలో ఆయన స్వీకరించనున్నారు. అలాగే మరో 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీపై రాష్ట్రంలోని పలు నగరాలు, జిల్లాలకు నియమిస్తూ హోంశాఖ కార్యదర్శి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

2 గంటల్లో 10 వేల మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

పళ్లిపట్టు: మొబైల్ యాప్ ద్వారా సంపూర్ణ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. రెండు గంటల్లో 10 వేల మందికి పరీక్షలు చేపట్టి గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారు. వివరాలు.. లైఫ్‌లైన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పొదటూరుపేటలో మొబైల్ యాప్ ద్వారా ఆరోగ్య వైద్య పరీక్షల శిబిరం చేపట్టారు. తిరుత్తణి, పళ్లిపట్టు, పొదటూరుపేట పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొన్న శిబిరంలో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని యాప్ ద్వారా ఆరోగ్య పరీక్షలు శిబిరాన్ని ప్రారంభించారు. ఆప్ ద్వారా మూడు నిమిషాల్లో బీపీ, షుగర్, హృదయం సహా ప్రధాన అవయవాల స్థితిగతులకు సంబంధించిన రిపోర్టులను ఉచితంగా తెలియజేశారు. ఈ శిబిరంలో సెంగుంద మహాసభ అధ్యక్షుడు సెల్వరాజు, డాక్టర్ రాజేంద్రన్,నరసింహన్,అన్బువేలాయుదం, సుబ్రహ్మణ్యం, శివశక్తికుప్పన్ సహా వలంటీర్లు భారీగా పాల్గొన్నారు.

ఉత్తర చెన్నైకి మహర్దశ

- రూ.1000 కోట్లతో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు

కొరుక్కుపేట: పేదప్రజలు అధికంగా ఉండే ఉత్తర చెన్నై ప్రాంతానికి మహర్దశ పట్టింది. ఇక్కడ కొత్త ప్రాజెక్టుల అభివృద్ధికి మూడేళ్లలో రూ.1000 కోట్లు వెచ్చిస్తామని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబు ప్రకటించారు. ఇందులో భాగంగా ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్ట్ సామాజిక–ఆర్థిక–మానసిక ప్రయోజనాల కోసం సర్వే చేసే పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చెన్నై కార్పొరేషన్, చెన్నై మున్సిపల్ కార్పొరేషన్, తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డ్, అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ విభాగాలు కలిసి ఈ సర్వే చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సర్వే కోసం ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీకి చెందిన 300 మంది విద్యార్థులు, మద్రాసు క్రిస్టియన్ కళాశాల నుంచి 500 మందితో కలిపి 1000 మంది విద్యార్థులు జనాభా గణనలో పాల్గొంటారని తెలిపారు. చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అపూర్వ, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, తమిళనాడు అర్బన్ హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.శంకర్, తిరువిక్ నగర్ ఎమ్మెల్యే పి.తాయకం కవి పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించి బాలుడి మృతి

- చేయి తొలగింపులో వైద్యుల నిర్లక్ష్యం

సాక్షి, చెన్నై: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఒక చెయ్యి సగం భాగం తొలగించబడ్డ బాలుడు చికిత్స ఫలించక ఆదివారం మరణించాడు. రామనాథపురానికి చెందిన దస్తగిర్, ఫాతిమా దంపతుల ఏడాదిన్నర కుమారుడు మహ్మద్ జహీర్ ఇటీవల అనారోగ్యం బారిన పడ్డాడు. పలు చోట్ల వైద్య చికిత్స అందించారు. చివరకు రాజీవ్ గాంధీ జీహెచ్‌లో చేర్పించగా ఆ బాలుడికి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ చెయ్యి సగభాగం తొలగించినట్లు తెలిసిందే. గత నెల ఈ వ్యవహారం దుమారం రేపింది. దీనిపై విచారణ కూడా జరిగింది. ఈ క్రమంలో ఎగ్మూర్ చిన్న పిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలుడు ఆదివారం మరణించాడు. దీంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం, బాలుడి మృతికి న్యాయం చేకూర్చాలని మైనారిటీ సంఘాలు డిమాండ్ చేశాయి.

మహదానందం!



స్నాతకోత్సవ వేదికపై రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ ఆర్‌ఎన్ రవి తదితరులు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

తనకు మార్గదర్శకులైన పలువురు రాష్ట్రపతులు, మరెందరో మేధావులను ఈ దేశానికి అందించిన చెన్నై వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు కావడం మహాదానందంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. పరిశోధనల్లో విస్తృత పెట్టుబడులు పెట్టాలని, ఆత్మ విశ్వాసంతో ప్రతి విద్యార్థి ముందుకెళ్లాలని పిలుపు నిచ్చారు.

- ఎందరికో జీవితాన్నిచ్చిన విద్యాలయం మద్రాసు వర్సిటీ
- పరిశోధనల్లో విస్తృత పెట్టుబడులు అవశ్యం
- ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లండి
- మీతోనే దేశానికి ఉజ్వల భవిత
- విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉపదేశం
- వేడుకగా స్నాతకోత్సవం

సాక్షి, చెన్నై: మద్రాసు (చెన్నై) వర్సిటీ స్నాతకోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరిగింది. కామరాజర్ సాలైలోని ఆ వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన వేడుకలో విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిగ్రీలను ప్రదానం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, సీఎం ఎంకే స్టాలిన్, ఉన్నత విద్యా మంత్రి పొన్ముడి ఈ వేడుకకు హాజరయ్యారు. ఇందులో రాష్ట్రపతి ముర్ము ప్రసంగిస్తూ, ఈ మద్రాసు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి రావడం తనకు మాటల్లో వర్ణించలేనంత ఆనందంగా ఉందన్నారు. ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులందరినీ, పతక విజేతలను తాను వ్యక్తిగతంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో తల్లిదండ్రులు, సంరక్షకులు, అధ్యాపక సిబ్బందిని కూడా తాను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంస్కృతికి నిలయం..

ఈ ప్రాంతం నాగరికత, సంస్కృతికి నిలయమని రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యానించారు. అలాగే దేశంలో విలువైన సాహితీ వారసత్వమైన తిరుక్కురళ్‌ను భద్ర పరిచిన ప్రదేశం కూడా ఇదే అని అన్నారు. కవిత్వం నుంచి గొప్ప భక్తి సంప్రదాయం తమిళనాడులో ఆనాడే మొదలైందని , దీనిని ఇక్కడి సంచార సాధువులు ఉత్తరాదికి తీసుకెళ్లి ప్రచారం చేశారని గుర్తుచేశారు. తమిళనాడులోని ఆలయాల నిర్మాణం , విగ్రహాలు, శిల్పాలు మానవ శ్రేష్ఠతకు ప్రతిబింబాలుగా పేర్కొన్నారు. అపారమైన సాంస్కృతి, వారసత్వంతో, ఇక్కడి విద్యార్థులు 21వ శతాబ్దపు ప్రపంచ విజ్ఞాన సమాజానికి కీలక పౌరులుగా ఎదుగాలని ఆకాంక్షించారు.

సమాజానికి తోడ్పాటు..

మద్రాస్ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎదగడమే కాకుండా, సమాజానికి తోడ్పాటు అందించే విధంగా ముందుకెళ్లడం అభినందనీయమని కొనియాడారు. మరెన్నో విజయాలకు దోహదపడాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు యువ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని పిలుపు నిచ్చారు. మద్రాస్ విశ్వవిద్యాలయం పరిశోధన, విద్యాపరమైన కార్యక్రమాలు, సంస్కృతిని ప్రోత్సహించడంలో ముందంజలో ఉందని పేర్కొంటూ, అత్యాధునిక పరిశోధనలో మరింత పెట్టుబడి పెట్టాలని, ఇంటర్–డిసిప్లినరీ అధ్యయనాలను ప్రోత్సహించాలని, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ వంటి అభివృ ద్ధి చెందుతున్న సాంకేతికతలను అందింపుచ్చుకోవాలని సూచించారు. నేటి పోటీ వాతావరణంలో చదువులో రాణించాలనే ఒత్తిడి ప్రతి విద్యార్థిపై ఉంటుందని గుర్తుచేస్తూ, మానసిక ఒత్తిడికి ఏమాత్రం లోనుకావద్దని సూచించారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు . అధ్యాపకులు విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిగణించాలని, వారికి సహకారం అందించే విధంగా ముందుకెళ్లాలని తెలిపారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో ఎదుర్కొనేందుకు యువత సిద్ధంగా ఉండాలన్నారు. జీవిత లక్ష్యాలను అధిరోహిస్తూ, కలలను సాకారం చేసుకోవడమే కాకుండా దేశ భవిష్యత్తుకు తోడ్పాడు అందించే విధంగా ముందుకు సాగాలని ఆమె పిలుపు నిచ్చారు. గవర్నర్ ఆర్‌ఎన్‌రవి తన ప్రసంగంలో దేశాభ్యున్నతికి యుత పాత్ర కీలకం అని, ఒకప్పుడు భారత్‌ను పట్టించుకోని దేశాలు, ప్రస్తుతం భారత్‌లోని తమ సమస్యలకు పరిష్కార మార్గాలు ఉన్నాయని గ్రహించి ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి శరవేగంగా సాగుతోందని, ప్రపంచ దేశాలకు భారత్ పరిష్కార మార్గాలను చూపించే స్థాయికి చేరుకుందని అభిప్రాయపడ్డారు. సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ ద్రవిడ మోడల్ పాలనను గుర్తుచేస్తూ, తమ విద్యా పథకాలను వివరించారు. నిరంతర విద్యార్థులు నేటి యువత మారాలని, ఉద్యోగాల్లో చేరినా విద్యను మాత్రం కొనసాగించాలని పిలుపు నిచ్చారు. కాగా, ఈ ఆడిటోరియంలో అనేక మంది విద్యార్థులను అనుమతించక పోవడం వివాదానికి దారి తీసింది. ఇందులో విద్యార్థి సంఘాల నాయకులు కూడా కొందరున్నారు. దీంతో వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే స్నాతకోత్సవం సందర్భంగా పలుచోట్ల గందరగోళ వాతావరణం చోటు చేసుకుంది.







డిగ్రీలను ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చిత్రంలో గవర్నర్ రవి, సీఎం స్టాలిన్

ఎందరో మహానుభావులు..

ఈ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ప్రస్తుతం సుమారు 1,85,000 మంది విద్యార్థులు చదువుతున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇందులో 50 శాతానికి పైగా యువతులు ఉండడం, ఈ రోజున బంగారు పతకాలు అందుకున్న 105 మంది విద్యార్థుల్లో 70 శాతం మంది విద్యార్థినులే కావడం గమనించ దగ్గ విషయంగా పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే, మద్రాస్ విశ్వవిద్యాలయం లింగ సమానత్వానికి ఓ ప్రకాశవంతమైన ఉదాహరణగా వ్యాఖ్యలు చేశారు. మహిళా విద్యకు పెట్టుబడి పెట్టడం అన్నది దేశ ప్రగతికి పెడుతున్న పెట్టుబడి అని తెలిపారు. విద్యావంతులైన మహిళలు ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ కృషి చేయగలరని, వివిధ రంగాల్లో నాయకత్వాన్ని అందించగలరని, సమాజంపై సానుకూల ప్రభావం చూపగలరని వివరించారు. 1857 సంవత్సరంలో నెలకొల్పిన ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలోనే పురాతన విశ్వవిద్యాలయాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. విజ్ఞాన వ్యాప్తిలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ, 165 సంవత్సరాలకు ప్రస్థానం గురించి వివరించారు. ఎందరో మేధావులు, పండితులు, నాయకులను ఈ విశ్వవిద్యాలయం దేశానికి అందించినట్టు గుర్తుచేశారు. ఇక్కడే చదువుకున్న మాజీ రాష్ట్రపతులు డా. ఎస్. రాధాకృష్ణన్, వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, ఆర్. వెంకటరామన్, కె.ఆర్. నారాయణన్, డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుడు చక్రవర్తి రాజగోపాలాచారిని ఈ దేశానికి అందించిన ఘనత మద్రాసు వర్సిటీకే దక్కిందన్నారు. అలాగే, నోబెల్ అవార్డు గ్రహీతలను సర్ సీవీ రామన్, డాక్టర్ చంద్రోఖర్ వంటి ఎందరో మహాను భావులను అందించిన ఇదే వేదికలో ప్రసంగించే అవకాశం తనకు కూడా రావడం మహాదానందంగా ఉందన్నారు. సరోజినీ నాయుడు దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా ఇదే వర్సిటీ విద్యార్థులు కావడమే కాదు, ఈ ఇద్దరు దిగ్గజాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా పేర్కొన్నారు.

18 రైల్వే స్టేషన్లకు సొబగులు

- రూ. 381 కోట్లతో ఆధునీకరణ పనులు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



సేలం స్టేషన్ నమూనా

సాక్షి, చెన్నై: దక్షిణ రైల్వే పరిధిలోని 18 రైల్వే స్టేషన్లను ఆధునీకరించనున్నారు. అత్యాధునిక హంగులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఒక్కో స్టేషన్‌లో పదుల సంఖ్యలో పనులు చేపట్టబోతున్నారు. ఇందుకోసం రూ. 381 కోట్లు కేటాయించారు. ఈ పనులకు ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. వివరాలు.. రాజధాని నగరం చెన్నైలో ఎంజీఆర్ సెంట్రల్ తదుపరి అతిపెద్ద , పురాతన స్టేషన్‌గా ఎగ్మూర్ పేరుగడించిన విషయం తెలిసిందే. ఈ స్టేషన్‌తో పాటు రాష్ట్రంలోని కాట్పాడి, మదురై, రామేశ్వరం, కన్యాకుమారి రైల్వే స్టేషన్లను పునరుద్ధరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు దక్షిణ రైల్వే గత ఏడాది చర్యలు చేపట్టారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదే సమయంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం మేరకు దక్షిణరైల్వే పరిధిలో మరో 18 స్టేషన్లను ఆధునీకరించేందుకు ఈ ఏడాది నిర్ణయం తీసుకున్నారు. రూ. 381 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా తమిళనాడులో చేపట్టనున్న పనులకు సైతం ప్రధాని శంకు స్థాపన చేశారు.

నిధుల కేటాయింపు ఇలా..

చెంగల్పట్టు రైల్వే స్టేషన్ రూ. 18 కోట్లు, పెరంబూరు రూ. 15 కోట్లు, గూడువాంజేరి రూ. 21 కోట్లు, తిరువళ్లూరు రూ. 16 కోట్లు, తిరుత్తణి రూ. 11 కోట్లు, గుమ్మిడి పూండి రూ. 17 కోట్లు, అరక్కోణం రూ. 22 కోట్లు, జోలార్ పేట రూ. 16 కోట్లు, సేలం రూ. 45 కోట్లు, కరూర్ రూ. 34 కోట్లు,తిరుప్పూర్ రూ. 22 కోట్లు, తెన్‌కాశి రూ. 17 కోట్లు, విరుదునగర్ రూ. 25 కోట్లు, తంజావూరు రూ. 23 కోట్లు, విల్లుపురం స్టేషన్‌ను రూ. 24 కోట్లతో ఆధునీకరించనున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ప్లాట్ ఫాంల విస్తరణ, ఎత్తు పెంపు, అదనపు ప్రవేశ మార్గం ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్టŸ, పార్కింగ్ ప్రదేశాలు, ప్రయాణికులకు డిజిటల్ సమాచార వ్యవస్థ, నిఘా నేత్రాల ఏర్పాటు, మరుగు దొడ్లు తదితర పదుల సంఖ్యలో పనులు ఒక్కో స్టేషన్‌లో చేపట్టనున్నారు. ఆయా రైల్వే స్టేషన్లలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాల్లో దక్షిణ రైల్వే అధికారులు, డివిజన్ల మేనేజర్లు పాల్గొన్నారు.

శభాష్ రోజా

- తెలుగు విద్యార్థినికి బంగారు పతకం



రాష్ట్రపతి నుంచి బంగారు పతకం అందుకుంటున్న రోజా

సాక్షి, చెన్నై: మద్రాసు వర్సిటీ నుంచి ఎంఏ తెలుగులో ప్రతిభను చాటిన తెలుగు విద్యార్థిని గంధం రోజా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. వివరాలు.. ప్రకాశం జిల్లా పామూరు మండలంలో గుమ్మలంపాడు అనే మారుమూల గ్రామానికి చెందిన రోజా పదో తరగతి వరకు స్థానికంగా చదివారు. ఆ తర్వాత కుటుంబ సమస్యల కారణంగా ఆమె కళాశాల జీవితం ఒడిదొడుగులతో సాగింది. కొన్ని సబ్జెక్టుల్లో తప్పడంతో రెండేళ్లు చదువులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత మద్రాసు క్రైస్తవ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు యజ్ఞశేఖర్ సాయంతో చదువు కొనసాగించారు. చెన్నైలో రాణిమేరీ కళాశాలలో బి.ఎ తెలుగులో చేరి గతంలో సీఎం స్టాలిన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ప్రస్తుతం మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఎ. తెలుగులో బంగారు పతకం సాధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రోజ పేర్కొంటూ తన తల్లి జన్మనిస్తే చదువు పరంగా పునర్జన్మ ఆచార్యులు డాక్టర్ యజ్ఞశేఖర్ ప్రసాదించారని పేర్కొన్నారు. తన చదువు విషయంలో మద్రాసు విశ్వ విద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు విస్తాలి శంకరరావు, రాణి మేరి కళాశాల డాక్టర్ నళిని కృషికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. తన గ్రామంలో ఎం.ఏ వరకు చదివిన మొదటి యువతిని తానేనని, పి.హెచ్.డి. చేయాలన్నది తన ఆశయంగా తెలిపారు. మారుతున్న సమాజంలో మగవారితో పోటీపడి అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ తన గ్రామంతో పాటు పలు మారుమూల గ్రామంలో ఆడపిల్లని చదువేందుకు ప్రోత్సహించకుండా చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారని, ఈ ధోరణి మారాలని ఆమె ఆకాంక్షించారు.

73 వేల మందితో.. మెగా మారథాన్



సీఎం స్టాలిన్‌కు గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు



మారథాన్‌లో పాల్గొన్న ప్రజలు, క్రీడాకారులు

- కరుణానిధి శత జయంతి సందర్భంగా నిర్వహణ
- గిన్నిస్ బుక్‌లో చోటు

సాక్షి, చెన్నై: దివంగత మాజీ సీఎం, డీఎంకే అధినేత కరుణానిధి శత జయంతి స్మారకంగా ఆదివారం చెన్నైలో మెగా మారథాన్ నిర్వహించారు. 73 వేల మంది ఇందులో పాల్గొని గిన్నిస్ రికార్డుల్లో భాగమయ్యారు. విదేశాలకు చెందిన రన్నర్లు సైతం ఈ మారథాన్‌లో భాగస్వాములయ్యారు. విజేతలకు సీఎం ఎంకే స్టాలిన్ బహుమతులను ప్రదానం చేశారు. వివరాలు.. కలైంజ్ఞర్ కరుణానిధి శత జయంతి స్మారక ఉత్సవాలు ప్రభుత్వం, డీఎంకే నేతృత్వంలో వేర్వేరుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మెగా రన్ మారథాన్ నిర్వహణకు డీఎంకే నేతృత్వంలో చర్యలు తీసుకున్నారు. నాలుగు కేటగిరీలలో ఈ రన్ ఆదివారం వేకువ జామున జరిగింది. కామరాజర్ సాలైలోని కరుణానిధి సమాధి వద్ద నుంచి 21కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 42 కిలోమీటర్ల దూరం మారథాన్ పరుగు పందెం నిర్వహించారు. ఈ పోటీలను మంత్రులు ఉదయనిధి స్టాలిన్, కేఎన్ నెహ్రూ ఉదయం ఐదు గంటలకు ప్రారంభించారు. వేలాది మంది ఈ మారథాన్‌లో పరుగులు తీశారు. ప్రత్యేకంగా హిజ్రాల కోసం ప్రత్యేక కేటగిరీ రన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 1,063 మంది హిజ్రాలు పాల్గొన్నారు.

విజేతలకు సీఎం బహుమతుల ప్రదానం

మూడున్నర గంటల పాటు జరిగిన ఈ మారథాన్‌లో విజేతలకు ఐలాండ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకలో సీఎం స్టాలిన్ బహుమతులను, కానుకలను అందజేశారు. అలాగే 73 వేల మందితో జరిగిన ఈ మారథాన్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను నిర్వాహకులు సీఎంకు అందజేశారు. ఈ మారథాన్‌లో పాల్గొన్న హిజ్రాలకు తలా రూ. 1000 నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ రన్‌కు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 3.42 కోట్లు వచ్చాయి. ఈ మొత్తాన్ని రాయపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో క్యాన్సర్ చికిత్స కేంద్రం భవన నిర్మాణానికి కేటాయించారు.

మారథాన్ వీరుడు.. సుబ్రమణియన్

బహుమతుల ప్రదానోత్సవంలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, ఈ మారథాన్ విజయవంతం కావడంలో ఆరోగ్య మంత్రి, మారథాన్ వీరుడు ఎం. సుబ్రమణియన్ కృషి ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. వేల మందిని ఓ చోట చేర్చి ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం సాహసంతో కూడుకున్న పని అని, ఇక ఆయన మారథాన్ సుబ్రమణియన్‌గా కీర్తిగడించారన్నారు. ఈ మారథాన్‌లో ప్రభుత్వ ఉన్నతాధికారులుగా ఉన్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు 500 మంది, 1500 మందికిపైగా కానిస్టేబుళ్లు పరుగులు తీయడం ఉద్యోగుల ఐక్యతను చాటుతోందన్నారు. వివిధ విదేశీ రాయబారులు క్రీడాకారులు తరలిరావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ మారథాన్ రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన రూ. 3.42 కోట్లు ఆసుపత్రి భవన నిర్మాణానికి కేటాయించడాన్ని ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, ఉదయ నిధి స్టాలిన్, శేఖర్‌బాబు, మనో తంగరాజ్, ఎం. సుబ్రమణియన్, ఎంపీలు దయానిధి మారన్, కళానిధి వీరాస్వామి పాల్గొన్నారు.

అన్నామలైకు ఢిల్లీ పిలుపు

– యాత్రకు బ్రేక్..?



అన్నామలై యాత్ర

సాక్షి, చెన్నై:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు ఢిల్లీకి రావాలని ఆహ్వానం వచ్చినట్లు సమాచారం. దీంతో సోమవారం ఆయన యాత్రకు బ్రేక్ ఇచ్చి ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. వివరాలు.. నా మట్టి...నా ప్రజలు నినాదంతో బీజేపీ అధ్యక్షుడు అన్నామలై రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. ఈయాత్రకు ఆశించిన మేరకు స్పందన లేనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ముఖ్య నియోజకవర్గాలలో మాత్రమే ఆయన పర్యటించనున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఆయన తన పర్యటనలో మిత్రపక్షం అన్నాడీఎంకేను సైతం టార్గెట్ చేసి విమర్శలు చేస్తుండడం చర్చకు దారి తీసింది. దీనిపై అన్నాడీఎంకే నాయకులు బీజేపీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఢిల్లీకి రావాలని అన్నామలైకు పిలుపు వచ్చినట్టు తెలిసింది. దీంతో ఒక రోజు యాత్రకు విరామం ఇచ్చి ఢిల్లీ వెళ్లి రాబోతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా, మదురైలో ప్రస్తుతం అన్నామలై యాత్ర జరుగుతోంది. ఇందులో సినీ నటుడు, దళపతి విజయ్ మక్కల్ ఇయక్కం జెండాలతో అభిమానులు పాల్గొనడం చర్చకు దారి తీసింది. దీనిపై విజయ్ తరపున ప్రతినిధి ఆనంద్ ఓ ప్రకటన చేశారు. విజయ్ అభిమాన సంఘం, మక్కల్ ఇయక్కంతో సంబంధం లేని వ్యక్తులు ఆ యాత్రలో పాల్గొన్నట్లు స్పష్టం చేశారు.

క్లుప్తంగా

నవ వధువు ఆత్మహత్య

తిరువొత్తియూరు: కళ్లకురుచి జిల్లా ఉలుందూర్ పేట సమీపంలో నవవధువు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. చిరుపాక్కం గ్రామానికి చెందిన కలయమూర్తి కుమార్తె కనకవల్లి (20). ఈమెకు పచ్చముత్తూ కుమారుడు సుగుణేష్(22)తో మూడు నెలల క్రితం వివాహమైంది. ఈక్రమంలో గత 3 రోజుల క్రితం చిరుపాక్కంలో ఉన్న తన ఇంటికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో పని విషయంగా కనకవల్లి తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కనకవల్లి ఫ్యానుకు ఉరేసుకున్న ఆత్మహత్య చేసుకుంది. ఇది చూసిన తల్లిదండ్రులు, బంధువులు విలపించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కనకవల్లి మృతదేహాన్ని కళ్లకురిచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి వరకట్నం వేధింపుల కారణంగా ఆత్మ చేరుకున్నారా..? లేదా..? మరేదైనా కారణం ఉందా..? అనే కోణంతో విచారణ చేస్తూ ఉన్నారు. తిరుకోవిలూరు ఆర్డీఓ విచారణను పర్యవేక్షిస్తున్నారు.

లారీ చక్రం కింద చిక్కుకుని యువకుడి మృతి



దగ్ధమవుతున్న లారీ

తిరువొత్తియూరు: కోవై జిల్లా చిన్నత్తు కడవు సమీపంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న సమయంలో లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక అమ్మన్ వీధికి చెందిన కాళిదాస్ కుమారుడు శరవణన్ టైల్స్ అతికించే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం శరవణన్ మోటార్ సైకిల్‌లో సింగయన్ పుదూర్, వడ పూదూర్ మధ్య ప్రైవేటు టీ కంపెనీ వద్ద వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొంది. శరవణన్ లారీ చక్రం కింద చిక్కున్నాడు. అదే సమయంలో మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకు పేలడంతో మంటలు వ్యాపించి లారీ కూడా దగ్ధమైంది. తీవ్ర గాయాలైన శరవణన్ అదే చోట మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. కినత్తుకడవు పోలీస్ ఇన్‌స్పెక్టర్ ముత్తుపాండి, సబ్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో పోలీసులు శరవణ కుమార్ మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలకు సర్వం సిద్ధం



పుష్పాలంకరణలో ఉత్సవమూర్తి



రుద్రాక్ష మండపంలో కావళ్లు చెల్లిస్తున్న భక్తులు

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రసిద్ధి చెందిన ఆడికృతిక్త, తెప్పోత్సవ వేడుకలు సోమవారం ఆడి అశ్వినితో ప్రారంభించి ఐదు రోజుల పాటు కోలాహలంగా నిర్వహించనున్నారు. ఈ కాగా ఈ ఉత్సవాలకు అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసింది. సుబ్రహ్మణ్యస్వామి కొలువుదీరిన ఐదవ పుణ్యక్షేత్రంగా వల్లి దేవసేనతో శాంతి స్వరూపుడిగా భక్తులకు కటాక్షిస్తున్న తిరుత్తణి కొండలో ఆడికృత్తిక సందర్భంగా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి కావళ్లు సమర్పించి స్వామికి మొక్కులు చెల్లించడం పరిపాటి. ఉత్సవ వేడుకలకు సంబంధించి దేవదాయ శాఖ అధికారులతో పాటు తిరువళ్లూరు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా భక్తుల సౌకర్యార్థ్యం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసింది. కాగా ఆదివారం సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లతో కొండ ఆలయానికి చేరుకుని మాడ వీధుల్లో క్యూలైన్‌లో దాదాపు రెండు గంటల పాటు వేచివుండి స్వామికి కావళ్లు చెల్లించి మూలవర్లను దర్శించుకున్నారు.

భక్తుల కోసం 480 ప్రత్యేక బస్సులు

తిరుత్తణి ఆడికృత్తిక వేడుకలు సందర్భంగా తిరుత్తణికి తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా 480 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఉత్సవాల్లో నేరాలు నియంత్రించేందుకు వీలుగా సీఐ ఆధ్వర్యంలో 40 మంది స్పెషల్ టీం పోలీసులు గస్తీ నిర్వహిస్తారని వెల్లడించారు. ఇక కొండ ఆలయంతో పాటు పట్టణ ప్రధాన ప్రాంతాల్లో 89 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచినట్లు తెలిపారు. అలాగే 120 అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలయ కొలను ప్రాంతాల్లో భక్తులకు రక్షణగా విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, బస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 40 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరువొత్తియూరు: కోవై జిల్లా పొల్లాచ్చి సమీపంలోని పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టంపై పోలీసులు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేశన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మహాలింగపురం మొదటి గ్రేడ్ మహిళా పోలీస్ భువనేశ్వరి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఆ సమయంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా పరిచయమయ్యే ఆ వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గుర్తించాలని సూచించారు. ఇక పాఠశాలకు వచ్చే సమయంలో ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తున్నట్లయితే 1098 అనే నంబర్‌కు, 100కు కాల్ చేయాలన్నారు.

పక్కింటిలో చొరబడి కార్మికుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై ముగప్పేర్ రౌండ్ బిల్డింగ్ వెస్ట్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతానికి చెందిన శరవణన్ (47) నానగర్ 8వ జోన్ చెన్నై కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. రోజూ మద్యం తాగడం వల్ల కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో శరవణన్‌తో విభేదాల కారణంగా 7 ఏళ్ల క్రితం భార్య విడాకులిచ్చింది. ఇప్పటి నుంచి అతడు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ స్థితిలో శనివారం సాయంత్రం శరవణన్ తాగిన మత్తులో వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చి పక్క ఇంటి తలుపు తట్టగా 19 ఏళ్ల యువతి లోపలి నుంచి తలుపులు తెరిచింది. ఆ సమయంలో శరవణన్, ఒక ముఠా కత్తులతో నన్ను వెంటాడుతున్నారు కాపాడమని చెప్పాడు. దీంతో భయాందోళనకు గురైన యువతి.. ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి చూసేసరికి అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగి ఇంటికి తిరిగి వచ్చింది. ఆ సమయంలో శరవణన్ ఇంటి లోపలికి వెళ్లి కరెంట్ తీగతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సదరు యువతి కిటికీలోంచి గుర్తించి కేకలు పెట్టింది. ఇంతలోనే శరవణన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జేజే నగర్ పోలీసులు ఇంటి తలుపులు పగులగొట్టి శరవణన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిరోసిన్ తాగిన విద్యార్థిని మృతి

అన్నానగర్: సేలం సమీపంలో తల్లిదండ్రుల మధ్య గొడవలు జరగడంతో మనస్తాపం చెంది కిరోసిన్ తాగిన ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు.. సేలం జిల్లా వీరగనూర్ సమీపంలోని కవరపనై ప్రాంతానికి చెందిన జైశంకర్ లారీ డ్రైవర్. ఇతని భార్య మోహన. వీరి పెద్ద కుమార్తె ఇలక్యా(18). తిరుచ్చిలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీఎస్సీ (అగ్రి) మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో జైశంకర్ మద్యం తాగి ఇంటికి రావడంతో తరచూ భార్యాభర్తకు గొడవలు జరిగేవి. దీంతో ఇలక్యా మనస్తాపంతో శనివారం రాత్రి కిరోసిన్ తాగి కొద్దిసేపటికి స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఇలక్యాని రక్షించి పెరంబలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇలక్యా ఆదివారం ఉదయం మృతి చెందింది. వీరగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్‌పై అరెస్టు వారెంట్ జారీ

అన్నానగర్: తిరుప్పత్తూర్‌లో కేసులో హాజరు కాని ఇన్‌స్పెక్టర్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. వివరాలు.. శివగంగై జిల్లా తిరుపత్తూరు సమీపంలోని గ్రామానికి చెందిన రాజేష్ (33) ఓ 16 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేయడంతో సోమనాథపురం పోలీసులు అతని పై కేసు నమోదు చేశారు. శివగంగైలోని పోక్సో ప్రత్యేక కోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసు విచారణ ప్రారంభమైన 2019 నుంచి అప్పటి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బాల మురుగన్ హాజరుకాలేదు. దీంతో పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శరత్ రాజ్ ఇన్‌స్పెక్టర్ బాలమురుగన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేశారు.

• అవగాహన



ఇండియన్ సొసైటీ ఆఫ్ పీరియాడొంటాలజీ, సవీత దంత వైద్య కళాశాల నేతృత్వంలో ఓరల్ హైజీన్ డే 2023 కార్యక్రమం ఆదివారం స్థానికంగా జరిగింది. గ్రీన్ ఇన్నోవేటివ్ ఐడియాస్ పేరిట ప్లాస్టిక్ టూత్ బ్రష్‌ల కన్నా వెదురు టూత్ బ్రష్‌లు దంతాల శుభ్రతకు ఉపయోగకరం అని వివరిస్తూ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే హరితహారం – రేపటి కోసం కృషి నినాదంతో ఈనెల 15వ తేదీ వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

\- సాక్షి, చెన్నై

3 జోన్‌లలో తాగునీటి సరఫరాకు అంతరాయం

కొరుక్కుపేట: స్టెర్లింగ్ రోడ్డులో చెన్నై డ్రింకింగ్ వాటర్ బోర్డు సమాచార పైప్‌లైన్ పనులు కొనసాగుతున్న కారణంగా జోన్ 9, 10, 13 ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను 24 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు చెన్నై డ్రింకింగ్ వాటర్ బోర్డు తెలియజేసింది. చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్, స్టెర్లింగ్ రోడ్‌లోని కిల్లిపాక్కం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుండి మంచినీటిని తీసుకువెళ్లే పైప్‌లైన్ అనుసంధాన పనులు చేపడుతున్నారు. దీంతో తేనాంపేట, కోడంబాక్కం, అడయార్ జోన్‌ల పరిధిలోని ప్రాంతాలకు 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు పైపుల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోనుంది. స్థానికులు ప్రజలు ముందుజాగ్రత్తగా సరిపడా తాగునీటిని నిల్వ ఉంచుకోవాలని అధికారులు పేర్కొన్నారు. తక్షణ అవసరం కోసం ట్యాంకుల ద్వారా తాగునీటిని పొందడానికి వాటర్ బోర్డు వెబ్‌సైట్‌లో సమాచారం అందించాలన్నారు. అలాగే, నీటి కనెక్షన్ లేని ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని చెన్నై డ్రింకింగ్ వాటర్ బోర్డు ఆదివారం తెలిపింది.

నిత్యావసర వస్తువుల పంపిణీ



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నై విల్లివాక్కం సమీపంలోని ఐనావరం రక్షణ సైన్యం సంఘం 91 వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఐనావరం రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి సంఘ కాపరులు లెఫ్టినెంట్ విక్టర్ ఇమ్మానియేలు, లెఫ్టినెంట్ పుష్పరత్న నివేదితల అధ్యక్షతన జరిగిన వేడుకలకు సదరన్ రైల్వే డిప్యూటీ సీఎంఈ బి.ఆనంద్ హాజరయ్యారు. సండే స్కూల్ చిన్నారులు, యువజన విభాగం నిర్వాహకులు, స్త్రీల సమాజం, కార్యకర్తలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వార్షికోత్సవం సందర్భంగా ఐనావరం రక్షణ సైన్యం చర్చి తరపున 91 పేద కుటుంబాలకు బియ్యం, పప్పుధాన్యం తదితర కిరాణా సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి ఎస్.థామస్ , కోశాధికారి జి.ప్రభుదాస్, సార్జెంట్ మేజర్ వి.సల్మాన్, సహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిక్‌కు సిద్ధమైన సంతానం



కిక్ చిత్రంలో సంతానం, తాన్యాహోప్

తమిళసినిమా: కామెడీ పాత్రల నుంచి కథానాయకుడిగా మారిన నటుడు సంతానం. ఈయనకు ముందు వడివేలు, వివేక్ వంటి ప్రముఖ హాస్యనటులు హీరోలుగా అవతారమెత్తారు. అందులో సక్సెస్ కాలేకపోయారు. అయితే సంతానం మాత్రం సక్సెస్‌ఫుల్‌గా హీరోగా రాణిస్తున్నారు ఆ మధ్య కొన్ని చిత్రాలు ఆయన్ని నిరాశపరిచినా.. ఇటీవల విడుదలైన డీడీ రిటర్న్స్ విజయవంతంగా ప్రదర్శింపబడుతూ సంతానంలో నూతనోత్సాహాన్ని నింపింది. దీంతో తాజాగా కిక్ చిత్రంతో తెరపైకి రావడానికి సంతానం సిద్ధమవుతున్నారు. ఇక ఫార్చ్యూన్ పతాకంపై సంతానం కథానాయకుడిగా నటించిన చిత్రం కిక్. కన్నడంలో లవ్ గురు, గాని బనానా, విజిల్, ఆరెంజ్ వంటి చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. నటి తాన్యా హోప్ నాయకిగా నటించిన ఇందులో తంబిరామయ్య, బ్రహ్మానందం, సెంథిల్, మన్సూర్ అలీ ఖాన్, మనోబాల, వైజీ మహేంద్రన్, షకీలా, స్కూల్ సురేష్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్ర ట్రైలర్ గత జనవరి నెలలోనే విడుదలైంది. కాగా నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా చిత్ర విడుదల కొంత ఆలస్యం అయిందని నిర్మాతలు పేర్కొన్నారు. కాగా తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న కిక్ చిత్రానికి సెన్సార్ బోర్డు, యూ/ఏ సర్టిఫికెట్‌ను ఇచ్చింది. దీంతో చిత్రాన్ని ఈ నెలలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.



శివకార్తికేయన్, దర్శకుడు ఏఆర్ మురుగదాస్



మృణాల్ ఠాగూర్

మురుగదాస్, శివకార్తికేయన్ కాంబోలో కొత్తచిత్రం?

తమిళసినిమా: కథానాయకుడికైనా, కథానాయకి అయినా, దర్శకుడికి అయినా ఒక్క హిట్ ఒకే ఒక్క హిట్ చాలు. కెరీర్ సాలీడ్‌గా సెటిల్ అయిపోతుంది. ఆ తరువాత ఎన్ని జయాపజయాలు వచ్చినా అవి ఆటుపోటు లాంటివే సర్దుకుంటాయి. నటి మృణాల్ ఠాగూర్ నటి జీవితం ఇంతే. మోడలింగ్ రంగం నుంచి వచ్చిన ఈ భామ పలు వాణిజ్య ప్రకటనల్లో నటించి ఆ తరువాత వెండి తెరకు పరిచయం అయ్యింది. ఇలా పలు మరాఠీ , హిందీ చిత్రాల్లో నటించినా రాని క్రేజ్ సీత రామమ్ అనే ఒక్క తెలుగు చిత్రంలో వచ్చింది. ప్రస్తుతం హిందీ తెలుగు తదితర భాషల్లో నటిస్తూ బిజీగా ఉంది కాగా తెలుగులో నాని సరసన హాయ్ నాన్న చిత్రంలో నటిస్తున్న మృణాల్ ఠాగూర్ ఇప్పుడు కోలీవుడ్ నుంచి కాలింగ్ వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తాజా చిత్రంలో నటుడు శివ కార్తికేయన్ కథానాయకుడుగా నటించనున్నారు. ఇందులో నటి మృణాల్ ఠాగూర్‌ను నాయకిగా ఎంపిక చేసినట్లు తాజా సమాచారం. క్రేజీ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది. దీనికి అనిరుధ్ సంగీతం అందించనున్నట్లు తెలిసింది. కాగా నటుడు శివకార్తికేయన్ నటించిన మావీరన్ చిత్రం ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఈయన నటుడు కమలహాసన్ తన రాజ కమల్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. ఇది ఈయన 21వ చిత్రం. ఇందులో నటి సాయి పల్లవి నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్రం పూర్తి చేసిన తర్వాత శివకార్తికేయన్, దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కాంబోలో చిత్రం మొదలవుతుందని సమాచారం. రజనీకాంత్‌తో చేసిన దర్బార్ చిత్రం కొట్టిన ఫ్లాప్ దెబ్బతో ఏఆర్ మురుగదాస్ ఇప్పటివరకు మరో చిత్రం చేయలేదు. కాగా చాలా గ్యాప్ తర్వాత ఆయన శివకార్తికేయన్ హీరోగా చిత్రం చేయబోతున్నారన్నది గమనార్హం. ఇది ఏడాది చివరిలో సెట్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

కోలీవుడ్ టాక్స్

అపజయాలకు హీరోయిన్లు కారణమా?



తమిళసినిమా: ఉత్తరాది సినీ అందగత్తెల్లో నటి తాప్సీ ఒకరు. ఆరంభ దశలో అందాలనే నమ్ముకున్న ఈమె తెలుగు, తమిళం భాషల్లో పాత్రల్లోనే ఎక్కువగా నటించారు. ఇంకా చెప్పాలంటే దక్షిణాదిలో గ్లామరస్ పాత్రలే తాప్సీని నటిగా నిలబెట్టాయి. అయితే తమిళంలో ధనుష్ సరసన ఆడుగళం చిత్రంలో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించారు. కాంచన, గేమ్ ఓవర్ వంటి చిత్రాలు అవకాశం ఉన్న పాత్రలో నటించి సత్తా చాటారు. అయితే ఈమె ఆ తర్వాత బాలీవుడ్ చిత్రాలపై దృష్టి సారించారు. అక్కడ హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రాల్లో నటించి వరుసగా విజయాలు అందుకున్నారు. దీంతో దక్షిణాది చిత్రాలకు దాదాపు దూరమయ్యారు. అలాంటిది ఇటీవల దక్షిణాది చిత్రాలపై మక్కువ చూపుతున్నారనిపిస్తోంది. తాప్సీ తాజాగా ఏలియన్ అనే తమిళ చిత్రంలో నాయకిగా నటిస్తున్నారు. కాగా ఇటీవల ఆమె ఒక భేటీలో ఆదిలో తాను ఎదుర్కొన్న ఆటంకాలను, అవమానాలను ఏకరువు పెట్టారు. తాను దక్షిణాదిలో నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన విజయాలను సాధించలేదన్నారు. ముఖ్యంగా తెలుగులో నటించిన చిత్రాలు ఫ్లాప్ అయ్యాయన్నారు. దీంతో అందరూ తనపై రాశిలేని నటి అనే ముద్ర వేశారన్నారు. అయినా చిత్రాలు అపజయం పాలైతే ఆ నెపాన్ని ఎందుకు హీరోయిన్లపై నెట్టేస్తారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నిజం చెప్పాలంటే కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్ పరిధి కొన్ని సన్నివేశాలు పాటలకు వరకేనన్నారు. అలాంటిది చిత్రాల అపజయాలకు హీరోయిన్లను ఎలా బాధ్యుల్ని చేస్తారని ప్రశ్నించారు. తన విషయం లోనూ ఇదే జరిగిందని, ఇలాంటి వాటికి ఆరంభంలో ఆవేదన చెందినా, ఆ తరువాత విమర్శకులను పట్టించుకోవడం మానేశానన్నారు. తాను సినిమా నేపథ్యం నుంచి వచ్చిన నటిని కాదని, అందువల్ల ఎలాంటి కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటించాలో తెలియలేదని పేర్కొన్నారు. అలా చేసిన తప్పులనుంచి చాలా నేర్చుకున్నానని తాప్సీ అన్నారు.

విజయ్ సేతుపతితో

చిత్రం సాధ్యం కాదు



విజయ్ సేతుపతి, చేరన్

తమిళసినిమా: భారతి కన్నమ్మ, దేశీయ గీతం, వెట్రికొడిగట్టు, పాండవర్ భూమి, సొల్లమరంద కథా, ఆటోగ్రాఫ్, తవమాయ్ తవమిరుందు వంటి పలు విజయవంతమైన చిత్రాల దర్శకుడు, వీటిలో పలు చిత్రాల్లో కథానాయకుడిగా నటించిన దర్శక నటుడు చేరన్. అయితే ఇటీవల అయన నటించిన, దర్శకత్వం వహించిన కొన్ని చిత్రాలు నిరాశ పరచడంలో మళ్లీ తన సత్తా చాటే ప్రయత్నంలో ఉన్నారు. కాగా ఆ మధ్య నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా ఓ చిత్రం చేస్తానని ప్రకటించారు. అయితే దానికి సంబంధించిన వివరాలు ఇప్పటివరకు తెలియ రాలేదు. కాగా ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు చేరన్‌ను విజయ్ సేతుపతితో చేసే చిత్రం ఏమైందన్న మీడియా ప్రశ్నకు ఆ చిత్రాన్ని ఇకపై చేయటం వీలుకాదని బదులిచ్చారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని ఆయన కోసం కథను మార్చాల్సి ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ప్రస్తుతం విజయ్ సేతుపతి చాలా బిజీగా ఉన్నారని, కాబట్టి ఆయనతో చిత్రం చేయడం ఇప్పట్లో అసాధ్యమని చేరన్ స్పష్టం చేశారు.

వేంబు చిత్ర టైటిల్ పోస్టర్ విడుదల



తమిళసినిమా: మంజల్ సినిమాస్ పతాకంపై గోల్డెన్ సురేష్, ఎస్. విజయలక్ష్మి కలిసి నిర్మిస్తున్న చిత్రం వేంబు. మెడ్రాస్ చిత్రం ఫేమ్ హరికృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న ఇందులో రాజ్‌కుమార్ నైతిక నటిస్తున్నారు. మారిముత్తు, జయ రావత, పరియేరుమ్ పెరుమాళ్, కర్ణన్ చిత్రాలు ఫేమ్ జానకి అమ్మ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు పలువురు గ్రామీణ కళాకారులు ఇందులో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం ద్వారా జస్టిన్ ప్రభు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈయన ఇంతకుముందు పారిశుద్ధ్య కార్మికుల ఇతివృత్తంతో కుప్పై కారన్ అనే లఘు చిత్రాన్ని రూపొందించారు. ఇది అంతర్జాతీయ ఉత్తమ లఘు చిత్రం అవార్డు గెలుచుకుంది. కాగా వేంబు చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఓ సగటు యువకుడి ఇతివృత్తంతో రూపొందిస్తున్న చిత్రం ఇదని చెప్పారు. అతను తన జీవితాన్ని దాటి ఈ సమాజాన్ని ఎలా ఎదుర్కొన్నాడు..? పరిస్థితుల ప్రభావంతో ఏ విధంగా ప్రముఖ వ్యక్తిగా ఎదిగాడు? ఇత్యాది పలు ఆసక్తికరమైన అంశాలతో కూడిన చిత్రంగా వేంబు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ భావాలను పిల్లలపై ఎలా రుద్దుతారు ఒక స్త్రీని ఈ సమాజం ఎలా చూస్తుంది. ఆమెలో తప్పులను ఏ విధంగా చూసే ప్రయత్నం చేస్తుంది లాంటి.. ఆలోచింపజేసే అంశాలు ఇందులో చోటు చేసుకుంటాయన్నారు. సమాజమే ఊహించని ఓ సంఘటన జరుగుతుందని దాన్ని పోలీసులు గాని, ప్రభుత్వం కానీ అడ్డుకోలేదని, ప్రజలు సురక్షితమైన ఆ పాటను ఎంచుకుంటారనే అంశాన్ని ఈ చిత్రంలో పొందుపరిచినట్లు చెప్పారు. చిత్రం చూసిన ప్రతివారూ ఇందులోని సన్నివేశాలను తమకు అన్వయించుకుంటారన్నారు. కాగా ఈ చిత్ర టైటిల్ పోస్టర్‌ను దర్శకుడు పా. రంజిత్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మాహుతి

తిరువొత్తియూరు: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కన్యాకుమారి జిల్లా తిరువట్టార్‌లో చోటుచేసుకుంది. సెంగుడి నెడుమనూరుకు చెందిన ఐజాక్ రాజ్ కుమార్ (47) ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. భార్య జనిమలర్ (37), 11, 15 ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. జనిమలర్ స్వయం సహాయక బృందంలో లోన్ తీసుకున్న వారికి సాక్షి సంతకం చేసినట్లు తెలిసింది. ఈ సంగతి తెలుసుకున్న ఐజాక్ రాజ్ కుమార్ భార్యను నిలదీశాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపం చెందిన జెనిమలర్ కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆమె కేకలు విన్న స్థానికులు మంటలను ఆర్పి చికిత్స కోసం ఆచారి పల్లం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సారా విక్రేతపై గూండా చట్టం


శరవణన్

తిరువొత్తియూరు: కడలూరు జిల్లా విరుదాచలంలో సారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతనిపై గుండా చట్టం నమోదు చేశారు. కడలూరు జిల్లా విరుదాచలం ఎక్సైజ్ విభాగం పోలీసు ఇన్‌స్పెక్టర్ శక్తి నేతృత్వంలో పోలీసులు ఇటీవల వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ మార్గంగా మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తిపై సందేహంతో విచారణ చేశారు. అదే ప్రాంతానికి చెందిన ఇలవరసన్ కుమారుడు శరవణన్ (27) అని తెలిసింది. అతను సారా తరలిస్తున్నట్లు తెలిసింది. అతని వద్ద నుంచి 110 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విరుదాచలం ఎక్సైజ్ విభాగం పోలీసు స్టేషన్‌లో శరవణపై 8 కేసులు ఉండడంతో అతనిపై గుండా చట్టం నమోదు చేసేందుకు కడలూరు ఎస్పీ రాజా రామ్ జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. ఈ మేరకు కలెక్టర్ అరుణ్ తంబరాజ్ శరవణన్‌ను గుండా చట్టం కింద అరెస్ట్ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శరవణన్‌ను గుండా చట్టం కింద అరెస్ట్ చేసి కడలూరు సెంట్రల్ జైలులో పెట్టారు.

పేలుడుపై కేంద్ర బృందం విచారణ

తిరువొత్తియూరు: క్రిష్ణగిరి టపాసుల గోడౌన్‌లో పేలుడు ఘటనలో మృతి చెందిన హోటల్ యజమాని ఇంటిలో కేంద్ర అధికారులు విచారణ చేస్తున్నారు. క్రిష్ణగిరి పలయపేట నేతాజీ కాలనీలో జూలై 29వ తేదీ టపాసుల గోడౌన్‌లో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాదానికి సమీపంలో ఉన్న హోటల్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిపింది. దీనికి వ్యతిరేకత తెలుపుతూ మృతిచెందిన హోటల్ యజమాని రాజేశ్వరి భర్త, బంధువులు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సంఘటన గురించి సీబీఐ లేదా ఎన్ఐఏ విచారణ చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు సైతం లేఖ రాశారు. ఈ క్రమంలో పేలుడు వస్తువుల నిపుణులు, నలుగురు అధికారులు శనివారం హోటల్ యజమాని యజమాని రాజేశ్వరి భర్త, కుమారుడు, అల్లుడు కుమార్తె తదితరులు వద్ద సుమారు 30 నిమిషాల పాటు విచారణ చేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


వైద్యులను సత్కరిస్తున్న అనిత రమేష్

కొరుక్కుపేట: తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (మద్రాస్ యూనిట్) ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. చెన్నైలోని కేసరి విద్యాలయం ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ నేత్రాలయానికి చెందిన వైద్యులు ముత్తు శరవణన్, కన్నన్ నేత్ర పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులను చైర్‌పర్సన్ అనిత రమేష్, కార్యదర్శి లక్ష్మీ కర్లపాటి జ్ఞాపికలతో సత్కరించారు.

విద్యతో ఏదైనా సాధ్యం


పాఠశాల ప్రారంభోత్సవంలో అనిల్ అగర్వాల్

కొరుక్కుపేట: విద్యతో జీవితంలో ఏదైనా సాధించవచ్చని యుకేలోని వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ అనిల్ అగర్వాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం చెన్నై బీసెంట్ నగర్‌లో సురానా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో సురానా హైటెక్ ఇంటర్నేషనల్ పాఠశాలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అనిల్ అగర్వాల్, గౌరవ అతిథిగా అపోలో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి పాఠశాలను ప్రారంభించారు. విద్యాసంస్థల నిర్వాహకుల చేస్తున్న కృషిని కొనియాడారు. సురానా ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ కైలాష్మల్ దుగర్, సెక్రటరీ ఆనంద్ పి సురానా, అకడమిక్ డైరెక్టర్ జయంతి బాలచంద్రన్, సీఈఓ శాంతి వెంకట్ పాల్గొన్నారు.



అపూర్వ కలయిక

కొరుక్కుపేట: నాలుగున్నర దశాబ్దాలు తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని సంతోషంగా గడిపారు. వివరాలు.. చెన్నై షావుకారుపేట మింట్ వీధిలోని హిందూ థియాలజికల్ మహోన్నత పాఠశాల (హెచ్‌టీహెచ్ఎస్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1949 నుంచి 2002 వరకు ఎస్ఎస్ఎల్సీ, పదవ తరగతి చదువుకున్న 400 మందికి పైగా విద్యార్థులు నాలుగున్నర దశాబ్దాల తర్వాత వాట్సాప్ గ్రూప్ ద్వారా అందరూ ఏకమై స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్నారు. హిందూ థియాలజికల్ మహోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తరపున చేపట్టిన ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఒకరిని ఒకరూ ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒక్కసారిగా బాల్యంలోకి వెళ్లిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సమావేశంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు కేవీ శివరామ్ స్వాగతోపన్యాసం చేయగా, కార్యదర్శి జిల్లా తేపెరుమాళ్ సంఘం చేపడుతున్న పనుల వివరాలు తెలియజేశారు. పాఠశాల అధ్యక్షుడు డా.ఎస్ఆర్ దవేతోపాటు ఇంకా 75 ఏళ్లు పూర్తయిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఇందులో పాఠశాల కరస్పాండెంట్ పబ్బిశెట్టి శ్రీరాములు తోపాటు సంఘం కోశాధికారి వేమా మహేంద్ర పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



తిరుత్తణి: ఆర్కేపేట సమీపంలోని అమ్మయార్ కుప్పం ప్రభుత్వ మహోన్నత పాఠశాలకు చెందిన 1996–98 బ్యాచ్ ప్లస్ 1, ప్లస్ 2 పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. అనేక మంది ఉన్నత చదువులు అభ్యసించి డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, పోలీసులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. విద్య, క్రమశిక్షణ నేర్పి జీవితంలో మంచి స్థాయికి తీసుకొచ్చిన పాఠశాలకు మంచి పనులు చేసి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించి వారి నుంచి ఆశీస్సులు పొందేందుకు వీలుగా పాఠశాలలో గెట్ టూ గెదర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పాతికేళ్ల తరువాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కష్టసుఖాలను పంచుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. రూ. 60 వేలతో పాఠశాలకు స్టేజ్‌తో పాటు మైక్‌సెట్ ఏర్పాటు చేశారు.

పడవ బోల్తా.. మత్స్యకారుడు మృతి

అన్నానగర్: తిరువాన్మియూర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్తుండగా పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లోని మీనావ గ్రామానికి చెందిన కుప్పన్ (69) కుమారుడు రాజేష్ (38), స్నేహితుడు శక్తివేల్ (28) శనివారం సాయంత్రం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతుండగా పెద్ద అల వారిని తాకింది. పడవ బోల్తా పడింది. దీంతో సముద్రంలో మత్స్యకారులు కుప్పన్, రాజేష్, శక్తివేల్ ముగ్గురు పడిపోయారు. శక్తివేల్ పడవ అడుగున ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన శక్తివేల్‌ని రక్షించి అదే పడవలో మత్స్యకారులు కుప్పన్, రాజేష్ ఒడ్డుకు తీసుకొచ్చి చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శక్తివేల్ మృతి చెందాడని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగు నీటి కోసం ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తిరువొత్తియూరు: కోవై జిల్లా దివాన్సా పుదూరు పంచాయతీలో తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ స్థానికులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఆనైమలై సమీపంలోని దివాన్సా పుదూర్ పంచాయతీకి చెందిన వలర్ధాయ్ గ్రామంలో 500 కుటుంబాలు ఉంటున్నాయి. పొన్నల మన్‌తురైలో తాగునీటి పథకం కింద తాగునీరు అందిస్తున్నారు. 15 రోజులకు ఒకసారి తాగునీరు సప్లై చేస్తున్నారు. రెండు నెలలుగా సక్రమంగా నీరు సరఫరా చేయడం లేదు. దీనిపై పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహించి శనివారం ఉదయం ఖాళీ బిందెలతో రోడ్డుపై కూర్చొని ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

పిచ్చాటూరు : మండలంలోని కీళపూడిలో హేమావతి అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఆమె భర్త తిరుమలయ్య(29)ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీ కథనం మేరకు.. కీళపూడికి చెందిన ఏసు రెడ్డి కుమారుడు తిరుమలయ్యకు తమిళనాడుకు చెందిన హేమావతి(16)తో గత ఏడాది డిసెంబర్‌లో వివాహం జరిగింది. వ్యవసాయం చేస్తూ తిరుమలయ్య డ్రైవర్‌గా కూడా పనిచేసేవాడు. ఈ క్రమంలో కొత్త వాహనం కొనుగోలు చేసుకునేందుకు అత్తామామలను రూ.6లక్షలు అడిగాడు. తమకు అంత స్తోమత లేదని, త్వరలోనే పొలం తెగనమ్మి కొంత డబ్బులు సమకూరుస్తామని నచ్చజెప్పినా తిరుమలయ్య వినలేదు. దీనిపై హేమావతిని తీవ్రంగా వేధించడంతో మనస్తాపం చెందిన బాలిక ఇంట్లోని డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు తిరుమలయ్యను శనివారం కేవీబీపురం మండలం కోటమంగాపురం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యాపారి దారుణ హత్య

అన్నానగర్: వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు.. తూత్తుక్కుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలోని పుదుకుడికి చెందిన సెంథిల్ నాథన్ (43)కు భార్య సెల్వి, కుమారులు ఇసాక్కిరాజా(15), శంకర్ (13), కడలైముత్తు (13) ఉన్నారు. సెంథిల్ నాథన్ శ్రీవైకుంఠం ప్రభుత్వ మహిళల మహోన్నత పాఠశాల సమీపంలో ముురుకుల దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం దుకాణంలో ఉండగా అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు సెంథిల్‌నాథన్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యారు. రక్తపు మడుగులో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సెంథిల్‌నాథన్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వైకుంఠం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమ జంట ఆత్మహత్య

తిరువొత్తియూరు: పెళ్లికి తల్లిదండ్రులు వ్యతిరేకత తెలపడంతో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. తేని జిల్లా పెరియకులం సమీపంలో ఉన్న గాంధీనగర్‌కు చెందిన వేలవర్ కుమారుడు మారిముత్తు (22) కూలీ. అదే ప్రాంతానికి చెందిన సంపత్ కుమార్ కుమార్తె మహాలక్ష్మి (16) 9వ తరగతి వరకు చదివి ఇంటిలోనే ఉంటోంది. మారిముత్తు మహాలక్ష్మి ప్రేమించుకుంటున్నారు. ఇద్దరు వేర్వేరు కులాలకు చెందిన వారు కావడంతో వీరి ప్రేమకు తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి నుంచి ఇద్దరు బయటకు వెళ్లారు. గాంధీనగర్ సమీపంలో ఉన్న మామిడి తోట వద్దకు వెళ్లారు. ఇద్దరు ఒకటిగా కలిసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

21 మోటారు బైకులు స్వాధీనం

తిరువొత్తియూరు: తంజై సమీపంలో పలుచోట్ల చోరీ చేసిన రూ.15 లక్షల విలువైన 21 మోటార్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. వివరాలు.. సంజయ్ సమీపంలోని వల్లం పరిసర ప్రాంతాల్లో మోటార్ బైక్‌లు, స్కూటర్లు చోరీ అవుతున్నట్లు ఇటీవల పోలీసులకు వరుసగా ఫిర్యాదులు అందాయి. పోలీసు సూపరింటెండెంట్ ఆశ్రిరావత్ ఆదేశాల మేరకు వల్లం డిప్యూటీ నిత్య నేతృత్వంలో ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టర్ అడైక్కాళ్ డేవిడ్ స్వామి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం తంజై పుదుకోట రోడ్డులోని తిరుకానూర్ పట్టి నాలుగు రోడ్ల కూడలి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా బైక్‌పై వచ్చిన ఓ యువకుడిని పోలీసులు విచారణ చేయగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి విచారణ చేయగా అతను అమ్మపేటకు చెందిన దళపతి (34) అని, స్నేహితులతో కలసి బైక్ దొంగతనాలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో అతడి నుంచి 21 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దళపతి స్నేహితుల కోసం గాలిస్తున్నారు.

కారును ఢీకొన్న లారీ

• ఒకరి మృతి.. నలుగురికి గాయాలు



బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఆదివారం కారును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. వివరాలు.. చెన్నైకు చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గం మధ్యలో శ్రీకాళహస్తి నుంచి లారీ ఢీకొంది. దీంతో కారులోని ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ వారిలో అస్గర్(42) అనే వ్యక్తి మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపారు.

అమ్మ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మరోసారి టీటీవీ


టీటీవీ దినకరన్

సాక్షి, చెన్నై : అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శిగా రెండోసారి టీటీవీ దినకరన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వివరాలు.. అన్నాడీఎంకే నుంచి చీలికతో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ఆవిర్భవించిన విషయం తెలిసిందే. తొలుత ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దివంగత సీఎం జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళ పేరును తెర మీదకు తెచ్చారు. అయితే, అన్నాడీఎంకే వ్యవహారాలు కోర్టులో ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చిన్నమ్మ ప్రతినిధి టీటీవీ దినకరన్‌ను ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీకి డిపాజిట్లు గల్లంతైనా , ఏమాత్రం తగ్గకుండా అన్నాడీఎంకేను ఏదో ఒక రోజు కైవసం చేసుకుని తీరుతామనే ధీమాతో దినకరన్ ప్రయాణం సాగిస్తున్నారు. అలాగే అన్నాడీఎంకే నుంచి ఇటీవల బయటకు వచ్చిన మాజీ సీఎం పన్నీరు సెల్వంతో జతకట్టి పరుగులు తీస్తున్నారు. ఈ సమయంలో ఆదివారం చెన్నై వానగరంలో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం సర్వసభ్య సమావేశం, కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ ఉపాధ్యక్షుడు అన్బళగన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెండో సారి టీటీవీ దినకరన్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. నాలుగేళ్లు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. అలాగే, పార్టీ రాష్ట్రకార్యవర్గాన్ని ఎంపిక చేయడం, పార్టీ పరంగా అన్ని నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని దినకరన్‌కు అప్పగిస్తూ తీర్మానించారు. అలాగే కావేరిలో నీటి విడుదలలో కర్ణాటక చర్యలను, మేఘదాతులో డ్యాం నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారు.

వేడుకగా స్నేహితుల దినోత్సవం


విజేతలకు బహుమతులు అందిస్తున్న సరళ

కొరుక్కుపేట: కేటీసీటీ పూర్వ విద్యార్థినుల సంఘం ఆధ్వర్యంలో స్నేహం–2023 వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చెన్నై పుదుపేటలోని నాథమునిహాలు వేదికగా ఆదివారం ఉదయం జరిగిన ఈ వేడుకలకు సంఘం అధ్యక్షురాలు జి.సరళ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ.. స్నేహం వేడుకల్లో కార్యవర్గ సభ్యులంతా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థినుల సంఘం ఎంతో కృషి చేస్తోందని గుర్తు చేశారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సెక్రటరీ షర్మిళ, కోశాధికారి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్


అరెస్టయిన సెంబరత్తి, శివ,రాజశేఖర్

పళ్లిపట్టు: మహిళను హత్య చేసిన ఇద్దరు యువకులతో పాటు హత్యకు కుట్రపన్నిన మహిళను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఆర్కేపేట సమీపంలోని మూరకుప్పం గ్రామానికి చెందిన పెరుమాళ్ (32) మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. అతనికి భార్య చెంబరత్తి(30), పిల్లలు తమిళరసన్(11), యోగిత(5) ఉన్నారు. పెరుమాళ్‌కు చెదులూరుకు చెందిన పుష్ప(26)తో పరిచయం ఏర్పడింది. భర్తతో విడాకులు తీసుకుని పుట్టింటిలో ఉంటున్న పుష్పను పెరుమాళ్ రెండేళ్ల కిందట రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఆర్కేపేటలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. దీంతో చెంబరత్తి భర్తతో తరుచూ గొడవలు పడేది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పుష్ప ఇంట్లో అనుమానాస్పద రీతిలో మృతి చెందడాన్ని చూసిన పెరుమాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివ దర్యాప్తు చేపట్టారు. చెంబరత్తి తన సమీప బంధువు, తమ్ముడు శివ(23)తో తన బాధను చెప్పుకుంది. పుష్పను చంపితే తప్ప తన కుటుంబం బాగుపడదని చెప్పడంతో శివ అతని మిత్రుడు రాజశేఖర్(21) కలిసి పుష్ప ఇంటికి వెళ్లి గొంతు నులిమి హత్య చేసి పరారైనట్లు విచారణలో తెలిసింది. దీంతో సెంబరత్తితో పాటు శివ, రాజశేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

కాపురానికి రాలేదని కత్తితో దాడి

తిరువొత్తియూరు: నామక్కల్ జిల్లాలో కాపురానికి రాలేదని ఉపాధ్యాయురాలిని కత్తితో పొడిచిన భర్త కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎలచ్చిపాళయం సమీపంలోని కరుమా గౌండమ్ పాలెంకు చెందిన రాజా (38) భార్య గాయత్రి (33) రాసిపురం టౌన్ సేదమంగళంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. వీరికి సుస్మిత (8), వైష్ణవ (3) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో విడిగా ఉంటున్నారు. గాయత్రి సేలం దాదగాపట్టిలో ఉన్న తండ్రి రాజేంద్రన్ ఇంటిలో ఉంటోంది. అక్కడి నుంచే ఆమె, పిల్లలు పాఠశాలకు వచ్చి వెళుతున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల వద్దకు వెళ్లిన రాజా గాయత్రి, పిల్లలను తన ఇంటికి రమ్మని పిలిచాడు. ఆమె తిరస్కరించడంతో ఆగ్రహించి వెంట తెచ్చుకున్న కత్తితో గాయత్రిపై దాడి చేసి, మోటార్ సైకిల్ పై పారిపోయాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాయత్రిని చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ హేమావతి, సబ్ ఇన్‌స్పెక్టర్ తంగం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.15 కోట్లతో తిరుత్తణి రైల్వేస్టేషన్ ఆధునీకరణ


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు

తిరుత్తణి: అమృత్ భారత్ పథకం ద్వారా తిరుత్తణి రైల్వేస్టేషన్‌ను రూ.15 కోట్లతో ఆధునీకరించేందుకు ఆదివారం ప్రధానమంత్రి మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనులకు శ్రీకారం చుట్టారు. దేశంలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందకు వీలుగా అమృత్ భారత్ పథకం ద్వారా నిధులు కేటాయించారు. తిరుత్తణి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలతో పాటు ఎస్కలేటర్, ప్లాట్‌ఫాంల విస్తరణ, ముఖద్వారం, సహా నూతన సదుపాయాలు కల్పించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి నాయుడు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. అలాగే అరక్కోణం జంక్షన్ రైల్వే స్టేషన్‌ను రూ. 40 కోట్లతో ఆధునీకరించనున్నారు.

మహాలక్ష్మి మహాయాగ యజ్ఞం

తిరుపతి కల్చరల్: స్థానిక డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన 225 కుండలాల యాగ మండపంలో ఆదివారం శ్రీమహాలక్ష్మి మహాయాగ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా వేద పారాయణం, సహస్ర కలాభిషేకం చేశారు. సాయంత్రం ఝులారియా పీఠాధిపతి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమన్నారాయణ స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీమద్భాగవత ప్రవచనంలో కైలాస్ చంద్రస్వామీజీ గజేంద్రమోక్షం, సముద్ర మధనం, శ్రీరామ్ అవతార్, శ్రీకృష్ణజన్మాష్టమి వంటి ఘట్టాలను విపులంగా వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుప్పాల గిరిధర్ కుమార్, శ్రీధర్, కమిటీ సభ్యులు నవీన్ మహేశ్వరి సంజయ్, సంజయ్, మధుసూదన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలోని ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన దుర్యోధన వధ ఘట్టాన్ని ఆసక్తిగా తిలకించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహణ కోసం రూ.లక్ష విరాళంగా అందించారు. అంతకు ముందు ఉత్సవాలకు వచ్చిన మోహిత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలు ప్రసాద్‌రెడ్డి, మిట్టపల్లి నాగిరెడ్డి, జ్యోతినాథ్‌రెడ్డి, ఆదెం మునిరెడ్డి, ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దుర్యోధన వధను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

క్లుప్తంగా...

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) ఆగస్టు 5న మధ్యాహ్నం షిఫ్ట్‌లో రికార్డు ఉత్పత్తి సాధించింది. విభాగంలో తయారయ్యే పలు ఉత్పత్తుల్లో ఒకటైన 63 ఎం.ఎం రౌండ్ ఆ రోజు అత్యధికంగా 1,234 టన్నులు ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది జనవరి 28న మధ్యాహ్నం షిఫ్ట్‌లో అత్యధికంగా 1,227 టన్నులు ఉత్పత్తి చేయగా ఇప్పుడు ఆ రికార్డును అధిగమించింది.

18 అడుగుల గిరినాగు హల్‌చల్



దేవరాపల్లి(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని తామరబ్బ పంచాయతీ శివారు లోవముకుందపురం పామాయిల్ తోటలో ఆదివారం భారీ గిరినాగు హల్‌చల్ చేసింది. 18 అడుగుల పొడవు ఉన్న గిరినాగు స్థానికులను చూసి బుసలు కొట్టడంతో వారు భయంతో పరుగులు తీశారు. అటవీశాఖ అధికారి శివకుమార్ వెంటనే వన్యప్రాణుల సంరక్షణ సంస్థ సభ్యులను పిలిపించారు. ముగ్గురు సభ్యులు ప్రత్యేక వాహనంలో అక్కడికి చేరుకొని 2 గంటల పాటు శ్రమించి అతి కష్టం మీద పామును పట్టుకున్నారు. సుమారు 13 కిలోల బరువున్న గిరినాగును దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

విశాఖలో ఎంపీగా పోటీ చేస్తా... తెలంగాణలో సీఎం అవుతా



గాజువాక : 'నేను విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేస్తాను. తెలంగాణను అభివృద్ధి చేయడం కోసం అక్కడ ముఖ్యమంత్రిని అవుతాను' అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. ఆయన ఆదివారం గాజువాకలో విలేకరులతో మాట్లాడుతూ తాను విశాఖలో ఎంపీగా పోటీ చేయడానికి అనేక కారణాలు ఉ న్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసి రూ.8లక్షల కోట్లను మోదీ ప్రభుత్వం దోచు కుంటుంటే సీఎం జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆపడంలేదన్నారు. తాను ఎంపీగా గెలిచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతానని, తెలంగాణను అభివృద్ధి చేయడానికే అక్కడ సీఎంని అవుతానని ఆయన తెలిపారు.

ప్రకృతి సాగుకు ప్రాధాన్యం



రైతుల్ని నూరు శాతం ప్రకృతి సాగుబాట పట్టించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తొలి దశలో జిల్లాకు ఒక మండలాన్ని ప్రకృతి సాగులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మండలాల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించే సన్న, చిన్నకారు రైతులను సంఘటితం చేసి వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగుచేస్తే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. కావాల్సిన ఇన్‌పుట్స్ తయారీలో రైతులకు శిక్షణ కూడా ఇవ్వడంతోపాటు సాగులో మెళకువలు నేర్పుతూ అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తారు. దశలవారీగా మండలంలో ప్రతి ఒక్కరూ ప్రకృతి సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటారు. మార్కెటింగ్, హెల్త్ అండ్ న్యూట్రిషన్, సైన్స్, పరివర్తన, యాజమాన్యం, సర్టిఫికేషన్, స్థానిక విలువ జోడింపు, వ్యవస్థాగత పరిశ్రమలు ఇలా అన్ని విభాగాలలో ఆ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతారు. ఆదర్శ మండలాల్లో పౌష్టికాహారం అవసరమయ్యే వారందరికీ నూటికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రతి గ్రామంలో ప్రకృతి ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం ద్వారా పౌష్టికాహార లోపంతో బాధపడే వారి ఆహారంలో వాటిని భాగమయ్యేలా చూస్తారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అధ్యయనం చేస్తారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులు పండించిన ప్రకృతి ఉత్పత్తులను స్థానికంగా అమ్ముకునేలా చర్యలు తీసుకుంటారు. తొలుత గ్రామస్తులకు మంచి ఆహార ఉత్పత్తులు అందించేలా ప్రోత్సహిస్తారు.

\- సాక్షి, అమరావతి

రైతులే విక్రయించుకునేలా..

దళారుల పాత్ర లేకుండా రైతులే స్వయంగా పంట ఉత్పత్తులను రాష్ట్ర, జాతీయస్థాయి మార్కెట్లలో నేరుగా విక్రయించుకునేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తారు. వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రైతులు పంట ఉత్పత్తుల్ని విక్రయించుకుని అదనపు ఆదాయం పొందేలా చూస్తారు. ఇటీవల కాలంలో అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే పలువురు రైతులు ఏడాది పొడవునా పంటల సాగు ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆదాయం వచ్చేలా ఏటీఎం (ఎనీ టైం మనీ) తరహా మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఇదే మోడల్‌ను రాష్ట్రమంతా విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు.

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు బాధ్యతలు

ఇందుకు సంబంధించిన కీలక బాధ్యతలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు ప్రభుత్వం అప్పగించింది. సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ సీసీలు ఈ ప్రాజెక్టులో పాయింట్ పర్సన్‌గా వ్యవహరిస్తారు. వీరి సమన్వయంతో రైతు సాధికార సంస్థ సిబ్బంది ఎంపిక చేసిన మండలాల్లో సన్న, చిన్నకారు రైతులను గుర్తించి వారిని ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు అవసరమైన చేయూత ఇస్తారు. పాయింట్ పర్సన్స్‌గా ఎంపికైన ఏపీఎం, సీసీలకు రాష్ట్ర స్థాయిలో రెండ్రోజుల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఎంపికైన మండలాలివీ..

ఈ ప్రాజెక్ట్ కోసం పాతపట్నం (శ్రీకాకుళం), జీఎల్ పురం (పార్వతీపురం మన్యం), వేపాడ (విజయనగరం), పద్మనాభం (విశాఖపట్నం), చీడికాడ (అనకాపల్లి), పాడేరు (అల్లూరి), ప్రత్తిపాడు (కాకినాడ), ఐ.పోలవరం (కోనసీమ), గోకవరం (తూర్పు గోదావరి), పాలకొల్లు (పశ్చిమ గోదావరి), జీలుగుమిల్లి (ఏలూరు), బాపులపాడు (కృష్ణా), రెడ్డిగూడెం (ఎన్టీఆర్), కొల్లిపర (గుంటూరు), బెల్లంకొండ (పల్నాడు), మార్టూరు (బాపట్ల), కొత్తపట్నం (ప్రకాశం), దగదర్తి (నెల్లూరు), రామచంద్రపురం (తిరుపతి), శాంతిపురం (చిత్తూరు), చిన్నమండెం (అన్నమయ్య), పెండ్లిమర్రి (వైఎస్సార్), మడకశిర (శ్రీ సత్యసాయి), రాప్తాడు (అనంతపురం), ఓర్వకల్లు (కర్నూలు), ప్యాపిలి (నంద్యాల) మండలాలను ఎంపిక చేశారు.



ప్రకృతి సాగులో ఆదర్శం

జిల్లాకో మండలాన్ని ఎంపిక చేసి ప్రకృతి సాగులో ఆదర్శంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ సిద్ధం చేశాం. సెర్ప్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టబోతున్నాం. తొలుత సిబ్బందికి, ఆ తర్వాత రైతులకు శిక్షణ ఇస్తాం. సాగులో అవసరమైన చేయూత అందిస్తాం.

– బీవీ రామారావు, సీఈవో, రైతు సాధికార సంస్థ

బాలుడిని రక్షించిన ఫొటోగ్రాఫర్

బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): బీచ్‌లో అలల తాకిడికి కొట్టుకుపోతున్న బాలుడిని బీచ్‌లో ఫొటోలు తీసుకునే ఫొటోగ్రాఫర్ రక్షించాడు. ఆదివారం ఓ కుటుంబం బాలుడితోపాటు ఆర్కే బీచ్‌కు వచ్చింది. కుటుంబ సభ్యులంతా ఫొటోలు తీసుకోవటంలో బిజీగా ఉండటంతో బాలుడు తీరంలో ఆడుకునేందుకు వెళ్లాడు. ఒక్కసారిగా పెద్దగా వచ్చిన కెరటం బాలుడిని లోపలకు లాక్కుపోయింది. అక్కడ ఉన్న బీచ్ ఫొటోగ్రాఫర్ భాస్కరరెడ్డి వెంటనే స్పందించి బాలుడిని రక్షించాడు. ఓ చేత్తో ఖరీదైన కెమెరాను మరో చేతితో బాలుడిని రక్షించాడు. బాలుడిని వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించగా.. భాస్కరరెడ్డిని బాలుడు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు అభినందించారు.



అలల తాకిడికి కొట్టుకుపోతున్న బాలుడు



కొట్టుకుపోతున్న బాలుడిని రక్షిస్తున్న భాస్కరరెడ్డి



బాలుడిని చాకచక్యంగా తన చేతిలోకి తీసుకుంటున్న భాస్కరరెడ్డి

విశాఖలో శారీ వాక్‌థాన్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో అతి ముఖ్యమైన వస్త్రధారణపై నేటి యువతకు అవగాహన కల్పించేందుకు ఆదివారం విశాఖ ఆర్కేబీచ్‌లో హ్యాండ్‌లూమ్ శారీ వాక్‌థాన్ (చేనేత చీర నడక) నిర్వహించారు. భారీగా హాజరైన మహిళలతో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన వాక్‌థాన్‌ను ప్రముఖ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి, విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ట్రెడిషనల్ వాక్, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న కరణం మల్లీశ్వరి

దశాబ్దాల భూ సమస్యలు కొలిక్కి



- ఇప్పటికే అవనిగడ్డ, గన్నవరంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఇప్పుడు మచిలీపట్నం, గుడివాడల్లో భూములకు విడుదల
- నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ 368 జీవో జారీ
- 2వేలకు పైగా కుటుంబాలకు లబ్ధి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న భూముల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోంది. సీఎం వైఎస్ జగన్ చొరవతో ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లాలో వేలాది ఎకరాలకు నిషేధిత భూముల నుంచి జాబితా విముక్తి లభించింది. తాజాగా కృష్ణాజిల్లాలో దశాబ్దాల క్రితం ప్రభుత్వానికి నామమాత్రంగా ధర చెల్లించి, కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలకు నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి లభిస్తోంది.

పూర్తి వివరాలు ఇవి..

మచిలీపట్నం, గుడివాడ ప్రాంతంలో కొన్ని లే అవుట్లలో 1970–80 ప్రాంతంలో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, ఉద్యోగులు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ చెల్లించి స్థలాలు కొనుగోలు చేసి, ఇంటి పట్టాలు పొందారు. అయితే ఈ స్థలాలు నిషేధిత భూముల జాబితాలో ఉండటం వల్ల రిజిస్ట్రేషన్‌లు కాక ఇబ్బంది పడుతున్నారు. ఇంటి స్థలాలు పొందిలే అవుట్లలో ఉన్న వారు తమ సమస్యను కలెక్టర్ రాజబాబు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి, విషయాన్ని సీసీఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లారు. అసైన్డ్ భూములనే రెగ్యులరైజ్ చేస్తున్నామని, కానీ ఇక్కడ దశాబ్దాల కిందట మార్కెట్ విలువ చెల్లించి స్థలాలు కొన్నారని, వీటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీసీఎల్‌ఏ మచిలీపట్నంలోని ఆరు లేఅవుట్లో, గుడివాడలోని ఇంటి స్థలాలను సైతం నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని గత నెల 31వ తేదీ 368 జీవో జారీ చేశారు.

సర్వే ప్రారంభించిన అధికారులు..

కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఇంటి స్థలాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సర్వే బృందాలు ఇంటి స్థలాలను గుర్తిస్తున్నారు. ఈ జీవో ప్రకారం 2వేల కుటుంబాలకు పైగా లబ్ధి కలుగుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి, నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి చేసే దిశగా రెవెన్యూ శాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ప్రధానంగా ఈ జీవో ప్రకారం మచిలీపట్నం, గుడివాడలో అప్పట్లో ఇంటి స్థలాలు పొందిన రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు లబ్ధి కలుగనుంది.

వేగంగా భూములకు పరిష్కారం..

ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వేగంగా స్పందిస్తోంది. అందులో భాగంగా ఇటీవలే 60 ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్నా గన్నవరం నియోజకవర్గంలోని వెంకటాపురం ఇనాం భూములకు సైతం జిల్లా కలెక్టర్ నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి కల్పించారు. దీని ద్వారా వేలాది మంది పేద రైతులకు లబ్ధి కలిగింది. అలాగే గత ఏడాది అక్టోబర్‌లో అవనిగడ్డలో షరతుగల పట్టా భూములను నిషేధిత భూముల నుంచి తొలగించారు. దీని ద్వారా ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే 15,791 ఎకరాలు, 10,119 మంది రైతులకు లబ్ధి కలిగింది.

చిక్కుముడులు తొలగిస్తున్నాం..

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపుతోంది. ఇందులో భాగంగా అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు యజమాన్యపు హక్కులు కల్పిస్తున్నాం. ఇటీవల వెంకటాపురం గ్రామంలోని ఇనాం భూముల సమస్య పరిష్కరించాం. ఇప్పుడు నామమాత్రపు మార్కెట్ విలువ చెల్లించి, ఇంటి స్థలాలు కొనుగోలు వాటిని నిషేధిత స్థలాల జాబితా నుంచి తొలగించేలా ప్రభుత్వం 368 జీవో జారీ చేసింది. ఈ మేరకు జేసీ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల సర్వే సాగుతోంది. దీని ద్వారా 2వేలకుపైగా కుటుంబాలకు లబ్ధి కలుగనుంది.

– రాజబాబు, కలెక్టర్, కృష్ణా

కొత్త రేషన్ కార్డులొచ్చాయ్

పశ్చిమ గోదావరి జిల్లాలో 9,372 కార్డుల మంజూరు

- ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ
- ఇప్పటికే జిల్లాలో 5.62 లక్షల కార్డులు
- కొత్త కార్డులకు వచ్చే నెల నుంచి రేషన్

సాక్షి, భీమవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. గతంలో రేషన్‌కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడటంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో ప్రతి ఆరు నెలలకోసారి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా అర్హులతో దరఖాస్తు చేయించి కార్డులు మంజూరు చేయడంతో పాటు నేరుగా ఇంటికే తీసుకవచ్చి కొత్త కార్డు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా తాజాగా జిల్లాలోని 20 మండలాల్లో అర్హులైన పేదలకు 9,372 బియ్యం కార్డుల పంపిణీ ప్రారంభమైంది. రేషన్ కార్డు మంజూరు నిరంతర ప్రక్రియగా సాగుతుంది. కొత్తగా పెళ్లయినా దంపతులకు, ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టినా తక్షణం కొత్త రేషన్‌కార్డు మంజూరు చేస్తున్నారు.

డివిజన్ల వారీగా..

జిల్లాలోని 20 మండలాల్లో ప్రస్తుతం 5,62,395 రేషన్‌కార్డుల ద్వారా ప్రతి నెలా 8,641 టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.



భీమవరంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డును అందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

అలాగే తక్కువ ధరకు పంచదార, కందిపప్పును ఇంటి వద్దే రేషన్ వాహనాల ద్వారా అందిస్తున్నారు. గతనెలలో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 9,372 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా వీటి పంపిణీ ప్రారంభమైంది. భీమవరం రెవెన్యూ డివిజన్‌లో 10 మండలాలకు 4,627, నరసాపురం డివిజన్‌లో 10 మండలాలకు 4,745 కార్డులు మంజూరయ్యాయి. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ అందిస్తారు.

కార్డుల మంజూరు ఇలా..

భీమవరం	730
పెంటపాడు	384
తాడేపల్లిగూడెం	946
గణపవరం	368
ఉండి	371
ఆకివీడు	418
కాళ్ల	303
పాలకోడేరు	440
అత్తిలి	370
వీరవాసరం	297
నరసాపురం	740
యలమంచిలి	354
పెనుగొండ	421
తణుకు	753
ఆచంట	333
ఇరగవరం	359
పాలకొల్లు	620
మొగల్తూరు	433
పోడూరు	376
పెనుమంట్ర	356

గతంలో ఎదురుచూపులు



గతంలో రేషన్ కార్డు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్ కార్డు అందజేశారు. సత్వరమే కొత్త కార్డు జారీ చేయడం చాలా ఆనందంగా ఉంది.

–కటికితల వసంతకుమార్, ఏలూరుపాడు, కాళ్ల మండలం

వచ్చేనెల నుంచి రేషన్ పంపిణీ

జిల్లాలో నూతనంగా మంజూరైన 9,372 బియ్యం కార్డుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. కొత్త కార్డులు పొందిన వారికి వచ్చేనెల నుంచి ఉచితంగా బియ్యంతోపాటు తక్కువ ధరకు పంచదార, కందిపప్పు అందిస్తాం. ఇప్పటికే జిల్లాలో సుమారు 5.62 లక్షల రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు దాదాపు 8,641 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నాం.

–ఎస్.సరోజ, జిల్లా పౌరసరఫరాల అధికారి, భీమవరం

నేటి నుంచి మిషన్ ఇంద్రధనుస్సు

- నెలలో ఆరు రోజుల చొప్పున మూడు నెలలపాటు నిర్వహణ
- ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయడమే లక్ష్యం
- 10న చిన్నారులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ
- 'సాక్షి'తో డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయడమే లక్ష్యంగా మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ప్రతినెలా ఆరు రోజుల చొప్పున మూడునెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆదివారం 'సాక్షి'తో ఆమె ప్రత్యేకంగా మిషన్ ఇంద్రధనస్సు, నులిపురుగుల మాత్రల పంపిణీపై మాట్లాడారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. మరలా సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకూ, అక్టోబర్ 9 నుంచి 14వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే నిర్వహించిన సర్వేలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని చిన్నారులు 3,009 మందిని గుర్తించామన్నారు. వారితో పాటు ఇంకా వ్యాధినిరోధక టీకాలు వేయించుకోని వారు ఉంటే వారికి కూడా వేయనున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లాలో 422 సెషన్స్(స్థలాలు)ను ఎంపిక చేసి వ్యాక్సినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం చివరికి మీజిల్స్–రూబెల్లా నిర్మూలనకు లక్ష్యాల ఏర్పాటులో భాగంగా మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

5.50 లక్షల ఆల్‌బెండాజోల్ మాత్రలు..

ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్‌బెండాజోల్) మింగించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. విద్యాశాఖ అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 19 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మొత్తం 4,67,550 మందికి వేయాలనేది లక్ష్యం కాగా, 5.50 లక్షల మాత్రలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఆ మాత్రలను విజయవాడలోని జోనల్ కమిషనర్‌లు, మండలాల్లోని ఎంఈఓలు, మెడికల్ ఆఫీసర్‌ల ద్వారా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సరఫరా చేసినట్లు తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా నులిపురుగుల మాత్రలు వేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఆమె తెలిపారు.

మంచిమాట

పథం దృక్పథం



దృక్పథం... ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా ఉండేది దృక్పథం. మనస్థితి, పరిస్థితి వీటిని బట్టి ఎవరికైనా దృక్పథం అన్నది ఉంటూనే ఉంటుంది. దృక్పథం ఉండని మనిషి ఉండడు. మనిషి అన్నాక దృక్పథం ఉండకుండా ఉండదు. దృక్పథం మనిషి మనుగడ స్థాయిని, తీరును, నిర్ణయిస్తుంది. దృక్పథం మనిషి ప్రగతికి, పతనానికి మూలం ఔతుంది. సరైన దృక్పథం లేకపోతే మనుగడ సరిగ్గా లేనట్టే; మేలైన దృక్పథం ఉంటే మనుగడ మేలుగా ఉన్నట్టే.

చంద్రుడిపై కాలు మోపిన తొలి మనిషి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నది మనకు తెలిసిందే. కానీ ప్రణాళిక ప్రకారం ఎడ్విన్ ఆల్‌డ్రిన్ ముందుగా చంద్రుడిపై దిగాలి. ఆల్‌డ్రిన్ చంద్రుడిపై కాలు పెట్టబోయే తొలి మానవుడుగా నిర్ణయం అయిపోయింది. అయితే చంద్రుడిపై రాకెట్ దిగి తలుపులు తెరుచుకున్నాక ఆల్‌డ్రిన్ కదల్లేదు. అతడికి దిగమని ఆదేశాలు అందినా అతడు కదల్లేదు. ముందుగా చంద్రుడిపై దిగితే తనకు ఏం జరుగుతుందో అన్న దృక్పథం ఎడ్విన్ ఆల్‌డ్రిన్‌ను కదలనివ్వలేదు. ఆల్‌డ్రిన్ కదలకపోవడంతో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు దిగమని ఆదేశాలు అందాయి. ఏమైనా పరవాలేదు అన్న దృక్పథంతో ఆర్మ్‌స్ట్రాంగ్ రాకెట్ నుంచి చంద్రుడిపై దిగాడు; చంద్రుడిపై కాలు మోపిన తొలి మానవుడుగా చరిత్రలో నమోదు అయ్యాడు. ఆల్‌డ్రిన్ ఆ అవకాశాన్ని తన దృక్పథం కారణంగా జారవిడుచుకున్నాడు; చారిత్రిక ప్రాశస్త్యాన్ని కోల్పోయాడు.

'దృక్పథం మనిషిని ఎత్తులకు తీసుకు వెళుతుంది. దృక్పథం మనిషిని చిత్తు చేస్తుంది. దృక్పథం ఎత్తుల్లో ఉన్న వ్యక్తిని చిత్తు అయేట్టు చేస్తుంది. దృక్పథం చిత్తు అయిన వ్యక్తిని ఎత్తులకు చేరుస్తుంది. ఎత్తులకు చేరుకోవడానికైనా, చిత్తు అయిపోవడానికి అయినా దృక్పథం కీలకం'

'మనం మన దృక్పథానికి అంటిపెట్టుకుని ఉంటాం అన్నీ దాని ఆధారంగానే ఉంటాయి అని. అయినా మన అభిప్రాయాలకు శాశ్వతత్వం లేదు. వసంతం, హేమంతాలలాగా అవి తొలగిపోతూంటాయి' అని ప్రఖ్యాత చైనీస్ తత్త్వవేత్త జువాంగ్ చి ఒక సందర్భంలో అన్నారు. తన దృక్పథం సరైంది అనుకుంటూ దాన్నే అంటిపెట్టుకుని ఉండడం మనిషి బలహీనతల్లో బలమైంది. దృఢమైన దృక్పథం అన్నది మనిషికి బరువైన అవరోధం ఔతుంది. కదలని నీరు కాలక్రమంలో బురద అయిపోయినట్టుగా మారని దృక్పథం మనిషిని పాడు చేస్తుంది. మనిషి తన దృక్పథాన్ని మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి. పరిణామాలను బట్టి దృక్పథం ఉండాలి. దృక్పథం ప్రయోజనాల్ని సాధించగలిగేదై ఉండాలి.

కొందరు నేతల దృక్పథ దోషాలవల్ల ప్రపంచానికి ఎంతో హాని జరిగింది, జరుగుతోంది. ఇవాళ్టి రోజున రష్యా, ఉక్రెయిన్ యుద్ధం విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఉక్రెయిన్‌పై రష్యా దృక్పథం, రష్యాపై ఉక్రెయిన్ దృక్పథం వల్లే యుద్ధం సాగుతూ పెనువినాశనం జరుగుతోంది. ఆ దృక్పథ వైరుధ్యం పలు ఇతర దేశాల్ని అవాంఛనీయ పర్యవసానానికి గురిచేస్తోంది. ఈ దుస్థితి తొలగిపోవాలంటే ఇంకా విధ్వంసం జరగకుండా ఉండాలంటే ఆ ఇరుదేశాల దృక్పథాలూ మారాలి.


వ్యక్తిపరంగానూ, సామాజికంగానూ, సాంస్కృతికంగానూ, కళల పరంగానూ, భాషపరంగానూ దృక్పథం తిన్నగా ఉండడమే కావల్సింది. దృక్పథం తిన్నగా ఉండకపోవడం నష్టాన్ని, నాశనాన్ని కలిగిస్తుంది. కొన్ని దశాబ్దుల క్రితం మెరుగైన దృక్పథం లోపించడంవల్ల ఇవాళ తెలుగు భాష, తెలుగు కవిత్వం వైభవాన్ని కోల్పోవడం కాదు వికృతం అయిపోయిన వైనాన్ని అందుకు ఉదాహరణగా మనం చూడచ్చు. పలువురు తమ దృక్పథాల్ని మార్చుకోలేక తాము పతనమైపోవడమే కాకుండా తమ కుటుంబాలకు తీక్షణమైన హాని చేస్తున్నారు. దృక్పథ వక్రత అన్న దానివల్ల సమాజానికి తీవ్రమైన చేటు కలుగుతోంది.

దృక్పథం అన్నది మనిషి మనుగడలో ప్రముఖమైంది ఆపై ప్రధానమైంది. ప్రతిమనిషికి దృక్పథం అన్నది ప్రత్యగ్రంగా ఉండాలి. మనిషికి దృక్పథం భవ్యంగా ఆపై సవ్యంగా ఉంటే సత్పథం అమరుతుంది. సత్పథం అమరితే మనుగడ ఉన్నతంగా ఆపై ఉజ్జ్వలంగా ఉంటుంది. కనుక మనిషి తన దృక్పథాన్ని సరిచూసుకుంటూ ఆపై సరిచేసుకుంటూ మనుగడకు మహత్తును సాధించుకోవాలి.

– రోచిష్మాన్

బౌద్ధవాణి

యద్ధర్మం... సద్ధర్మం



అది శ్రావస్తి నగరానికి దాపున ఉన్న జేతవనం. ఆ వనం మధ్యలో ఉన్న ఆనందబోధి వృక్షం కింద ప్రశాంత వదనంతో కూర్చొని ఉన్నాడు బుద్ధుడు.

భిక్షు సంఘం ఆ చెట్టు చల్లని నీడలో కూర్చొని ఉన్నారు. వారు ధరించిన కాషాయ వస్త్రాలు కాంతిమంతంగా ఉన్నాయి. ఆ వెలుగు వారి దేహం మీద పడి ప్రకాశిస్తోంది.

''భిక్షువులారా! మనం ఎలాంటి ధర్మాన్ని తెలుసుకోవాలి? ఎలాంటి ధర్మాన్ని సేవించాలి? ఎలాంటి ధర్మాన్ని ఆచరించాలి? అని ఆలోచించాలి'' అన్నాడు గంభీరంగా.

భిక్షువులందరూ ప్రశాంతంగా వినసాగారు.

మనం పాటించే ధర్మం నాలుగు విధాల ఫలితాలనిస్తుంది. అందులో మొదటిది విషపదార్థం కలిసిన చేదు గుమ్మడికాయ రసం లాంటిది. దీని రుచీ, వాసన, రంగూ ఏదీ బాగోదు. పైగా తాగితే ప్రమాదం కూడా. అలాగే... వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ దుఃఖాన్ని ఇచ్చే ధర్మం అలాంటిది. అలాంటి కుశలం ఇవ్వని ధర్మాన్ని గ్రహించి దూరంగా ఉండాలి.

ఇక, రెండోరకం ధర్మాచరణ బంగారు పాత్రలో ఉన్న కుళ్ళిన పదార్థం లాంటిది. ఈ పదార్థం రంగు, రుచి, వాసనలు ఇంపుగా ఉంటాయి. పైగా బంగారు పాత్రలో ఉంది. కానీ, దీన్ని సేవిస్తే అనారోగ్యం కలిగి, ప్రాణాలకే ముప్పు. వర్తమానంలో సుఖాన్ని, దీర్ఘకాలంలో దుఃఖాన్ని ఇచ్చే ధర్మాచరణ ఇలాంటిది.

మరి, భిక్షువులారా! ఒక చెక్క పాత్ర ఉంది. దానిలో ఎన్నో మూలికలతో మరిగిన మూత్రం ఉంది. పాండు రోగానికి అది మంచి ఔషధం. దాని రంగు, రుచి, వాసనలు ఏవీ బాగోలేదు. అయినా దాన్ని సేవిస్తే రోగం తగ్గుతుంది. ఉపశమనం కలుగుతుంది. అలాగే... వర్తమానంలో దుఃఖాన్ని, దీర్ఘకాలంలో సుఖాన్ని ఇచ్చే ధర్మాచరణ కూడా ఇలాంటిదే!'' అన్నాడు.

''అలాగే... ఒక పాత్రలో పెరుగు, తేనె, నెయ్యి కలిపిన బెల్లం రసం ఉంది. అది కడుపులో బాధల్ని హరించే ఔషధం. ఆ బెల్లం రసం రంగు బాగుంటుంది. రుచి బాగుంటుంది. వాసన కూడా బాగుంటుంది. అది చేసే మేలు కూడా బాగుంటుంది. ఇలా వర్తమానంలో సుఖాన్ని, దీర్ఘ కాలంలో కూడా సుఖాన్ని ఇచ్చేది సద్ధర్మం.''

''భిక్షువులారా! సద్ధర్మం అనేది శరత్కాలంలోని సూర్యుని కాంతి లాంటిది. అది ప్రకాశిస్తుంది. మనిషి దుఃఖాన్ని పారద్రోలుతుంది'' అని చెప్పి, అందరి వంకా ఓసారి చూశాడు.

అందరి మనస్సుల్లోని ఉషస్సు వారందరి ముఖాల్లో తేజస్సుగా ప్రతిఫలిస్తోంది!

– డా. బొర్రా గోవర్ధన్

గురువాణి | వాగ్గేయకార వైభవం

నోటిమాట నిప్పుతో సమానం









మనకు ప్రధానంగా మూడు ఉపకరణాలుంటాయి–శరీరం, మనస్సు, వాక్కు. శరీరం అన్నం చేత తయారవుతుంది. సూక్ష్మ శరీరమైన, సంకల్ప వికల్ప సంఘాతమైన మనస్సు కూడా అన్నం వలననే తయారవుతుంది. ఇది ప్రాణం అత్యంత ప్రధానమైనది. ఎంతకాలం ప్రాణం లోపల తిరుగుతుంటుందో అంతకాలమే ఈ శరీరానికి పూజనీయత. ఎంతకాలం వాయువు బయటికెళ్ళి లోపలకు వస్తుంటుందో అంతకాలం మాత్రమే 'బాగున్నారా !', 'బాగున్నారా!' అని అని కుశల ప్రశ్నలు వేస్తుంటారు. లోపలికి వెళ్ళిన వాయువు బయటికి వెళ్ళకపోయినా, బయటికి వెళ్ళిన వాయువు లోపలికి పీల్చబడకపోయినా .. అక్కడితో దాని మంగళప్రదత్వం పోతుంది. అది ఇక శివం కాదు, శవం.

అటువంటి ప్రాణాన్ని పోషించగలిగేది నీరు. ప్రాణులను అన్నింటినీ కూడా పోషించగలిగిన శక్తి నీటికి ఉంటుంది. అందుకే 'అమృతం వా ఆపః' అంటారు. నీరు అమృతంగా చెప్పబడింది. పరమేశ్వరుడికి అభిషేకం చేసినప్పుడు పంచామృతాభిషేకం అంటారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, మంచినీరు.. ఇవి పంచామృతాలు. నీళ్ళు ముఖాన చిలకరిస్తే... స్పృహ తప్పిపోయినవాడికి కూడా స్పృహ, ప్రాణాలు వస్తాయి. అంటే ప్రాణాలను తిరిగి యథాస్థానంలో నిలబెట్టగలిగిన శక్తి నీటికి ఉంది.

చిట్టచివరిది వాక్కు. ఈ వాక్కు.. స్వరపేటిక పేరిట భగవంతుడిచ్చిన మహత్తరమైన కానుక. దీనిని ఆధారం చేసుకుని మనిషి తాను తరించిపోవచ్చు... ఇతరుల అజ్ఞానం పోగొట్టడానికి ఉపయోగించవచ్చు. కలియుగంలో భగవంతుని నామాన్ని పలకడం కన్నా గొప్పది మరొకటి లేదు. అది భగవంతుడిని ఉద్దేశించే పలికింది కాకపోవచ్చు. 'బిడ్డపేరుపెట్టి పిలిచిననైన విశ్రామకేళినైన పద్య గద్య గీత భావార్థములనైన కమలనయనతలుప కలుషహరము' అంటారు... భాగవతంలో. బిడ్డను దేముడి పేర్లలో ఒకటిపెట్టి పిలిచినప్పటికీ... పిలిచింది బిడ్డనే అయినా... భగవంతుడి నామాన్ని ఉచ్చరించాడు కాబట్టి పాపరాశి ధ్వంసమవుతుంది... అన్నారు. విశ్రామకేళినైన... ఆడుకునే సమయంలో ఇరుపక్షాలూ ఒకరు రాముడి పక్షమనీ, మరొకరు కృష్ణుడి పక్షమంటూ అలా పేర్లుపెట్టుకుని ఆడుకుంటూ ఆ పేర్లను ఉచ్చరించినా చాలట. పద్యమో, గద్యమో, గీతమో... ఏదయినా కావచ్చు... అది భగవంతుని నామంతో కూడుకున్నదయితే చాలు అది కలుషహరము.. కలుషాలను అన్నింటినీ పోగొట్టగలిగిన శక్తిని పొంది ఉంటుంది. అలా తనకు తాను తరించడానికే కాదు.. ఇతరుల అజ్ఞానమనే చీకటిని దహించివేయడానికి కూడా వాక్కు ఉపకరిస్తుంది ... ఎలా? వాక్కు అగ్నిహోత్రంతో సమానమైనది. అగ్నిహోత్రానికి ఉన్న లక్షణం అవతలి వస్తువును దహించి వేస్తుంది. అలాగే వాక్కుకు ఉన్న లక్షణం అవతలివారి అజ్ఞానాన్ని తొలగించేస్తుంది. తెలియని విషయం అది తెలిసినవారి దగ్గర విన్నప్పుడు.. 'నాకు తెలియదు' అన్న తెలియనితనం పోతుంది. అంత గొప్ప వాక్కు మహాత్ములయినవారి నోటివెంట వచ్చినప్పుడు దేశకాలాలతో సంబంధం లేకుండా ఎప్పటికీ అది వ్యక్తి ఉద్ధరణకు, సమాజ ఉద్ధరణకు కారణమయి ఉంటుంది. వారు దేశికులై ... అంటే మార్గనిర్దేశకులై మనం ఎటువైపు ప్రయాణం చేయాలో దిశానిర్దేశనం చేస్తుంటారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

(సశేషం).

సినిమా


● సుశాంత్, చిరంజీవి, కీర్తీ సురేశ్, అనిల్ సుంకర, మెహర్ రమేష్

రీమేక్స్ చేస్తే తప్పేంటి? - చిరంజీవి

''రీమేక్స్ చేస్తారేంటి? అని అంటుంటారు. మంచి కంటెంట్‌ని తెలుగు ప్రేక్షకులకు చూపించాలనే ప్రయత్నం మన యాక్టర్స్, దర్శకులు చేస్తే తప్పేంటో నాకు అర్థం కావడం లేదు. 'వేదాళం' సినిమా ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో లేదు. ఎవరూ చూసి ఉండరు. ఆ ధైర్యంతోనే మెహర్, అనిల్ నా వద్దకు రావడంతో 'భోళాశంకర్' చేశాను'' అని చిరంజీవి అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'భోళాశంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'భోళాశంకర్' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ– ''భోళా శంకర్' సినిమా నాకు నచ్చింది కాబట్టే చేశాను. మీకు (ప్రేక్షకులు) కూడా నచ్చుతుందనే ధైర్యంతో విడుదల చేస్తున్నాం. స్వయంకృషితో మెహర్ రమేశ్ దర్శకుడిగా ఎదిగాడు. కొత్తవారి ప్రతిభతో ఇండస్ట్రీ మరింత ఎదగాలి. ఇండస్ట్రీని నమ్ముకుని వస్తే గొప్ప లైఫ్‌ని ప్రసాదిస్తుంది. ఇండస్ట్రీ పుష్పక విమానంలాంటిది.. ఎంతమంది వచ్చినా ఇంకా చోటు మిగిలే ఉంటుంది. ఇండస్ట్రీ అక్షయ పాత్రలాంటిది. ఎంతమంది తిన్నా కూడా ఇంకా భోజనం అందిస్తుంది ఈ కళామతల్లి. కేవలం స్టార్స్ మాత్రమే ఉండే ఈ ఇండస్ట్రీలోకి బిక్కు బిక్కు మంటూ నేను ప్రవేశించాను. నా ప్రతిభపై నాకు నమ్మకం ఉంది. నా లోపల ధైర్యం ఉంది. 'కొత్త అల్లుడు' సినిమాలో ఓ చిన్న వేషం వేయమన్నారు.. బాధగా అనిపించింది కానీ చేశాను. అలాగే 'కొత్తపేట రౌడీ' సినిమాలో కృష్ణగారి పక్కన చిన్న వేషం వేయమన్నారు. ఓ వైపు 'శుభలేఖ', 'ఇంట్లో కృష్ణయ్య వీధిలో రామయ్య' వంటి సినిమాలు చేస్తున్నాను.. ఇప్పుడు ఇలాంటి రోల్స్ చేస్తే బాగుంటుందా? అంటే.. 'చేయండి సార్' అన్నారు. చేయనంటే నా భవిష్యత్ మీద ప్రభావం పడుతుందేమో అనే భయంతో చేశాను. కానీ, ఈ ఇండస్ట్రీ నన్ను ఆదరించిన దానికంటే... నన్ను ప్రోత్సహించి, భుజాన ఎత్తుకుంది, పైకి లేపింది ప్రేక్షకులు. వారికి రుణపడి ఉంటాను'' అన్నారు. ''మీరంతా (అభిమానులు) చిరంజీవిగారి సినిమాలు చూస్తూ పెరిగితే.. నేను చిరంజీవిగారితో సినిమాలు చేస్తూ పెరిగాను'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ''చిరంజీవిగారితో సినిమా చేయడాన్ని లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్‌గా భావిస్తున్నాను'' అన్నారు అనిల్ సుంకర్. ''ఒక షాడోలో ఉన్న నా మీద మెగాస్టార్ అన్నయ్య వెలుగు పడింది. 'భోళా శంకర్' నాకు దర్శకుడిగా పునర్జన్మ లాంటిది'' అన్నారు. ఈ వేడుకలో పలువురు దర్శక– నిర్మాతలు పాల్గొన్నారు.

విక్రమ్‌కు జోడీగా?


● రష్మిక మందన్నా

హీరోయిన్ రష్మికా మందన్న హీరో విక్రమ్‌కి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. 2018లో కేరళలో వచ్చిన వరదల నేపథ్యంలో '2018' అనే చిత్రం తెరకెక్కించారు డైరెక్టర్ జూడ్ ఆంథోనీ జోసెఫ్. ఈ సినిమా మలయాళంలో అద్భుత విజయాన్ని సాధించి బాక్సాఫీస్ కొత్త రికార్డులను సృష్టించింది. కాగా జూడ్ ఆంథోనీ జోసెఫ్ తన తర్వాతి చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్‌లో చేయనున్నారు. ఈ చిత్రంలో విక్రమ్ హీరోగా నటిస్తారని, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించడానికి నిర్మాత సుభాస్కరన్ సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ టాక్. ఇందులో హీరోయిన్‌గా రష్మికా మందన్న, మాళవిక మోహనన్ పేర్లు వినిపించాయి. అయితే రష్మికా మందన్న ఫైనల్ అయ్యారని, అతి త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. విక్రమ్– రష్మిక జోడీ అధికారికంగా ఓకే అయితే... కార్తీ 'సుల్తాన్', విజయ్ 'వారిసు' చిత్రాల తర్వాత రష్మికా మందన్న నటించనున్న మూడో తమిళ సినిమా ఇదే అవుతుంది.

ఇలియానా తల్లయ్యింది


● ఇలియానా


● డోలన్

హీరోయిన్ ఇలియానా తల్లయ్యింది. ఈ నెల 1న ఆమె పండంటి మగబిడ్డకు జన్మ ఇచ్చారు. ఈ విషయాన్ని ఆదివారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు ఇలియానా. అంతేకాదు.. తన కుమారుడి ఫొటోని షేర్ చేసి, కోవా ఫీనిక్స్ డోలన్ అని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. ''కోవా ఫీనిక్స్ డోలన్'ని పరిచయం చేస్తున్నాను. మా హృదయాలను దాటి ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు ఎంత హ్యాపీగా ఉన్నామో మాటల్లో వర్ణించలేం. ఇది గొప్ప అనుభూతి'' అని పోస్ట్ చేశారు ఇలియానా. కాగా రెండు వారాల క్రితం తన ప్రియుడు ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ బ్యూటీ అతని పేరు, వివరాలు మాత్రం వెల్లడించలేదు. నటీనటులు నర్గీస్ ఫక్రీ, హ్యూమా ఖురేషి, సోఫీ చౌదరి, అర్జున్ కపూర్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు, ఆమె అభిమానులు, నెటిజన్లు ఇలియానాకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త వాళ్లకి అవకాశాలు ఇవ్వండి - కె.రాఘవేంద్ర రావు

''ఈ వేదికపై ఉన్న చాలా మంది నిర్మాతలు నా సినిమాలతో స్ఫూర్తి పొందామని చెబుతుండటం సంతోషం. మీరు పెద్ద సినిమాలు చేస్తున్నారు.. అప్పుడప్పుడు చిన్న సినిమాలు చేసి కొత్తవాళ్లకి చాన్స్ ఇస్తే ఇన్నేళ్లుగా నేను చేసిన ప్రయత్నానికి కొనసాగింపుగా ఉంటుంది'' అని డైరెక్టర్ కె.రాఘవేంద్ర రావు అన్నారు. ఆకాష్ , భావనా వళపండల్ జంటగా గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'సర్కారు నౌకరి'. కె.రాఘవేంద్ర రావు నిర్మిస్తున్నారు. ఆర్కే టెలీఫిలింస్ స్థాపించి 25 ఏళ్ల అవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఓ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'సర్కారు నౌకరి' టీజర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సురేశ్ బాబు, నవీన్ యెర్నేని, టీజీ విశ్వప్రసాద్, ప్రసాద్ దేవినేని, శోభు యార్లగడ్డ, గాయని సునీత తదితరులు పాల్గొన్నారు.


● ఆకాష్, భావన, శేఖర్, కె.రాఘవేంద్ర రావు

ఎందుకురా బాబు!


● కిరణ్

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకత్వం వహించారు. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. అమ్రిష్ గణేష్ స్వరాలు అందించిన ఈ చిత్రంలోని 'ఎందుకురా బాబు.. కొంచెం ఆగరా బాబు..' అనే లిరికల్ వీడియో సాంగ్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, రేవంత్ ఆలపించగా, శిరీష్ నృత్యరీతులు సమకూర్చారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

రాబరీ నేపథ్యంలో...


● శరత్ చంద్ర, నందు

కృష్ణ మడుప్పు, ఫణి భార్గవ్, నర్సింగ్ వాడేకర్, గంగాధర్ రెడ్డి, ఫణి శర్మ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '1134'. శరత్ చంద్ర తడిమేటి దర్శకత్వంలో రాంధుని క్రియేషన్స్‌పై నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ని నటుడు నందు విడుదల చేసి, మాట్లాడుతూ–''నేను, శరత్ చంద్ర ఎప్పటి నుంచో ఫ్రెండ్స్. మాకు తరుణ్ భాస్కర్, అడివి శేష్ కులదైవం వంటి వారు. వాళ్లే జీరో బడ్జెట్ చిత్రాలను ప్రారంభించారు. ఇప్పుడు శరత్ తీసిన జీరో బడ్జెట్ సినిమా '1134' హిట్ కావాలి'' అన్నారు. ''రాబరీ నేపథ్యంలో బలమైన కథ, కథనంతో ఈ సినిమా సాగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న కుంభకోణాలను ఈ మూవీలో చూపించాను'' అన్నారు శరత్ చంద్ర తడిమేటి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ మురళి కార్తికేయ, కెమెరా: నజీబ్ షేక్, జితేందర్ తలకంటి.

రీల్స్

డెవిల్ వస్తున్నాడు


● కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ హీరోగా నటించిన స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. నవీన్ మేడారం దర్శకత్వంలో దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మించిన చిత్రం ఇది. తాజాగా ఈ సినిమాను నవంబరు 24న విడుదల చేస్తున్నట్లుగా ఆదివారం చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే ఓ బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ ఆకట్టుకోబోతున్నారు'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్థన్ రామేశ్వర్.

ప్రేమ.. వినోదం


● హృతిక, చైతన్య రావ్

'చైతన్య రావ్, హృతికా శ్రీనివాస్ జంటగా కొత్త సినిమా షురూ అయింది. సాయి తేజ దర్శకత్వంలో గౌతమ్స్ ఈగల్ ఎంటర్‌టైన్మెంట్‌పై ఎం.గౌతమ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ కూర్మాచలం కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాతలు సి.కల్యాణ్ క్లాప్ కొట్టగా, బెక్కం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ''కామెడీ, లవ్, ఎమోషన్స్.. వంటి ఆకట్టుకునే అంశాలు ఈ మూవీలో ఉంటాయి'' అన్నారు ఎం.గౌతమ్. నిర్మాత రాచాల యుగంధర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మోహన్ పున్న, లైన్ ప్రొడ్యూసర్: వంశీ కృష్ణ, కెమెరా: పీసీ మౌళి, సంగీతం: గ్యాని.

హారర్ థ్రిల్లర్


● పవిత్ర, అశ్విన్

అశ్విన్ కాకుమను, పవిత్ర మరిముత్తు, గౌరవ్ నారాయణన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పిజ్జా 3'. మోహన్ గోవింద్ దర్శకత్వంలో సీవీ కుమార్ నిర్మించిన ఈ సినిమా జూలై 28న తమిళంలో విడుదలై, హిట్ సాధించింది. ఈ చిత్రాన్ని అదే పేరుతో కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పీపై ఎంఎస్ మురళీధర్ రెడ్డి, ఆశిష్ వేమిశెట్టి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ''హారర్ అండ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'పిజ్జా 3 '' అన్నారు నిర్మాతలు.

మాస్టర్ పీస్


● మనీష్

అరవింద్ కృష్ణ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'ఎ మాస్టర్ పీస్'. సుకు పూర్వజ్ దర్శకత్వంలో సినిమా బండి ప్రొడక్షన్స్‌పై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి విలన్ పాత్రధారి మనీష్ గిలాడా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'ఎ మాస్టర్ పీస్'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్.



ఢిల్లీ ఎఫ్‌సీతో హైదరాబాద్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'

డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో గత ఏడాది సెమీఫైనల్ చేరిన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఈసారి 'డ్రా'తో ప్రారంభించింది. ఢిల్లీ ఎఫ్‌సీతో గువాహటిలో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌ను హైదరాబాద్ ఎఫ్‌సీ 1-1తో 'డ్రా' చేసుకుంది. ఆరో నిమిషంలో హిమాన్షు జాంగ్రా చేసిన గోల్‌తో ఢిల్లీ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 57వ నిమిషంలో రామ్లున్‌చుంగా చేసిన గోల్‌తో హైదరాబాద్ స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్‌ను ఈనెల 10న చెన్నైయిన్ ఎఫ్‌సీతో ఆడుతుంది.



డోపింగ్‌లో దొరికిన జస్లీన్ సింగ్

భారత జూడో ప్లేయర్ జస్లీన్ సింగ్ సైనీ డోప్ టెస్టులో విఫలమయ్యాడు. గత నెల లైపీ ఓపెన్ సందర్భంగా అతని నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలింది. 25 ఏళ్ల ఈ భారత జూడో ప్లేయర్ లైపీ ఈవెంట్‌లో 66 కేజీల కేటగిరీలో బంగారు పతకం గెలుపొందాడు. వచ్చే నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనా ఆతిథ్యమిచ్చే ఆసియా క్రీడలకు జస్లీన్ అర్హత సాధించాడు. తాజా డోపింగ్‌తో అతను జట్టులో స్థానం కోల్పోయాడు.

భారత్ ఘనవిజయం

మలేసియా 5-0తో గెలుపు



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీలో ఆతిథ్య భారత జట్టు ఖాతాలో రెండో విజయం చేరింది. మలేసియాతో ఆదివారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 5-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున సెల్వం కార్తీ (15వ ని.లో), హార్దిక్ సింగ్ (32వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ ని.లో), గుర్జంత్ సింగ్ (53వ ని.లో), జుగ్‌రాజ్ సింగ్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. భారత్‌కు మొత్తం తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లు రాగా అందులో మూడింటిని సద్వినియోగం చేసుకుంది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. ఆదివారం జరిగిన మిగతా రెండు మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి. చైనా-కొరియా 1-1తో, పాకిస్తాన్-జపాన్ 3-3తో 'డ్రా' చేసుకున్నాయి.

నాలుగో రౌండ్‌లో హంపి, అర్జున్





బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి (ఆంధ్రప్రదేశ్), ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ (తెలంగాణ), గుకేశ్, ప్రజ్ఞానంద (తమిళనాడు) నాలుగో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్‌లో హంపి 1.5-0.5తో ఓల్గా బడెల్కా (రష్యా)పై, అర్జున్ 1.5-0.5తో వ్లాదిమిర్ ఫెడోసీవ్ (స్లొవేనియా)పై, గుకేశ్ 1.5-0.5తో నారాయణన్ (భారత్)పై, ప్రజ్ఞానంద 1.5-0.5తో డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు. మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక (భారత్)-లేలా జవాఖిష్‌విలి (జార్జియా) మధ్య... ఓపెన్ విభాగంలో విదిత్ (భారత్)-మథియాస్ (జర్మనీ) మధ్య... నిహాల్ (భారత్)-బొగ్డాన్ (రొమేనియా) మధ్య జరిగిన మూడో రౌండ్ రెండు గేమ్‌లు 'డ్రా' కావడంతో వీరి మధ్య నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. భారత్‌కే చెందిన మేరీఆన్ గోమ్స్, దివ్య, వైశాలి మూడో రౌండ్‌లో నిష్క్రమించారు.

గెలుపు మలుపు విండీస్‌దే

- రెండో టి20లోనూ గెలిచిన విండీస్
- 2 వికెట్లతో భారత్ ఓటమి
- రాణించిన తిలక్, పాండ్యా, చహల్
- పూరన్ మెరుపులు
- రేపు మూడో టి20

ప్రావిడెన్స్ (గయానా): బ్యాటింగ్‌లో తిలక్‌వర్మ (41 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) ప్రతాపం చూపినా, బౌలింగ్‌లో హార్దిక్ పాండ్యా (3/35) నిప్పులు చెరిగినా, చహల్ (2/19) స్పిన్‌తో తిప్పినా... భారత్‌కు పరాజయం తప్పలేదు. ఆదివారం రెండో టి20లో విండీస్ 2 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-0తో ఆధిక్యాన్ని పెంచుకుంది. టాస్ గెలిచిన భారత్ ముందుగా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ సాధించాడు. అకిల్ హొసీన్, అల్జారి జోసెఫ్, షెఫర్డ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 18.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఆరంభంలోనే పాండ్యా ప్రత్యర్థిని దెబ్బ తీసినా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్ (40 బంతుల్లో 67; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) గెలుపుబాట వేశాడు. రేపు మూడో టి20 కూడా ఇదే వేదికపై జరుగుతుంది.

తిలక్ ఫిఫ్టీతో...

అరంగేట్రం చేసిన తొలి టి20లోనే ఆకట్టుకున్న హైదరాబాద్ యువ సంచలనం ఠాకూర్ తిలక్‌వర్మ ఈ రెండో మ్యాచ్‌లో అయితే భారత జట్టును ఆదుకున్నాడు. 18 పరుగులకే భారత్ కీలకమైన శుబ్‌మన్ గిల్ (7), సూర్యకుమార్ (1) వికెట్లను కోల్పోగా, కాసేపటికే ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సంజూ సామ్సన్ (7)లు వికెట్లను పారేసుకున్నాడు. ఈ దశలో తిలక్ తనశైలి స్కూప్, స్వీప్ షాట్లతో మైదానంతా ఫీల్డర్లను పరుగు పెట్టించాడు. కెప్టెన్ పాండ్యాతో కలిసి స్కోరుబోర్డులో వేగం పెంచిన వర్మ 39 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. అతనితో పాటు హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 24; 2 సిక్సర్లు) స్వల్ప వ్యవధిలో అవుట్ కావడంతో డెత్ ఓవర్లలో దంచి కొట్టే బ్యాటరే కరువయ్యాడు. భారీషాట్లు బాదే అక్షర్ (14) ఆట కూడా ఎంతోసేపు నిలువలేదు. దీంతో భారత్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

పూరన్ ధనాధన్

లక్ష్యఛేదన మొదలు పెట్టగానే పాండ్యా వికెట్ల భరతం పట్టడంతో తొలి ఓవర్లోనే కింగ్ (0), చార్లెస్ (2) వికెట్లను కోల్పోయిన విండీస్ కష్టాలపాలైంది. మేయర్స్ (15)ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో భారత శిబిరంలో ఎక్కడలేని ఉత్సాహం కానీ... తర్వాత పూరన్ ఉత్పాతంలా వచ్చిపడ్డాడు. భారీ సిక్సర్లు, బౌండరీలతో బంతుల అంతరాన్ని అమాంతం తగ్గించేశాడు. 126/4 స్కోరు వద్ద గెలుపుబాటలో కనిపించింది. కానీ ఆ స్కోరువద్దే పూరన్ జోరుకు ముకేశ్ కళ్లెం వేశాడు. ఈ దశలో చహల్ స్పిన్ మ్యాజిక్‌తో హెట్‌మైర్ (22 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్), హోల్డర్ (0)లను అవుట్ చేశాడు. 3 పరుగుల వ్యవధిలో 4 వికెట్లను కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం భారత్‌వైపు మలుపు తిరిగేలా కనిపించింది. కానీ హొసీన్ (16 నాటౌట్; 2 ఫోర్లు), జోసెఫ్ (10 నాటౌట్; 1 సిక్స్) తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 26 పరుగులు జోడించి టీమిండియాకు గెలుపు అవకాశమివ్వకుండా ఇంకా 7 బంతులు మిగిలుండగానే విండీస్‌ను విజయ తీరానికి చేర్చారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్



తిలక్ వర్మ

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (బి) షెఫర్డ్ 27; గిల్ (సి) హెట్‌మైర్ (బి) జోసెఫ్ 7; సూర్యకుమార్ (రనౌట్) 1; తిలక్ వర్మ (సి) మెకాయ్ (బి) హొసీన్ 51; సంజూ సామ్సన్ (స్టంప్డ్) పూరన్ (బి) హొసీన్ 7; పాండ్యా (బి) జోసెఫ్ 24; అక్షర్ (సి) పూరన్ (బి) షెఫర్డ్ 14; రవి బిష్ణోయ్ (నాటౌట్) 8; అర్ష్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1-16, 2-18, 3-60, 4-76, 5-114, 6-129, 7-139. **బౌలింగ్:** మెకాయ్ 4-0-25-0, హొసీన్ 4-0-29-2, జోసెఫ్ 4-0-28-2, హోల్డర్ 4-0-29-0, షెఫర్డ్ 3-0-28-2, మేయర్స్ 1-0-12-0.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 0; మేయర్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 15; చార్లెస్ (సి) తిలక్ వర్మ (బి) పాండ్యా 2; పూరన్ (సి) సామ్సన్ (బి) ముకేశ్ 67; పావెల్ (సి) ముకేశ్ (బి) పాండ్యా 21; హెట్‌మైర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 22; షెఫర్డ్ (రనౌట్) 0; హోల్డర్ (స్టంప్డ్) ఇషాన్ (బి) చహల్ 0; హొసీన్ (నాటౌట్) 16; జోసెఫ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.5 ఓవర్లలో 8 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-0, 2-2, 3-32, 4-89, 5-126, 6-128, 7-128, 8-129. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-35-3 అర్ష్‌దీప్ 4-0-34-1, ముకేశ్ 3.5-0-35-1, బిష్ణోయ్ 4-0-31-0, చహల్ 3-0-19-12.

ప్రణయ్... రన్నరప్‌తో సరి

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓటమి
- చివరి గేమ్‌లో 5 పాయింట్ల ఆధిక్యాన్ని వృథా చేసుకున్న భారత స్టార్



సిడ్నీ: ఈ ఏడాది రెండో టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో కేరళకు చెందిన ప్రణయ్ రన్నరప్‌గా నిలిచాడు. 90 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 9-21, 23-21, 20-22తో ప్రపంచ 24వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఈ ఏడాది మేలో మలేసియా మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో వెంగ్ హాంగ్ యాంగ్‌ను ఓడించి టైటిల్ నెగ్గిన ప్రణయ్ ఈసారి మాత్రం అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు. తొలి గేమ్‌ను చేజార్చుకున్న ప్రణయ్ రెండో గేమ్‌లో తేరుకున్నాడు. పోటాపోటీగా సాగిన ఈ గేమ్‌లో పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. చివరకు స్కోరు 21-21 వద్ద వెంగ్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్ బయటకు వెళ్లింది. అనంతరం ప్రణయ్ నెట్ వద్ద పాయింట్ గెలిచి గేమ్‌ను దక్కించుకున్నాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో ప్రణయ్ దూకుడుగా ఆడి 19-14తో ఐదు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. అయితే వెంగ్ హాంగ్ యాంగ్ అసమాన పోరాటంతో కోలుకున్నాడు. స్కోరు 19-17 వద్ద ఏకంగా 71 షాట్‌ల ర్యాలీ సాగింది. చివరకు ప్రణయ్ కొట్టిన షాట్ నెట్‌కు తగలడంతో పాయింట్ వెంగ్ ఖాతాలోకి వెళ్లింది. అనంతరం వెంగ్ డ్రాప్ షాట్‌తో పాయింట్ గెలిచి స్కోరును 19-19తో సమం చేశాడు. ఆ తర్వాత ప్రణయ్ పాయింట్ సాధించి విజయానికి ఒక పాయింట్ దూరంలో నిలిచాడు. కానీ పట్టువదలని వెంగ్ మళ్లీ స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత వెంగ్ వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. విజేత వెంగ్ హాంగ్ యాంగ్‌కు 31,500 డాలర్ల (రూ. 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ ప్రణయ్‌కు 15,960 డాలర్ల (రూ. 13 లక్షల 19 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ప్రపంచకప్ కోసం భారత్‌కు పాక్

పాకిస్తాన్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

కరాచీ: కొన్నాళ్లుగా... భారత్ ఆతిథ్యమిచ్చే ప్రపంచ కప్‌కు రాం రాం, భారత్‌లో ఆడబోం అంటూ మేకపోతు గాంభీర్యానికి పోయిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఇప్పుడు ఆడేందుకు రెడీ అయ్యింది. క్రికెట్ లోకం కంటపడేందుకు, ఎక్కడలేని సస్పెన్స్ క్రియేట్ చేసేందుకు ప్రయత్నించిన పీసీబీ ఇంకో మాట మాట్లాడకుండా వచ్చేందుకు సై అంటోంది. ఈ మేరకు ఆదివారం పాకిస్తాన్ ప్రభుత్వం భారత్‌లో ఆడేందుకు పచ్చజెండా ఊపింది. ద్వైపాక్షిక సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టబోమని పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ క్రికెట్ టోర్నీల్లో తమ జట్టు ఎప్పటిలాగే పాల్గొంటుందని, తమ దేశం నిర్మాణాత్మక, బాధ్యతాయుత విధానాన్ని అవలంభిస్తుందనేదానికి తమ నిర్ణయమే నిదర్శనమని అందులో పేర్కొంది. భారత్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు భద్రతకు ఢోకా ఉండబోదనే ఆశిస్తున్నట్లు తెలిపింది.



రన్నరప్ రిత్విక్-అర్జున్ జోడీ

లిస్బన్: పోర్టో ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ రిత్విక్ చౌదరీ బొల్లిపల్లి-అర్జున్ ఖడే (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. పోర్చుగల్‌లో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రిత్విక్ చౌదరీ-అర్జున్ ద్వయం 7-6 (7/5), 3-6, 5-10తో తొషిహిడె మత్సుయ్-కైటో యుసుగి (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ టెట్-2023

తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ).. తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టీఎస్ టెట్) 2023 నోటిఫికేషన్ విడుదలచేసింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులు కావాలంటే.. టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. ఇందులో అర్హత సాధిస్తేనే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) రాయడానికి అర్హులు.

» **అర్హత:** డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన వారితోపాటు ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా పరీక్షకు హాజరుకావచ్చు.
» **పరీక్ష విధానం:**టెట్‌లో రెండు పేపర్లు ఉంటాయి. 1 నుంచి 5 తరగతులకు బోధించేందుకు పేపర్-1 రాయాలి. పేపర్-1ను డీఈడీ అభ్యర్థులతోపాటు బీఈడీ అభ్యర్థులకు కూడా జాతీయ ఉపాధ్యాయ మండలి(ఎన్‌సీటీఈ) అనుమతి ఇచ్చింది. పేపర్-2 రాసేందుకు కేవలం బీఈడీ పూర్తిచేసిన వారే అర్హులు. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు.
» **అర్హత మార్కులు:** జనరల్ కేటగిరీలో 90, బీసీలు-75,ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 60 మార్కులు సాధిస్తే అర్హత లభిస్తుంది. వారే టీఆర్‌టీ రాసేందుకు అర్హులవుతారు. టెట్ మార్కులకు 20 శాతం, టీఆర్‌టీలో వచ్చిన మార్కులకు 80 శాతం వెయిటేజీ ఇచ్చి అభ్యర్థులకు తుది ర్యాంకు నిర్ణయిస్తారు.

ముఖ్య సమాచారం

» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 16.08.2023
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీలు:** 09.09.2023 నుంచి 14.09.2023 వరకు;
» **పరీక్ష తేది:** 15.09.2023.
» **ఫలితాల వెల్లడి:** 27.09.2023
» **వెబ్‌సైట్:** tstet.cgg.gov.in

ఐబీపీఎస్- 3,049
పీవో/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్ పీవో/XIII 2024-25) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3049
» **బ్యాంక్‌ల వారీగా ఖాళీలు:** బ్యాంక్ ఆఫ్ బరోడా-ఎన్ఆర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా -224, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర-ఎన్ఆర్, కెనరా బ్యాంక్-500, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-2000, ఇండియన్ బ్యాంక్-ఎన్ఆర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ -ఎన్ఆర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్-200, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్-125, యూకో బ్యాంక్-ఎన్ఆర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -ఎన్ఆర్.
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ రాతపరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరితేది:** 21.08.2023.
» **ప్రిలిమినరీ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** సెప్టెంబర్ 2023.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** సెప్టెంబర్/అక్టోబర్ 2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

ఐబీపీఎస్-1402
స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-XIII) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1402
» **పోస్టుల వివరాలు:** ఐటీ ఆఫీసర్(స్కేల్-1)-120, అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్ (స్కేల్-1)-500, రాజ్‌భాష అధికారి(స్కేల్-1)-41, లా ఆఫీసర్(స్కేల్-1)-10, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1)-31, మార్కెటింగ్ ఆఫీసర్ (స్కేల్-1)-700.
» **రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే బ్యాంకులు:** బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర,కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్,పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీ,పీజీ ఉండాలి.
» **వయసు:** 01.8. 2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023.
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్(ప్రిలిమినరీ పరీక్ష):** డిసెంబర్ 2023.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు:** 30.12.2023/31.12.2023.
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేంద్రంలో జూనియర్ ఇంజనీర్

» కేంద్ర ప్రభుత్వ శాఖల్లో జేఈ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో 1,324 పోస్టులు
» డిప్లొమా, బీటెక్ అర్హతతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకాలు
» ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వేతనం



ఎస్ఎస్‌సీ జాబ్స్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో.. జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.ఎనిమిది విభాగాల్లో మొత్తం 1,324 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్-2023 వివరాలు, విభాగాల వారీగా పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్‌తో ప్రత్యేక కథనం..

8 విభాగాలు.. 1,324 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జూనియర్ ఇంజనీర్(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్స్) ఎగ్జామ్-2022 ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎనిమిది విభాగాలు/శాఖల్లో 1,324 జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2023 నాటికి సంబంధిత బ్రాంచ్‌లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లతో బీటెక్ లేదా డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ వాటర్ కమిషన్‌లకు మాత్రం గరిష్ఠ వయోపరిమితిని 32ఏళ్లుగా పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు,ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

అనుభవం

జూనియర్ ఇంజనీర్ పోస్టులకు సంబంధించి కొన్ని విభాగాలకు పని అనుభవం తప్పనిసరని పేర్కొన్నారు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లోని పోస్టుల విషయంలో సివిల్ ఇంజనీరింగ్ పోస్టులకు రెండేళ్లు, ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ పోస్టులకు మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

ప్రారంభ వేతనం రూ.60వేలు

ఎంపికైన అభ్యర్థులకు ఏడో వేతన సంఘం ప్రకారం-పే లెవల్-6లో రూ.35,400 - రూ.1,12,400 వేతన శ్రేణి అందుతుంది. అంటే ప్రారంభంలోనే నెలకు రూ.60 వేల వరకు వేతనం లభిస్తుంది. భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంది.

ఎంపిక విధానం

ఆయా పోస్టులకు సంబంధించి రాత పరీక్షను నిర్వహిస్తారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలోనూ పొందిన మార్కుల ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు. దరఖాస్తులో పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా విభాగాల్లో ఉన్న ఖాళీలు, రిజర్వేషన్లు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేసి సంబంధిత శాఖలు, విభాగాలకు పంపుతారు. ఆ తర్వాత సంబంధిత శాఖల్లో నిర్దిష్ట కాల వ్యవధిలో అంతర్గత శిక్షణనిస్తారు. దాన్ని పూర్తి చేసుకున్న వారికి విధులు కేటాయిస్తారు.

రాత పరీక్ష రెండు పేపర్లుగా

- రాత పరీక్షలో రెండు పేపర్లు (పేపర్-1, పేపర్-2) ఉంటాయి.
- పేపర్-1ను మూడు విభాగాలుగా 200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో-జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, మరో వంద మార్కులకు అభ్యర్థులు పోటీ పడే జనరల్ ఇంజనీరింగ్ విభాగం(పార్ట్ ఏ/పార్ట్ బీ/పార్ట్ సీ) పరీక్ష ఉంటుంది.
- అభ్యర్థులు తాము డిప్లొమా లేదా బీటెక్‌లో చదివిన బ్రాంచ్‌కు అనుగుణంగా పార్ట్-ఎ లేదా పార్ట్-బి లేదా పార్ట్-సిలలో ఏదో విభాగంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి.

పేపర్-2.. 300 మార్కులు

- పేపర్-1లో పొందిన మార్కులను నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా క్రోడీకరించి కటాఫ్ స్కోర్లను నిర్ణయిస్తారు. ఆ తర్వాత అందుబాటులో ఉండే పోస్టుల సంఖ్య ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి పేపర్-2కు అర్హత లభిస్తుంది.
- పేపర్-2ను కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్‌గా 100 ప్రశ్నలు-300 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్-ఎ జనరల్ ఇంజనీరింగ్(సివిల్ అండ్ స్ట్రక్చరల్), పార్ట్-బి జనరల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్), పార్ట్-సి జనరల్ ఇంజనీరింగ్ (మెకానికల్) పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా సంబంధిత సబ్జెక్ట్ విభాగంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.

టెక్నికల్ నాలెడ్జ్‌తో విజయం

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే నియామకాలు ఖరారు చేయనున్న నేపథ్యంలో.. అభ్యర్థులు సంబంధిత టెక్నికల్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాల్సిన ఆవశ్యకత నెలకొంది. అందుకోసం డిప్లొమా, బీటెక్ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి.

సివిల్ ఇంజనీరింగ్

బిల్డింగ్ మెటీరియల్స్, ఎస్టిమేటింగ్, కాస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, సర్వేయింగ్, సాయిల్ మెకానిక్స్, హైడ్రాలిక్స్, ఇరిగేషన్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా.. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి స్ట్రక్చర్స్ థియరీ, కాంక్రీట్ టెక్నాలజీ, ఆర్‌సీసీ డిజైన్, స్టీల్ డిజైన్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

బేసిక్ కాన్సెప్ట్స్‌తోపాటు సర్క్యూట్ లా, మ్యాగ్నటిక్ సర్క్యూట్, ఏసీ ఫండమెంటల్స్, మెజర్‌మెంట్ అండ్ మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్, ఫంక్షనల్ కిలోవాట్ మోటార్స్ అండ్ సింగిల్ ఫేజ్ మోటార్స్, సింక్రనస్ మెషీన్స్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, ఎస్టిమేషన్ అండ్ కాస్టింగ్, యుటిలైజేషన్ అండ్ ఎలక్ట్రికల్ ఎనర్జీ, బేసిక్ ఎలక్ట్రానిక్స్‌పై పట్టు సాధించాలి.

మెకానికల్ ఇంజనీరింగ్

థియరీ ఆఫ్ మెషీన్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెకానిక్స్, స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ప్యూర్ సబ్‌స్టాన్సెస్, ఫస్ట్ అండ్ సెకండ్ లా ఆఫ్ థర్మోడైనమిక్స్, ఎయిర్ స్టాండర్డ్ సైకిల్స్ ఫర్ ఐసీ ఇంజన్స్, ఐసీ ఇంజన్ పెర్ఫార్మెన్స్, ఐసీ ఇంజన్స్ కంబస్టన్, ఐసీ ఇంజన్ కూలింగ్ అండ్ లూబ్రికేషన్, ఫ్లూయిడ్ స్టాటిక్స్, ఫ్లూయిడ్ ప్రెజర్, ఫ్లూయిడ్ కైనమాటిక్స్, డైనమిక్స్ ఆఫ్ ఫ్లూయిడ్స్, మెజర్‌మెంట్ ఆఫ్ ఫ్లో రేట్, బేసిక్ ప్రిన్సిపుల్స్, హైడ్రాలిక్ టర్బైన్స్, సెంట్రిఫ్యుగల్ పంప్స్, క్లాసిఫికేషన్ ఆఫ్ స్టీల్ తదితర కోర్ మెకానికల్ అంశాలను అధ్యయనం చేయాలి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

అభ్యర్థులు ఇంజనీరింగ్ పేపర్లలో మెరుగైన మార్కుల కోసం ఆయా సబ్జెక్ట్‌లలోని ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, నియమాలు, ధర్మాలు(ప్రాపర్టీస్) వంటి అంశాలను చదువుతూఅన్వయ నైపుణ్యం అలవర్చుకోవాలి. అప్పుడే పరీక్షలో ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఉమ్మడి టాపిక్స్‌కు ఇలా

పేపర్-1లో ఉమ్మడి సబ్జెక్ట్‌లుగా పేర్కొన్న జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌లో రాణించడానికి ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించాలి. జనరల్ అవేర్‌నెస్ కోసం చరిత్ర, భారత రాజ్యాంగం, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ,కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాలను చదవాలి. ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ దశలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జాగ్రఫీకి సంబంధించి దేశ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, అడవులు, పర్వతాలు, సముద్ర తీర ప్రాంతాలు తదితర అంశాలను తెలుసుకోవాలి. రాజ్యాంగానికి సంబంధించి ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు, తాజా సవరణలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ విషయంలో తాజాగా దేశ శాస్త్ర, సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, రక్షణ వ్యవస్థ, ఇస్రో తదితర సంస్థల ప్రయోగాల గురించి అధ్యయనం చేయాలి.

- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్‌లో రాణించడానికి.. నంబర్ సిరీస్, కోడింగ్ – డీకోడింగ్ నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్, స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 16.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణలకు అవకాశం:** ఆగస్ట్ 17, 18 తేదీల్లో..
- **పేపర్-1 (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) తేదీ:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు,కాకినాడ,కర్నూలు,నెల్లూరు,రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	481	65,721
నిఫ్టీ ▲	136	19,517

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,909	▽	50
డోజోన్స్	35,066	▽	150
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,564	▲	35
డాక్స్	15,952	▲	58
షాంఘై	3,288	▲	8
నికాయ్	32,193	▲	33

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఎలా ఉన్నా 'బంగారమే'




- ఫిజికల్, డిజిటల్ బంగారంతో అనుకూలతలు
- అవసరాల్లో వేగంగా సొమ్ము చేసుకోవచ్చు
- తక్కువ వడ్డీకే బ్యాంక్ రుణాలు
- ఇంట్లో ఉంటే హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి
- బ్యాంక్ లాకర్‌లోనూ భద్రమే
- అవసరమైనంత మేరకే భౌతిక బంగారం
- భవిష్యత్తు, పెట్టుబడుల కోసమైతే డిజిటల్

బంగారం అంటే ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడమే ఎక్కువ మందికి తెలిసిన విషయం. కానీ, నేడు డిజిటల్ రూపంలోనూ ఎన్నో సాధనాలు అందుబాటులో ఉన్నాయి. సార్వభౌమ బాండ్లు, డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు గురించి తెలిసింది తక్కువ మందికి. ఇటీవలి కాలంలో ప్రచారం కారణంగా డిజిటల్ బంగారం సాధనాల పట్ల అవగాహన పెరుగుతోంది. భౌతిక రూపంలో కంటే డిజిటల్ రూపంలో కొనుగోలు చేయడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతుంటారు. అలా అని బంగారం ఆభరణాలు, కాయిన్లు కొనడానికి దూరంగా ఉండాలని కాదు. డిజిటల్ సాధనాలు వచ్చినప్పటికీ బంగారం ఆభరణాల రూపంలో పెద్ద మొత్తంలో విక్రయం అవుతూనే ఉంది. నిజానికి డిజిటల్‌గానూ, భౌతికంగానూ ఏ రూపంలో ఉన్నప్పటికీ పసిడికి ఉన్న డిమాండ్ ఎంతో ప్రత్యేకం. భౌతిక బంగారంతోనూ కొన్ని అనుకూలతలు ఉన్నాయి. అవేంటో తెలియజేసే కథనమే ఇది.

బంగారం ఆభరణాలు, వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తయారీ చార్జీలు, తరుగు విధిస్తుంటారు. తయారీలో వృథాగా పోయే మొత్తాన్ని కస్టమర్ నుంచే వర్తకులు రాబడుతుంటారు. కనుక పెట్టుబడి కోసం చూసేవారు, భవిష్యత్తులో ఆభరణాల కోసమని కొంచెం, కొంచెం సమకూర్చుకునే వారు డిజిటల్ బంగారానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తుంటారు. డిజిటల్‌గా ఉంటే బంగారం భద్రంగా దాచుకునేందుకు లాకర్ల అవసరం ఉండదని చెబుతుంటారు. బంగారం తీసుకెళ్లి బ్యాంక్ లాకర్లలో పెట్టడం ద్వారా రక్షణ పొందొచ్చు. కానీ ఏటా లాకర్ నిర్వహణ చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుంది. డిజిటల్ రూపంలో ఉంటే కనిపించే ప్రయోజనాలు ఇవి. అలా అని భౌతిక బంగారం అవసరం లేదా? బంగారాన్ని భౌతిక రూపంలో కలిగి ఉంటే ప్రయోజనం లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం అన్ని అంశాలను సమగ్రంగా తెలుసుకోవాల్సిందే.

వినియోగ డిమాండ్

చారిత్రకంగా చూస్తే.. ఆభరణాల కోసం విస్తృతంగా వినియోగించడం వల్లే బంగారానికి ఈ స్థాయి విలువ సమకూరింది. అందుకే బంగారం ధరలను వినియోగం ప్రభావితం చేస్తుంటుంది. కాలక్రమేణా ఇన్వెస్టర్లు తమ సంపద విలువను కాపాడుకునే సాధనంగానూ ఇది మారిపోయింది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే హెడ్జింగ్ సాధనంగా అవతరించింది. పెట్టుబడుల పరంగా డిజిటల్ బంగారాన్ని ఎంతో ప్రోత్సహించినప్పటికీ, అదే సమయంలో భౌతిక రూపంలో బంగారానికి అంతకంటే డిమాండ్ ఎక్కువేనని చెప్పుకోవాలి. అన్ని దేశాల సెంట్రల్ బ్యాంకులు తమ మారకం నిల్వల్లో కొంత మొత్తాన్ని భౌతిక బంగారం రూపంలోనే నిర్వహిస్తుంటాయి. ఆర్థిక అనిశ్చితుల్లో దీన్ని రక్షణ సాధనంగా పరిగణిస్తుంటారు. అందుకే దశాబ్దాలు గడిచినా బంగారం డిమాండ్ పెరుగుతోంది.



లిక్విడిటీ సాధనం

పెట్టుబడి సాధనం ఏదైనా కానీయండి, అందులో లిక్విడిటీకి ప్రాధాన్యం ఇవ్వడం అన్నింటికంటే ముఖ్యమైన అంశం అవుతుంది. బంగారం విషయంలో లిక్విడిటీకి (కావాల్సినప్పుడు వెంటనే నగదుగా మార్చుకోవడం) ఢోకా ఉండదు. ఆభరణాల వర్తకుడి వద్దకు వెళ్లి సులభంగా విక్రయించుకోవచ్చు. బంగారం డిజిటల్, భౌతికం ఏ రూపంలో ఉన్నా లిక్విడిటీకి ఇబ్బంది దాదాపుగా ఉండదు. ''బంగారం ఆభరణాలపై బ్యాంకులు తక్కువ వడ్డీ రేటుకే రుణాలు ఇస్తుంటాయి. అవే బ్యాంకులు వజ్రాలపై రుణాలను ఇవ్వవు'' అని ఇండియా బులియన్ అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ సురేంద్ర మెహతా తెలిపారు. భౌతిక బంగారం అయితే గంటలోపే దాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు. లేదంటే పనిదినాల్లో అయితే బ్యాంక్‌కు వెళ్లి గంట, రెండు గంటల్లోనే రుణాన్ని పొందొచ్చు. కానీ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో విక్రయించిన తర్వాత సొమ్ము చేతికి అందాలంటే రెండు రోజులు పడుతుంది. సావరీన్ గోల్డ్ బాండ్‌లో పెట్టుబడుల కాలవ్యవధి ఎనిమిదేళ్లు. కానీ, ఐదేళ్ల తర్వాతే విక్రయించుకోవచ్చు. సెకండరీ మార్కెట్లో ఎప్పుడైనా విక్రయించుకోవచ్చు కానీ లిక్విడిటీ చాలా తక్కువగా ఉంటుంది. కొన్ని బ్యాంకులు సావరీన్ గోల్డ్‌బాండ్‌పైనా రుణం ఇస్తున్నాయి. విలువ పరంగానే కాదు, భౌతిక బంగారంతో భావోద్వేగమైన బంధం కూడా ఉంటుందన్నది నిజం. ఒకవైపు పెట్టుబడికి, మరోవైపు ఆడంబర సాధనంగా వినియోగించే ఏకైక కమోడిటీ బంగారమే. భౌతిక రూపంలో బంగారాన్ని తమ గౌరవ చిహ్నంగానూ భావిస్తుంటారు. డిజిటల్ గోల్డ్‌తో ఇది రాదు.



ఊహించని పరిస్థితులు ఎదురైనప్పుడు బంగారం ఆదుకునే సాధనంగా పూర్వ కాలం నుంచి గుర్తింపు ఉంది. కరోనా వంటి విపత్తులు ఎదురైనప్పుడు చాలా మందిని ఈ బంగారమే ఆదుకుందని మెహతా పేర్కొన్నారు. బంగారాన్ని బులియన్ రూపంలో (ఆభరణం కాకుండా) కలిగి ఉంటే అప్పుడు తయారీ చార్జీల రూపంలో నష్టపోయేదేమీ ఉండదు. అవసరమైనప్పుడు బులియన్ గోల్డ్‌ను ఆభరణాలుగా మార్చుకోవచ్చు. అలా సమకూర్చుకున్న బులియన్ గోల్డ్, బంగారం కాయిన్లను భవిష్యత్తులో వివాహ సమయాల్లో ఆభరణాల కోసం వినియోగించుకోవచ్చు. భౌతిక బంగారానికి ఉన్న ఒకే ఒక రిస్క్ భద్రత. అందుకని భద్రత కోసం బ్యాంక్ లాకర్‌ను ఆశ్రయించొచ్చు. లేదంటే ఇంట్లోనే ఆభరణాలను ఉంచుకునేట్టు అయితే, హోమ్ ఇన్సూరెన్స్ తీసుకుని వాటికి రక్షణ కల్పించుకోవాలి. బ్యాంక్ లాకర్‌కు వార్షిక నిర్వహణ చార్జీలు, హోమ్ ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం రూపంలో

డిజిటల్, భౌతిక బంగారం రెండింటిలోనూ అనుకూలతలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. ఆభరణాలు, కాయిన్లు, అలాగే డిజిటల్ గోల్డ్ సాధనాల రూపంలో పెట్టుబడులు కలిగి ఉండాలన్నది కొందరు నిపుణుల ఇచ్చే సూచన. ఒక వ్యక్తి తన మొత్తం పెట్టుబడుల్లో 5–15 శాతం మధ్య పసిడికి కేటాయించుకోవచ్చు. ఉదాహరణకు పోర్ట్‌ఫోలియోలో 10 శాతాన్ని బంగారానికి కేటాయించారని అనుకుందాం. ఇప్పుడు ఈ

ఎంత.. ఏ రూపంలో..?

10 శాతంలో కొంత డిజిటల్ గోల్డ్, కొంత భౌతిక బంగారం రూపంలో ఉండాలి. భౌతికంగా అంటే ఆభరణాలా లేక కాయిన్లా? అన్నది తమ వ్యక్తిగత అవసరాలు, అభిరుచుల ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఆభరణాల రూపంలో అయితే అవసరమైన వాటికే పరిమితం కావాలి. మిగిలినది కాయిన్లు, బార్ల రూపంలో కలిగి ఉండాలి. దీనివల్ల తయారీ, తరుగు చార్జీలను ఆదా చేసుకోవచ్చు. భవిష్యత్తులో పిల్లల వివాహాల కోసం భౌతిక రూపంలోనే పసిడిని పోగేసుకునే వారు ఆభరణాలకు బదులు కాయిన్లు కొనుగోలు చేసుకోవడం నయం. ఎందుకంటే ఆభరణాల రూపంలో కొనుగోలు చేసినా, భవిష్యత్తులో వాటిని మళ్లీ కొత్త ఆభరణాల కోసం మార్చుకోవాల్సి వస్తుంది. కనుక భవిష్యత్తులో అదే రూపంలో వినియోగించనప్పుడు ఆభరణాలు తీసుకోవడం సరికాదు. అంతేకాదు భవిష్యత్తు కోసం లేదంటే అత్యవసరాల్లో ఆదుకుంటుందన్న ఉద్దేశంతో బంగారాన్ని సమకూర్చుకునే వారు ఆభరణాల రూపంలో కాకుండా వేరే మార్గాన్ని పరిశీలించాలి. ఎందుకంటే అవసరం వచ్చినప్పుడు విక్రయించేట్టు అయితే వర్తకులు ఆ ఆభరణాల నుంచి కొంత మొత్తాన్ని చార్జీల పేరుతో మినహాయించుకుంటారు. రోజువారీ ధరించేవి, పెళ్లిళ్లు, ముఖ్య వేడుకల సందర్భంగా ధరించేవి, ఇతరులకు బహుమానంగా ఇచ్చేవి మినహా మిగిలినదంతా డిజిటల్ సాధనాల రూపంలో తీసుకోవడాన్ని పరిశీలించాలి. పెట్టుబడి దృష్ట్యా డిజిటల్ సాధనాలు మెరుగైనవి. ఎందుకంటే వీటి క్రయ, విక్రయాలు చాలా సులభంగా, వేగంగా చేసుకోవచ్చు. డిజిటల్ గోల్డ్‌ను సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ప్రతీ నెలా కొనుగోలు చేసుకుంటూ, అలా సమకూరిన పసడిని అవసరమైనప్పుడు ఆభరణాలుగా మార్చుకోవచ్చు. కొందరు అయితే ప్రతీ నెలా తమకు తోచినంత కాయిన్ల రూపంలో సమకూర్చుకుని, అవసరమైనప్పుడు వాటిని ఆభరణాలుగా మార్చుకుంటుంటారు. కనుక ప్రతి ఒక్కరూ తమ పోర్ట్‌ఫోలియోలో డిజిటల్, భౌతిక బంగారానికి చోటు కల్పించుకోవడం సరైనదేనన్నది నిపుణుల సూచన. డిజిటల్ సాధనాల్లో సావరీన్ గోల్డ్ బాండ్‌లో ఎలాంటి వ్యయాలు, ఖర్చులు ఉండవు. పైగా బంగారం పెట్టుబడి విలువపై ఎనిదేళ్ల పాటు ఏటా 2.5 శాతం వడ్డీ కూడా లభిస్తుంది. డిజిటల్‌గా ఇది మెరుగైన సాధనం.

ఆదుకునే సాధనం

కొంత వ్యయం చేయాల్సి వస్తుంది. కాకపోతే ఈ చార్జీలు మరీ అంత ఎక్కువా? అన్నది ఒక్కసారి సమీక్షించుకోవాలి. ఎందుకంటే ఇతర రూపాల్లోని బంగారంలోనూ కొంత వ్యయాలు ఉంటుంటాయి. ''డిజిటల్ గోల్డ్ రూపంలోనూ చార్జీలు ఉంటాయి. కనుక ఇక్కడ చార్జీలనేవి ప్రధాన అంశం కాబోదు. కాకపోతే, భౌతిక రూపంలోని బంగారాన్ని నిల్వ చేసుకోవడంలోనే సమస్యలు. కానీ, చాలా మందికి భౌతిక బంగారం సౌకర్యాన్నిస్తుంది. ఇది డిజిటల్ గోల్డ్ వల్ల రాదు''అని మై వెల్త్ గ్రోత్ సంస్థ వ్యవస్థాపకుడు హర్షద్ చేతన్‌వాలా పేర్కొన్నారు. అన్ని ముఖ్య వేడుకలు, శుభ కార్యక్రమాలకు బంగారం ఆభరణాలను ధరించడాన్ని చాలా మంది గొప్పగా భావిస్తుంటారు. ప్రియమైన వారిని సంతోష పెట్టేందుకు బంగారం మించిన సాధనం లేదన్నది మెహతా అభిప్రాయం. డిజిటల్, వర్చువల్ రూపంలోని బంగారంతో అంత సంతోషం రాదు. కనుక బ్యాంక్ లాకర్ లేదా బీమా ప్రీమి యం అనేది పెద్ద అంశం కాబోదని చేతన్ వాలా అభిప్రాయపడ్డారు.

''అత్యవసర పరిస్థితులు ఏర్పడితే భౌతిక రూపంలోని బంగారాన్ని వెంటనే విక్రయించుకోవచ్చు. కాయిన్ లేదా ఆభరణం ఏ రూపంలో ఉందన్నది కీలకం అవుతుంది. ఆభరణాల రూపంలో అయితే జ్యుయలర్ కొంత మొత్తాన్ని చార్జీల రూపంలో మినహాయించుకోవచ్చు. డిజిటల్ గోల్డ్‌ను సైతం వెంటనే మానిటైజ్ (నగదుగా మార్చుకోవడం) చేసుకోవచ్చు. ఎక్స్ఛేంజ్‌లో విక్రయించినప్పుడు ఆ మొత్తం బ్యాంక్ ఖాతాకు వచ్చి జమ అవుతుంది''అని చేతన్ వాలా వివరించారు.

జియో ఫైనాన్షియల్ లిస్టింగ్ త్వరలో..

- చైర్మన్‌గా అంబానీ పదవీ కాలం పెంపు
- రిలయన్స్ వార్షిక నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: రిటైల్, టెలికం రంగాల్లో సంచలనాలు సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా ఆర్థిక రంగంలోనూ అదే తీరును కొనసాగించడంపై దృష్టి పెడుతోంది. త్వరలోనే జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయనున్నట్లు సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించారు. తద్వారా సంస్థ పూర్తి విలువను, సామర్థ్యాలను వెలికి తీసే అవకాశం ఉంటుందని సంస్థ వార్షిక నివేదికలో పేర్కొన్నారు. పర్యావరణ అనుకూల ఇంధనాలపైనా భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సాంప్రదాయ శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధన వనరులకు మళ్లడమనేది చరిత్రలోనే కీలక మైలురాయిగా నిలవగలదని అంబానీ తెలిపారు. అటు మరో అయిదేళ్ల పాటు అంబానీని సీఎండీగా కొనసాగించాలన్న ప్రత్యేక తీర్మానానికి షేర్‌హోల్డర్ల ఆమోదాన్ని కంపెనీ కోరింది. ప్రస్తుతం 66 ఏళ్లున్న అంబానీ.. సంస్థ నిబంధనల ప్రకారం 70 ఏళ్లకు రిటైర్ కావాలి. అంతకు మించిన కాలవ్యవధికి కొనసాగించదల్చుకుంటే దానికి ప్రత్యేక తీర్మానం చేయాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-8-2023	
విశాఖ	450-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	72.00
6-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.85

హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ | యూఎల్‌జేకే సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 142 టార్గెట్: రూ. 185

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో పటిష్ట ఫలితాలు సాధించింది. క్యూ1లో వార్షికంగా నికర లాభం 123 శాతం దూసుకెళ్లి రూ. 86 కోట్లను అధిగమించింది. త్రైమాసికవారీగా(గతేడాది క్యూ4(జనవరి–మార్చి)తో) సైతం 13 శాతం వృద్ధి చూపింది. నిర్వహణ లాభం(ఇబిటా) 87 శాతం జంప్‌చేసి రూ. 134 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా 7 శాతం పుంజుకుంది. అయితే మొత్తం ఆదాయం 9 శాతం క్షీణించి రూ. 951 కోట్లకు పరిమితమైంది. త్రైమాసికంగానూ 8 శాతం వెనకడుగు వేసింది. కాగా.. ఇటీవల ఆస్ట్రేలియన్ స్టార్టప్ సికోనా బ్యాటరీ టెక్నాలజీస్‌లో 12.79 శాతం వాటాను సొంతం చేసుకుంది. క్యూ1లో స్థూల రుణ భారం రూ. 154 కోట్లు తగ్గి రూ. 682 కోట్లకు దిగివచ్చింది. అయితే నికర రుణ భారం రూ. 15 కోట్లు



పెరిగి రూ. 215 కోట్లకు చేరింది. నికర రుణ భారం స్వల్పంగా పెరిగినప్పటికీ స్థూల రుణ భారం భారీగా తగ్గడంతో బ్యాలన్స్‌షీట్ మరింత పటిష్టం కానుంది. ఈ ప్రభావంతో కంపెనీ రేటింగ్ ఔట్‌లుక్ స్థిరత్వం నుంచి సానుకూలానికి మెరుగుపడింది. వెరసి కంపెనీ ఆర్థిక పరిస్థితిపై ఔట్‌లుక్ మెరుగుపడినట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఇక మరోవైపు కాంబే ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో మొత్తం షేర్లను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వాటా కొనుగోలుతో జూలై చివరికల్లా కాంబే ప్రాజెక్ట్స్ సొంత అనుబంధ కంపెనీగా ఆవిర్భవించింది.

మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ | కీనోట్ క్యాపిటల్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,359 టార్గెట్: రూ. 1,700

ఎందుకంటే: ఆరోగ్య పరిరక్షణ కంపెనీ మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ 20 రాష్ట్రాలలో 220 పట్టణాలలో సేవలను విస్తరించింది. 175 ల్యాబ్‌లు, 2,921 పేషంట్ సర్వీస్ కేంద్రాలు, 754 అసిస్టెడ్ రిఫరల్ సెంటర్లు(ఏఆర్‌సీలు) నిర్వహిస్తోంది. 4,000కుపైగా క్లినికల్ లేబొరేటరీ పరీక్షలు, ప్రొఫైల్స్ ఆఫర్ చేస్తోంది. కంపెనీ మొత్తం ఆదాయంలో 2016లో 38 శాతంగా నమోదైన బిజినెస్ టు కన్జూమర్(బీటూసీ) బిజినెస్ వాటా 2023కల్లా 59 శాతానికి ఎగసింది. ఈ విభాగంపై ప్రత్యేక దృష్టికారణంగా బీటూసీ సంస్థగా ఆవిర్భవించింది. భవిష్యత్ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా అసెట్‌లైట్(తక్కువ పెట్టుబడుల) విధానంలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. దీనిలో భాగంగా ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా వృద్ధికి బాటలు వేసుకోనుంది. దీంతో ప్రధాన విభాగం 15 శాతం పురోగతిని సాధించవచ్చని అంచనా. 2022లో కంపెనీ 90:30



విస్తరణ ప్రణాళికలకు తెరతీసింది. తద్వారా 30 నెలల్లోగా 90 ల్యాబ్‌లు, 1,800 కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. టైర్–2, టైర్–3 నగరాలలో అందుబాటు ధరల్లో పరీక్షల సౌకర్యాలను కల్పించడం ద్వారా అదనపు అవకాశాలను సృష్టించుకోనుంది. వెరసి లేబొరేటరీల ఏర్పాటు ప్రక్రియకు జోష్‌నివ్వడం ద్వారా వేగవంత మానిటైజేషన్‌కు తెరతీయనుంది. ఇటీవల సొంతం చేసుకున్న హైటెక్ డయాగ్నోస్టిక్ సెంటర్.. కోవిడ్ తదుపరి 35 శాతం వృద్ధిని అందుకుంది. ఈ బాటలో కంపెనీ మరిన్ని కొనుగోళ్లపై దృష్టిసారించడం ద్వారా వేగవంత వృద్ధికి బాటలు వేసుకోనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డైసన్ హెయిర్ కేర్ టెక్నాలజీస్ ప్రచారకర్తగా దీపికా పదుకొనే

హైదరాబాద్: గ్లోబల్ టెక్నాలజీ సంస్థ డైసన్ హెయిర్ కేర్ టెక్నాలజీస్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా నటి దీపికా పదుకొనేను నియమించుకుంది. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి శిరోజాల సంరక్షణపై కనీస అవగాహన అవసరం. ఆరోగ్యకరమైన హెయిర్ స్టైల్ కోసం ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలను చేస్తున్న డైసన్‌కు బ్రాండ్ అంబాసిడర్ వ్యవహరిస్తుండటం సంతోషంగా ఉందని దీపికా అన్నారు. ''మా బ్రాండ్‌కు దీపికా మరింత గుర్తింపు తీసుకొస్తుంది. అధునాతన కేశాలంకరణ పరికరాల మార్కెట్‌ను మరింత విస్తరించుకునేందుకు ఆమెకు ఉన్న ఆకర్షణ మాకు కలిసొస్తుంది'' అని డైసన్ ఇండియా ఎండీ అంకిత్ జైన్ తెలిపారు.



జీ-సెక్, కార్పొరేట్ బాండ్.. ఏది మెరుగు?

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్‌ఎస్‌ఎస్)లో ఒక వ్యక్తికి పెట్టుబడి ఉంది. అయితే మూడేళ్ల లాకిన్ పీరియడ్ నిండకుండానే అతడు మరణించాడు. దీంతో ఈఎల్‌ఎస్‌ఎస్ యూనిట్లను నామినీకి బదిలీ చేశారు. మూడేళ్ల లాకిన్ పీరియడ్ పూర్తి కాకపోయినా ఇప్పుడు నామినీ వాటిని విక్రయించుకోవచ్చా?
– బుదేరియా అచ్చర్

దురదృష్టవశాత్తూ యూనిట్ హోల్డర్ మరణించినట్టయితే నామినీ లేదా చట్టబద్ధమైన వారసులు ఈఎల్‌ఎస్‌ఎస్ ఫండ్ యూనిట్లను విక్రయించుకోవచ్చు. మరణించిన వ్యక్తి పెట్టుబడి పెట్టిన నాటి నుంచి ఏడాది పూర్తయిన తర్వాతే ఇందుకు అవకాశం ఇస్తారు. నామినీ లేదా వారసులు ఆ పెట్టుబడి కోసం మూడేళ్ల లాకిన్ పీరియడ్ ముగిసే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదు. చాలా వరకు మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు లాకిన్ పీరియడ్ అనేది ఉండదు. కానీ ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాలకు మూడేళ్ల లాకిన్ ఉంటుంది. పెట్టుబడిదారుడికి కేటాయించిన తేదీ నుంచి మూడేళ్లు అమలవుతుంది. ఈ మూడేళ్ల తర్వాతే సదరు ఇన్వెస్టర్ తన పెట్టుబడిని వెనక్కి తీసుకోగలరు. యూనిట్ హోల్డర్ మరణించిన సందర్భాల్లో మాత్రం నామినీ లేదా చట్టబద్ధ వారసులు వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చు. దీన్ని ట్రాన్స్‌మిషన్ అని చెబుతారు. నామినీ లేదా వారసులకు యూనిట్లు బదిలీ అయిన వెంటనే వాటిని విక్రయించుకోవచ్చు. లేదా వేరొకరికి బదిలీ చేసుకోవచ్చు. లేదా తనఖా కూడా పెట్టుకోవచ్చు. ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి 2021లో ఈఎల్‌ఎస్‌ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత 2022లో మరణించాడని అనుకుంటే.. అప్పుడు నామినీ లేదా వారసులు తమ పేరిట సదరు యూనిట్లను మార్పించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వాటిని అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. బదిలీ అయిన తర్వాత నుంచి ఏడాది ఆగక్కర్లేదు. మొదట పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి ఏడాది కాలం పూర్తయితే చాలు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఎన్‌పీఎస్‌లో జీ సెక్యూరిటీలు (ప్రభుత్వ సెక్యూరిటీలు) కంటే కార్పొరేట్ ఫండ్ ఆప్షన్ అన్ని వేళలా మెరుగైనదేనా? ఎన్‌పీఎస్ ఫండ్ మేనేజర్లు భద్రత ఉండే కార్పొరేట్ బాండ్లలోనే ఇన్వెస్ట్ చేస్తారా?
– జగన్నాథ్ గోస్వామి

కార్పొరేట్ బాండ్ ప్లాన్లు సాధారణంగా మెరుగైన రాబడులు ఇస్తాయి. అయితే కార్పొరేట్ బాండ్ లేదా ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎంపిక ఎప్పుడైనా కేవలం రాబడుల అంశం ఆధారంగా ఉండకూడదు. రిస్క్ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని చూడాలి. పెట్టుబడుల క్రెడిట్ నాణ్యతను చూడాలి. మారుతున్న వడ్డీ రేట్లకు ఏ మేరకు ప్రభావితం అవుతాయనేది చూడాలి. నాణ్యత పరంగా చూస్తే ప్రభుత్వం బాండ్ ప్లాన్లు మెరుగైనవి. అవి సావరీన్ బాండ్లలోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అవి అంతర్లీనంగా ప్రభుత్వ గ్యారంటీతో ఉంటాయి. కార్పొరేట్ బాండ్ ప్లాన్లు ఏఏఏ రేటెడ్, ఏఏప్లస్, ఏ1ప్లస్ రేటెడ్ బాండ్లలో పెట్టుబడులు పెడుతుంటాయి. టర్మ్ డిపాజిట్లను సైతం ఎంపిక చేసుకుంటాయి. ఏఏఏ రేటెడ్ సాధనం అయినప్పటికీ, తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో చెల్లింపుల్లో విఫలం కావచ్చు. అందుకుని పెట్టుబడికి భద్రత దృష్ట్యా కార్పొరేట్ ప్లాన్ల కంటే ప్రభుత్వ సెక్యూరిటీలే మెరుగైనవి. బాండ్లు అన్నవి మారే వడ్డీ రేట్ల ప్రభావానికి లోనవుతుంటాయి. పోర్ట్‌ఫోలియోలో ఉన్న బాండ్ల కాల వ్యవధి ఆధారంగా వడ్డీ రేట్ల అస్థిరతల ప్రభావం ఉంటుంది. కార్పొరేట్ ప్లాన్‌లో ఒక్కో బాండ్ సగటు కాల వ్యవధి ఐదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. ప్రభుత్వ ప్లాన్ అయితే కాల వ్యవధి సాధారణంగా పదేళ్లు ఉంటుంది. అందుకే వడ్డీ రేట్ల మార్పులకు ప్రభుత్వ ప్లాన్లు మరింత ఒత్తిడికి లోనయ్యే స్వభావంతో ఉంటాయి. దీర్ఘకాల సాధనం కనుక ఈ అస్థిరతలకు ఆందోళన చెందక్కర్లేదు. కనుక కార్పొరేట్ డెట్ ప్లాన్ అన్నివేళలా ప్రభుత్వ సెక్యూరిటీల కంటే మెరుగైనది అని చెప్పలేం.

క్లుప్తంగా...

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఏలూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఏలూరు రైల్వేస్టేషన్‌లో రూ.21.01 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఢిల్లీ నుంచి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియో సందేశం కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఏలూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నా నిలిపివేత

సాక్షి, అమరావతి: విద్యుత్‌సౌధ ఎదుట మంగళవారం తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ప్రకటించింది. ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో.. ఈనెల 8న జరప తలపెట్టిన మహా ధర్నా స్థానంలో వర్క్ టు రూల్ కొనసాగించాలని నిర్ణయించినట్లు సమితి చైర్మన్, కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు జరిపిన చర్చలకు కొనసాగింపుగా సోమవారం మరోసారి చర్చలు కొనసాగుతాయన్నారు.

శ్రీశైలానికి 35,837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి 35,837 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. డ్యాంలో 109.8070 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటిమట్టం 861.20 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు 3.5 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. తెలంగాణలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 4.317 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

1,033 పంచాయతీల్లో 19న ఉప ఎన్నికలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 484 మండలాల పరిధిలోని 1,033 గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఈనెల 19న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం కె.సుగుమంచిపల్లి గ్రామ పంచాయతీ ఒక్కచోట మాత్రం మొత్తం వార్డు సభ్యులతో పాటు సర్పంచ్, ఉప సర్పంచి పదవులకు ఎన్నిక జరగనుండగా.. మిగిలిన 1,032 గ్రామ పంచాయతీల్లో గతంలో ఎన్నికైన వారు చనిపోవడం లేదంటే రాజీనామా కారణాలతో ఏర్పడిన ఖాళీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ 1,032 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నిచోట్ల సర్పంచ్ లేదా ఒకట్రెండు వార్డు సభ్యుల పదవులకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.

ఒరిగిపోలేదు..పెరిగిపోయింది

గత సర్కారు హయాంతో పోలిస్తే రాష్ట్రంలో మరింత పెరిగిన వరి సాగు

సాక్షి, అమరావతి: సర్వ సాధారణంగా ఎవరైనా సరే మన పరిస్థితిని సమీక్షించుకోవాలంటే గతంతో బేరీజు వేసుకుంటారు. ఇప్పుడు అంతకంటే మెరుగ్గా ఉన్నామో లేదో పరిశీలించుకుంటారు. ఈనాడు రామోజీ మాత్రం దీనికి పూర్తి విరుద్ధం! పొరపాటున కూడా అలా పోల్చే సాహసం చేయరు! ఎందుకంటే చంద్రబాబు వైఫల్యాలు, రైతులకు చేసిన మోసాలు బహిర్గతమవుతాయి కాబట్టి!! టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు రాష్ట్రంలో వరి సాగు సగటున మరో నాలుగున్నర లక్షల ఎకరాలకుపైగా అదనంగా పెరిగింది. అందుకు తగ్గట్లే అన్నదాతలకు ఆదాయమూ పెరిగింది. నీళ్లపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకుంటూ కొందరు రైతులు ప్రభుత్వ తోడ్పాటుతో ఉద్యాన పంటల వైపు మళ్లి పండ్ల తోటల సాగుతో మరింత ఆదాయాన్ని పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో వరి రైతులకు బోనస్ చెల్లిస్తున్నారంటూ రామోజీ మన రాష్ట్రం గురించి మొసలి కన్నీళ్లు కార్చారు. గ్రామస్థాయిలోనే రైతన్నలకు ఆర్బీకేల ద్వారా పంట ఉత్పాదకాలన్నీ సమకూరుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం నుంచి పంట నష్ట పరిహారం దాకా ప్రతి విషయంలోనూ అండగా నిలుస్తోంది. సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది. పంటలను నేరుగా కల్లాల నుంచే కొనుగోలు చేస్తూ రైతన్నలకు గన్నీ బ్యాగులు, లేబర్ చార్జీలు, రవాణా చార్జీలను సైతం చెల్లించి వారిపై భారం పడకుండా ఆదుకుంటోంది. జీఎల్‌టీ పేరుతో టన్నుకు రూ.2,523 చొప్పున ధాన్యం కొనుగోలు డబ్బులతోపాటే రైతుల ఖాతాల్లో జమ చేస్తోందన్న విషయం రామోజీకి తెలుసా? తెలిసీ నటిస్తున్నారా?

■ ఈనాడు ఆరోపణ:
ఏపీలో సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది...

వాస్తవం: రాష్ట్రంలో వరి సాధారణ విస్తీర్ణం ఖరీఫ్‌లో 38.8 లక్షల ఎకరాలు కాగా రబీలో 19.92 లక్షల ఎకరాలు. టీడీపీ హయాంలో ఏటా సగటున 55.43 లక్షల ఎకరాల్లో సాగైతే ఇప్పుడు గత నాలుగేళ్లుగా సగటున 60 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. చంద్రబాబు పాలనలో 2014–15లో గరిష్ఠంగా 59.85 లక్షల ఎకరాల్లో సాగైతే ఇప్పుడు 2020 – 21లో గరిష్ఠంగా 63.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రాష్ట్రంలో వరి మొత్తం సాగు విస్తీర్ణం 58.72 లక్షల ఎకరాలు కాగా 2022–23లో 55.52 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే వ్యత్యాసం 3.20 లక్షల ఎకరాలు మాత్రమే. రబీలో బోర్ల కింద ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం ప్రోత్సహించడంతో 1.15 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు, 50 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు, మొక్కజొన్న, నూనెగింజల సాగు విస్తీర్ణం పెరిగింది. మరో 35 వేల ఎకరాల్లో మత్స్యసాగు విస్తరించింది. వాస్తవాలు ఇలా ఉంటే ఏకంగా 6.34 లక్షల ఎకరాలు తగ్గిపోయిందంటూ పొంతన లేని లెక్కలతో ఈనాడు కథలు అల్లింది.

■ ఆరోపణ: ఏటా ఉత్పాతమే...

వాస్తవం: ఆహార ధాన్యాల దిగుబడి 2014–19 మధ్య ఐదేళ్లలో సగటు 153.94 లక్షల టన్నులు కాగా గత నాలుగేళ్లలో 170.96 లక్షల టన్నులు ఉంది. ఒక్క వరినే పరిశీలిస్తే చంద్రబాబు అధికారంలో ఉండగా ఏటా సగటున 1.22 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే 2019–22 మధ్య 1.29 కోట్ల టన్నుల చొప్పున ఉత్పత్తి జరిగింది. 2021–22 ఖరీఫ్‌లో హెక్టార్‌కు 4,351, రబీలో 6,950 కేజీల చొప్పున దిగుబడి నమోదైంది. 2022–23 ఖరీఫ్‌లో 5,195 కేజీలు, రబీలో 6,944 కేజీల చొప్పున దిగుబడి వచ్చింది. 2021–22లో 1.25 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 2022–23లో 1.29 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. అంటే దిగుబడి పెరిగినట్లా? తగ్గినట్లా? రామోజీకి మాత్రం ఇవన్నీ కనపడవు. ఎందుకంటే ఆయన కళ్లున్నా కబోదిలానే వ్యవహరిస్తున్నారు కాబట్టి!!

■ ఆరోపణ: రైతులకు సంక్షేమ ఫలాలేవి?

వాస్తవం: వైఎస్సార్ రైతు భరోసా కింద గత నాలుగేళ్లలో 52.38 లక్షల మంది రైతులకు రూ.30,985.30 కోట్ల పెట్టుబడి సాయం అందింది. 22.70 లక్షల మంది రైతులకు పంట నష్ట పరిహారం కింద రూ.1,957 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్ల పరిహారం అందజేశారు. ఇందులో 6.19 లక్షల మందికి చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.515.84 కోట్లు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి సున్నా వడ్డీ రాయితీ కింద 73.88 లక్షల మంది రైతులకు రూ.1,835 కోట్లు జమ చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే.

■ ఆరోపణ: పంట విరామం ప్రకటించినా మొద్దు నిద్రే

వాస్తవం: చంద్రబాబు అధికారంలో ఉండగా కరువు మండలాలను ప్రకటించని ఏడాదంటూ లేదు.గత నాలుగేళ్లుగా అలాంటి పరిస్థితే ఉత్పన్నం కాలేదు. పుష్కలంగా వర్షాలు, సమృద్ధిగా సాగునీరు, ముందస్తుగానే కాలువలకు నీటి విడుదలతో సిరులు పండుతున్నాయి. గోదావరి, కృష్ణాకే కాకుండా తొలిసారిగా పెన్నాకు కూడా వరదలు వచ్చాయంటే వరుణుడు ఏ స్థాయిలో కరుణ కురిపిస్తున్నాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటప్పుడు పనిగట్టుకుని పంట విరామం ప్రకటించాల్సిన అవసరం ఏముంటుందో రామోజీకే తెలియాలి. 2022–23లో వరి రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్తే పంట విరామం ప్రకటించినట్లుగా నోటికొచ్చిన అంకెలతో రామోజీ అబద్ధాలను అచ్చేశారు.

సిరిలా పెరుగుతోందక్కడ..
ఉరిపై ఒరుగుతోందిక్కడ



■ ఆరోపణ: మద్దతు ధర మాయే..

వాస్తవం: చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 17,94,279 మంది రైతుల నుంచి రూ.40,237 కోట్ల విలువైన 2,65,10,747 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. టీడీపీ హయాంలో దళారులదే రాజ్యం. తక్కువ మంది రైతుల వద్ద నుంచి ఎక్కువ మొత్తం ధాన్యం సేకరించడమే ఇందుకు నిదర్శనం. 2014–15లో 1.18 లక్షల మంది రైతుల నుంచి రూ.5,583 కోట్ల విలువైన 40.62 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఒక్కో రైతు నుంచి సగటున 33.89 టన్నుల ధాన్యం సేకరించారు. నూటికి 90 శాతం సన్న, చిన్నకారురైతులున్న ఈ రాష్ట్రంలో ఈస్థాయిలో ధాన్యంఅమ్మారంటే వార్ని ఏమంటారో అర్థం చేసుకోవచ్చు. గడిచిన నాలుగేళ్లలో ఏకంగా 32,78,354 మంది రైతుల నుంచి రూ.58,766 కోట్ల విలువైన 3,10,69,117 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గతంతో పోలిస్తే ధాన్యం అమ్ముకున్న రైతుల సంఖ్య దాదాపు రెట్టింపైంది. గరిష్ఠంగా కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేశారు.

■ ఆరోపణ: తడిసిన ధాన్యాన్ని కొనలేదు..

వాస్తవం: గతంలో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఒక్కో బస్తాకి (75 కేజీలు) మద్దతు ధర కంటే రూ.200 – రూ.500 వరకు తగ్గించి ఇచ్చేవారు. ఇలా ఎకరాకు తక్కువలో తక్కువ 30–33 బస్తాల దిగుబడి వేసుకున్నా రూ.6 వేలకు పైగా రైతులు నష్టపోయేవారు. తేమ శాతం పేరిట ఇష్టమొచ్చినట్టు కోత పెట్టేవారు. ఇప్పుడు జిల్లాకో మొబైల్ మిల్లును పంపి రైతుల ఎదుటే శాంపిల్స్ పరీక్షిస్తున్నారు. తడిసిన ధాన్యాన్నే కాకుండా ముక్క విరిగిన ధాన్యాన్ని సైతం బాయిల్డ్ రకంగా పరిగణించి మరీ కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో సుమారు 30 శాతం తడిసిన ధాన్యమే ఉంది. కేంద్ర నిబంధనలు అడ్డంకిగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకొని మిల్లర్లను ఒప్పించి తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా సేకరించింది. ఆర్బీకేలను కొనుగోలు కేంద్రాలుగా గుర్తించడమే కాకుండా పొలం నుంచే నేరుగా కొనుగోలు చేస్తూ జీఎల్‌టీ(గన్నీ బ్యాగ్‌లు, లేబర్, ట్రాన్స్‌పోర్టు) ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది. టన్నుకు రూ.2,523 చొప్పున (గోనె సంచులకు రూ.1,750, కూలీలకు రూ.220, రవాణా చార్జీలుగా రూ.468తో పాటు ఒకసారి వాడిన గోనె సంచులకు రూ.85) చెల్లిస్తుండగా ఇతర పంట ఉత్పత్తుల సేకరణ సందర్భంలో క్వింటాల్‌కు రూ.418 చొప్పున భరిస్తోంది. ఈ అదనపు మొత్తాన్ని ధాన్యం సొమ్ముతో కలిపి రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు.

ఇతర రాష్ట్రాల్లో ఇలా..

ఏపీలో 24 లక్షల హెక్టార్లలో వరి సాగవుతుంటే కేరళలో 1.98 లక్షల హెక్టార్లు, జార్ఖండ్‌లో 13.57 లక్షల హెక్టార్లు, తమిళనాడులో 19 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు అవుతోంది. ఇక దిగుబడిని పరిశీలిస్తే ఏపీలో ఎకరాకు 23.24 క్వింటాళ్లను (2022–23)మన రైతన్నలు సాధిస్తుండగా తమిళనాడులో 17, జార్ఖండ్‌లో 9, కేరళలో 13 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. ఎంత ప్రోత్సహిస్తున్నా ఫలితం లేకపోవడంతో కేరళ ఏటా మన గోదావరి జిల్లాల్లో సాగయ్యే బొండాల కోసం క్యూ కడుతుండగా తమిళనాడు మన రాయలసీమ జిల్లాల్లో సాగయ్యే ఫైన్ వెరైటీల వైపు చూస్తోంది. ఉత్తరాంధ్రలో సాగయ్యే ఫైన్ వెరైటీ ధాన్యాన్ని జార్ఖండ్ కొనుగోలు చేస్తోంది.

■ ఆరోపణ: వరిసాగు లేక కూలీలు వలసపోతున్నారు

వాస్తవం: వరి సాగు లేక వ్యవసాయ పనిదినాలు తగ్గిపోయాయని, కూలీలు వలస వెళుతున్నారంటూ రామోజీ కంటతడి పెట్టారు. వాస్తవానికి ఉపాధి హామీ పనులతో పాటు ఇతర పనుల కారణంగా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయి. సాగులో కూలీల కొరత తీర్చేందుకు యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూర్చి పెట్టుబడి ఖర్చులను తగ్గించేలా యంత్రపరికరాలను అందుబాటులోకి తెచ్చింది.

■ ఆరోపణ: వరి రైతును ఆదుకునే చర్యలేవి?

వాస్తవం: 2020 నుంచి ఇప్పటివరకు వైపరీత్యాల వల్ల 15.31 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తినగా 12.79 లక్షల మంది వరి రైతులకు రూ.930.56 కోట్ల పెట్టుబడి రాయితీని సీజన్ ముగియకుండానే అందజేశారు. 2020 జూన్ నుంచి అక్టోబర్ వరకు 2.21 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఈనాడుకు మాత్రం 3.51 లక్షల ఎకరాలుగా తోచింది. 2014 నుంచి నేటి వరకు ఎకరాకు పెట్టుబడి రాయితీ రూ.6 వేల చొప్పునే ఇస్తున్నారు. 2018లో తితిలీ, పెథాయి తుపాన్ వల్ల నష్టపోయిన పంటలకు కేవలం రెండు జిల్లాల పరిధిలో మాత్రమే ఎకరాకు రూ.8వేల చొప్పున ఇచ్చారు. 2014–19 మధ్య 359 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. 42.26 లక్షల ఎకరాలు కరువు బారిన పడినట్లు గుర్తించారు. నాడు పరిస్థితి అంత దారుణంగా ఉంటే 20.09 లక్షల మంది రైతులకు రూ.2,188.74 కోట్ల పెట్టుబడి రాయితీని ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుది కాదా? ఈ లెక్కలు రామోజీ ఎక్కడ దాచినట్లు?

పక్కాగా 'అసైన్డ్' మార్పు

వీఆర్వో నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఏం చేయాలో నిర్దేశించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ అసైన్డ్ చట్టంలో సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం దాన్ని అమలు చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదివారం జిల్లా కలెక్టర్లకు ఈ–ఫైల్ విధానంలో ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం భూమి కేటాయించిన వ్యక్తి, అతను లేకపోతే అతని వారసుల ఆధీనంలో ఆ భూమి ఉంటేనే యాజమాన్య హక్కులు కల్పించాలని సూచించారు. ఆ భూములను 1908 రిజిస్ట్రేషన్ల చట్టంలోని నిషేధిత ఆస్తుల జాబితా 22 (ఎ) నుంచి తొలగించాలని ఆదేశించారు. లంక భూములు, నీటి వనరులకు సంబంధించిన భూములకు ఇందులో నుంచి మినహాయించాలని సూచించారు. ఇందుకోసం వీఆర్‌ఓలు, తహశీల్దార్లు, ఆర్డీఓలు–సబ్ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, కలెక్టర్లు ఏం చేయాలనే అంశాలను నిర్దిష్టంగా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

వీఆర్‌ఓలు ఇలా చేయాలి..

రికార్డులను సంస్కరించడంలో (పీఓఎల్‌ఆర్–ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) భాగంగా తహశీల్దార్లు వ్యవసాయం, ఇళ్ల పట్టాల కోసం అసైన్ చేసిన భూములను గుర్తించారు. వాటిని బట్టి వీఆర్‌ఓలు ఆన్‌లైన్ అప్లికేషన్ కోసం వివరాలను సమకూర్చాలి. ఇప్పటికే గుర్తించిన సర్వే నంబర్ల ప్రకారం ఆ భూముల డీకేటీ రిజిష్టర్లు, 1బీ, అడంగల్, 22 (ఎ) జాబితా, ఇతర రెవెన్యూ రికార్డులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో వంద శాతం తనిఖీలు నిర్వహించాలి. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టాను పరిశీలించి, ఆ పట్టాదారు.. ప్రభుత్వం భూమి కేటాయించిన వ్యక్తా లేక అతని వారసుడా? (ఒరిజినల్ అసైనీనా లేక లీగల్ హైరా), సంబంధిత భూమి వారి ఆధీనంలోనే ఉందా? రెవెన్యూ రికార్డుల ప్రకారం అది లంక భూమా? లేక నీటి వనరులకు సంబంధించిన భూమా? ఆ భూమి అతనికి ప్రభుత్వం ఎప్పుడు అసైన్ చేసింది? వంటి వివరాలను కచ్చితంగా సేకరించాలి. ఇందుకోసం అన్ని రికార్డులను పరిశీలించి క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించాలి.

తహశీల్దార్ల పాత్ర

వీఆర్‌ఓలు ఇచ్చిన అసైన్డ్ భూముల సర్వే నంబర్లను తహశీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలించాలి. మండలంలోని అన్ని అసైన్డ్ భూముల వివరాలు ఆ జాబితాలో ఉన్నాయో.. లేదో.. చూడాలి. ఈ కసరత్తులో ఏ అసైన్డ్ భూమిని వదిలి వేయకూడదు. ఒకవేళ ఏదైనా భూమిని వదిలివేసినట్లు గుర్తిస్తే వెంటనే ఆ వివరాలను సీసీఎల్ఏ కార్యాలయంలోని సీఎంఆర్‌ఓ (కంప్యూటరైజేషన్ ఆఫ్ మండల రెవెన్యూ ఆఫీసెస్) సెక్షన్‌కు ఈ–ఫైల్ విధానంలో పంపి కసరత్తులో చేర్చాలి. పక్కాగా తనిఖీ చేసిన తర్వాత తహశీల్దార్ అసైన్డ్ భూముల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో పబ్లిక్ నోటీస్ బోర్డులో పెట్టాలి. సూచనలు, అభ్యంతరాల కోసం 7 రోజుల సమయం ఇవ్వాలి. ఏవైనా అభ్యంతరాలు వస్తే పరిశీలించి, నిబంధనల ప్రకారం వాటిని వెంటనే క్లియర్ చేయాలి. ఆ తర్వాత మొత్తం రికార్డుల్లో 5 శాతాన్ని ఆర్డీఓలు తనిఖీ చేయాలి.

జాయింట్ కలెక్టర్ల పాత్ర

ఆర్డీఓలు/సబ్ కలెక్టర్లు తనిఖీ చేసిన 5 శాతం రికార్డుల్లో 1 శాతం రికార్డులను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి, అన్నీ సరిగా ఉన్నాయో లేదో చూడాలి. వీఆర్వో నుంచి ఆర్డీఓ స్థాయి వరకు జరిగిన కసరత్తును పూర్తిగా పర్యవేక్షిస్తూ అన్ని దశల్లోనూ పారదర్శకంగా జరిగిందో లేదో పరిశీలించాలి. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత 22 (ఎ) జాబితా నుంచి ఎంపిక చేసిన సర్వే నంబర్లను తొలగించాలని కోరుతూ జిల్లా రిజిస్ట్రార్లకు ముసాయిదా లేఖ సిద్ధం చేయాలి. కలెక్టర్ దాన్ని జిల్లా రిజిస్ట్రార్‌కు పంపాలి. ప్రతి సంవత్సరం ఆగస్టు 5వ తేదీన ఇదే విధంగా నిబంధనల ప్రకారం 22 (ఎ) నుంచి తొలగించాల్సిన అసైన్డ్ భూముల వివరాలను జిల్లా రిజిస్ట్రార్లకు పంపాలి. అసైన్డ్ భూములను 22 (ఎ) జాబితా నుంచి తొలగించే ప్రక్రియను జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించాలి. మొత్తం కసరత్తు పూర్తయిన తర్వాత కలెక్టర్.. జిల్లా రిజిస్ట్రార్‌కు 22 (ఎ) నుంచి తొలగించాల్సిన సర్వే నంబర్ల జాబితాను పంపి, తర్వాత దాన్ని జిల్లా గెజిట్‌లో ప్రచురించాలి.

తెలంగాణ

వైఎస్ జగన్‌ను వేధించి.. జైల్లో పెట్టారు

అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ తీరుపై దుమ్మెత్తిపోసిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోవడంతో కాంగ్రెస్ పార్టీ వైఎస్ జగన్‌ను రాంగ్ హ్యాండిల్ చేసింది. జగన్‌ను అనేక రకాలుగా వేధించి.. చివరకు జైల్లో కూడా పెట్టారు. ఆ తరువాత ఆయన సొంత పార్టీ స్థాపించుకున్నారు. కడప ఎంపీ స్థానానికి ఉప ఎన్నిక వస్తే నాలుగైదు లక్షల బ్రహ్మాండమైన మెజారిటీతో ఆయన గెలిచారు' అని తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పారు. అసెంబ్లీలో ఆదివారం 'రాష్ట్ర ఆవిర్భావం–సాధించిన ప్రగతి'పై జరిగిన చర్చలో కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కడప ఉప ఎన్నికల్లో జగన్ భారీ మెజార్టీతో గెలవడమే కాకుండా.. ఆ తరువాత వచ్చిన ఒకటి, రెండు ఉపఎన్నికలను కూడా ఆయన స్వీప్ చేయడంతో కాంగ్రెస్ నాయకులు ఆంధ్రాలో ఇక తమ పని అయిపోయిందని భావించారన్నారు. తెలంగాణలో అయినా కనీసం పది సీట్లయినా రాకపోతాయా అని తెలంగాణ ఇచ్చారే తప్ప ప్రేమతో ఇవ్వలేదని అన్నారు.

ఆస్తి కందుకూరులో.. రిజిస్ట్రేషన్ నెల్లూరులో..

- నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్‌పై కందుకూరులో కేసు

కందుకూరు: కుటుంబ తగాదాల్లో ఉన్న వారసత్వ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసిన నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ చిక్కుల్లో పడ్డారు. సరైన ధ్రువీకరణపత్రాలు ఉన్నాయా.. లేవా.. అని పరిశీలించకుండా కందుకూరులోని ఆస్తికి నెల్లూరులో రిజిస్ట్రేషన్ చేసి పోలీస్ కేసులో ఇరుక్కున్నారు. వివరాల్లోకి వెళితే.. కందుకూరు చెందిన శెట్టి పేరయ్య, నారాయణమ్మ దంపతులకు కోటేశ్వరరావు అనే కుమారుడితో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. పేరయ్య పేరిట కందుకూరు బలిజపాలెంలో 20 సెంట్ల స్థలం ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.1.20 కోట్లు. కాగా.. 2004లోనే పేరయ్య మరణించగా.. ఆయన పేరిట ఉన్న ఈ స్థలాన్ని దివ్యాంగురాలైన కుమార్తె శాంతికుమారి పేరిట మిగిలిన కుటుంబ సభ్యులంతా కలిసి రాశారు. ఆమె పోషణను సోదరుడైన కోటేశ్వరరావు చూస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం శాంతికుమారి కూడా మరణించింది. దీంతో ఈ స్థలం కోసం తోబుట్టువుల మధ్య వివాదం మొదలైంది. శాంతికుమారి పోషణను, ఆమె అంత్యక్రియలు, అన్నీ తానే చేశాను కాబట్టి ఆస్తి తనకే వస్తుందని కోటేశ్వరరావు వాదన. అదే సందర్భంలో కావలిలో నివాసం ఉండే కోటేశ్వరరావు అక్క కొడుకు భానుకుమార్ ఈ స్థలం కోసం పోటీ పడుతున్నాడు. వీరి మధ్య వివాదం జరుగుతుండగానే భానుకుమార్ ఆ స్థలాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సరైన పత్రాలు లేవని రిజిస్ట్రేషన్ తిరస్కరించడంతో.. భానుకుమార్ నెల్లూరు డీఆర్ బాలాంజనేయులు నుంచి ఆర్డర్ తెచ్చుకుని నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు బాలాంజనేయులుపై కేసు నమోదు చేశామని కందుకూరు సీఐ నఫీజ్‌బాషా చెప్పారు.

నాలుగేళ్లలో రెట్టింపు

▶ మొదటి పేజీ తరువాయి

ఉండగా 2015లో 7వ ర్యాంకులో నిలిచింది. 2019లో ఆరో ర్యాంకులో ఉంది. 2022లో ఐదో ర్యాంకులో ఉండగా 2027కు మూడో ర్యాంకుకు చేరే అవకాశం ఉంది. ■ 2027 నాటికి భారత్ జీడీపీ రూ.420.24 లక్షల కోట్లకు చేరుతుంది. ఇందులో 15 రాష్ట్రాల నుంచే దేశ జీడీపీకి రూ.358.40 లక్షల కోట్లు సమకూరనుండటం గమనార్హం. దీనికి సంబంధించి అత్యధికంగా 13% వాటాతో మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలవనుంది. యూపీ 10% వాటాతో రెండో స్థానంలో, 5% వాటాతో ఏపీ ఏడో స్థానంలో నిలవనున్నాయి.

2027 నాటికి టాప్ 10 రాష్ట్రాల జీఎస్‌డీపీ

రాష్ట్రం	జీఎస్‌డీపీ రూ.కోట్లలో	దేశ జీడీపీలో వాటా శాతం
మహారాష్ట్ర	51,76,000	13
ఉత్తరప్రదేశ్	41,20,000	10
తమిళనాడు	34,08,000	8
కర్నాటక	31,60,000	8
గుజరాత్	30,88,000	7
రాజస్థాన్	20,16,000	5
ఆంధ్రప్రదేశ్	19,44,000	5
తెలంగాణ	19,12,000	5
మధ్యప్రదేశ్	18,72,000	5
కేరళ	17,44,000	4

■ 2027 నాటికి భారత్‌లో కొన్ని రాష్ట్రాలు ఏకంగా కొన్ని దేశాలకు మించి వృద్ధి నమోదు చేస్తాయి. ■ ఏపీలో ప్రస్తుతం రూ.11 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి నమోదు కాగా 2027 నాటికి రూ.20 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. అంటే నాలుగేళ్లలో ఏపీ స్థూల ఉత్పత్తి దాదాపు రెట్టింపు కానుంది.

ఆరోగ్యానికి 'ప్లానెట్ ఫ్రెండ్లీ' డైట్

▶ మొదటి పేజీ తరువాయి

తక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ప్రత్యేకించి శ్వాసకోశ వ్యాధులతో మరణించే అవకాశం 50 శాతం, న్యూరోడెజెనరేటివ్ వ్యాధులతో మరణించే అవకాశం 20 శాతం, క్యాన్సర్/గుండె జబ్బులతో మరణించే అవకాశాలు 15 శాతం వరకు తక్కువ ఉన్నట్టు నివేదించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆహారపు అలవాట్లు సంస్కృతుల నేపథ్యంలో ఆయా దేశాలు పీహెచ్‌డీఐలో మార్పులు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు.

కాళ్లకు 'తీపి' చెద!

మధుమేహులను వేధిస్తున్న మొండి పుండు

- రక్త ప్రసరణ తగ్గడంతో అవయవం తొలగించాల్సిన పరిస్థితి
- విజయవాడ జీజీహెచ్‌కు క్యూ కడుతున్న బాధితులు
- నెలలో 50 నుంచి 60 మందికి కాళ్లు, వేళ్లు తొలగిస్తున్న వైనం
- అదుపులో లేని సుగర్‌తో పాటు ధూమపానమే కారణం
- ముందస్తు జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్య నిపుణులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు సుగర్ ఇన్‌ఫెక్షన్‌లతో రోగులు బారులు తీరుతున్నారు. కాళ్ల రక్తనాళాలు మూసుకుపోవడం వల్ల రక్త ప్రసరణ తగ్గి పుండ్లు ఏర్పడటం వంటి కారణంగా ఒక్క ప్రభుత్వాస్పత్రిలోనే నెలకు 50 నుంచి 60 మందికి అవయవాల తొలగింపు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీరిలో కొందరికి వేళ్లు, మరికొందరికి పాదాలు, మోకాలు వరకూ, ఇంకొందరికీ తుంటి వరకూ కూడా తొలగించిన సందర్భాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. కాళ్లు, కాళ్ల వేళ్లు తొలగిస్తున్న వారిలో 90 శాతం మందికి మధుమేహం కారణం కాగా, 5 శాతం మందికి ధూమపానం, వెరికోజ్ వెయిన్స్ కారణమని వివరిస్తున్నారు. ఇంకా లెప్రసీ, వెన్నుముఖ గాయం, క్యాన్సర్ వంటి వ్యాధులు ఉన్న వారికి కూడా రక్తనాళాలు మూసుకు పోతుంటాయని వైద్యులు చెబుతున్నారు.

ఉయ్యూరుకు చెందిన శేఖర్(50)కు ఐదేళ్లుగా సుగర్ ఉంది. సరిగా మందులు వాడక పోవడంతో అదుపులో లేదు. దీంతో ఇటీవల ఎడమకాలుకు పుండు పడి మాన లేదు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రాగా, డాప్లర్ స్కాన్ చేసి రక్తప్రసరణ తగ్గినట్లు నిర్ధారించారు. దీంతో మోకాలు కింద భాగం వరకూ కాలును తొలగించాల్సి వచ్చింది.

చిరు వ్యాపారం చేసి జీవనం సాగించే పటమటకు చెందిన వెంకాయమ్మకు 60 ఏళ్లు. పదేళ్లుగా సుగర్ ఉంది. సరిగా మందులు వాడటం లేదు. దీంతో ఇటీవల మోకీలు వద్ద పుండు ఏర్పడి, కిందిబాగం అంతా రక్తప్రసరణ నిలిచిపోయి నల్లగా మారింది. దీంతో తుంటి కింద భాగం వరకూ కాలును తొలగించాల్సి వచ్చింది.


ప్రభుత్వాస్పత్రిలో సెప్టిక్ వార్డు

ఓపీకి 400 మందికిపైగా..

విజయవాడ ప్రభుత్వాస్పత్రి జనరల్ సర్జరీ ఓపీకి ప్రతి రోజూ 100 నుంచి 150 మంది అవుట్ పేషెంట్స్ వస్తుంటారు. వారిలో నిత్యం 15 నుంచి 20 మంది వరకూ వివిధ రకాల పుండ్లు, కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం వంటి కారణాలతో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నెలకు 350 నుంచి 400 మంది వరకూ వస్తారంటున్నారు. ఇలాంటి వారిలో కొందరికి పుండ్లకు డ్రెస్సింగ్ చేసి మందులు రాసి పంపుతుండగా, పుండ్లు తీవ్రంగా ఉన్న వారిని సెప్టిక్ వార్డులో అడ్మిట్ చేస్తున్నారు. కాళ్లకు, ఇతర శరీర అవయవాలపై మానని పుండ్లు(నాన్‌హీలింగ్ అల్సర్స్)తో ఎక్కువ మంది వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.


అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు..



కాళ్లకు రక్తప్రసరణ తగ్గడం వల్ల ఎక్కువగా మానని పుండ్లు ఏర్పడుతున్నాయి. కొందరికి కాళ్లు, వేళ్లు కుళ్లి నల్లగా అయిపోవడంతో, అలాంటి వారికి రక్త ప్రసరణ లేని భాగాన్ని తొలగించాల్సి వస్తోంది. నెలలో 50 నుంచి 60 వరకూ అలాంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. వేళ్లు, పాదాలు, మోకీలు వరకూ ఇలా రక్తప్రసరణను బట్టి అవయవాలను తొలగించాల్సి ఉంటుంది. తొలగించకుండా ఇన్‌ఫెక్షన్ పెరిగితే ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. కుళ్లిన పుళ్ల(గ్యాంగ్రీన్స్)తో వస్తున్న వారు ఉంటున్నారు. అలాంటి వారిని సెప్టిక్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ కె. అప్పారావు, జనరల్ సర్జరీ విభాగాధిపతి, జీజీహెచ్

అదుపులో ఉంచుకోవాలి..



అదుపులో లేని మధుమేహంతో అనేక దుష్ఫలితాలు రావచ్చు. కాళ్లకు రక్తప్రసరణ నిలిచిన వారిలో వేళ్లు, కాళ్ల పుళ్లుడి, నల్లగా మారుతుంది. దీంతో సర్జరీ చేసి, రక్తప్రసరణ నిలిచి ప్రాంతాన్ని తొలగించాల్సి వస్తుంది. మధుమేహం ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడుతూ అదుపులో ఉంచుకోవాలి. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయడం మంచిది. పాదాల రక్తప్రసరణ సరిగ్గా ఉందో లేదో పరీక్ష చేయించుకోవాలి. కిడ్నీ, గుండె, కంటి రెటీనా వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తొలిదశలోనే సమస్యను గుర్తించి, మరింత తీవ్రతరం కాకుండా చూడవచ్చు.

– డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి, మధుమేహ నిపుణులు, విజయవాడ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943